www.visalaandhra.com
శనివారం
04-10-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 10, సంచిక : 13
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Hyderabad,Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

మల్టీకలర్ ప్రింటింగ్
ఇప్పుడు మన విశాలాంధ్రలో
మ్యాగ్జైన్స్
లామినేషన్
గమ్ బైండింగ్
బుక్ వర్క్స్ మరియు
పోస్టర్లు
పాంప్లేట్స్
ప్రింట్ చేయబడును
సంప్రదించండి: 94405 73343

అవకాశాల గని తెలంగాణ



- యూనికార్న్ అంటే లక్షల జీవితాలను ప్రభావితం చేయడం
- 'జీటో కనెక్ట్ 2025' ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్ బాబు

విశాలాంధ్ర - హైదరాబాద్ : 'విలువలతో కూడిన వృద్ధి'కి కేరాఫ్‌గా తెలంగాణ మార్గదర్శకంగా మారిందని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. పారిశ్రామికాభివృద్ధికి అత్యంత అనుకూలంగా ఉన్న రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని పారిశ్రామికవేత్తలను కోరారు. జైన్ ఇంటర్నేషనల్ ట్రేడ్ ఆర్గనైజేషన్(జీటో) హైదరాబాద్ ఛాప్టర్ అధ్వర్యంలో హైటెక్స్, హెచ్ఐసీసీలో మూడు రోజులపాటు నిర్వహించనున్న 'జీటో కనెక్ట్ 2025'ను కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, కిషన్ రెడ్డితో కలిసి శుక్రవారం ఆయన లాంఛనంగా ప్రారంభించారు. శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ఒకప్పుడు పారిశ్రామికవేత్తలు ప్రభుత్వాలిచ్చే రాయితీలు, ప్రోత్సాహాలను చూసే పెట్టుబడులు పెట్టేవారన్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే నిర్ణయం తీసుకుంటున్నారన్నారు. భవిష్యత్తు కోసం ఎదురు చూడకుండా, భవిష్యత్తునే తెలంగాణ నిర్మిస్తోందన్నారు.

తెలంగాణ అవకాశాలగని అని, పరిశ్రమల ఏర్పాటుకు ఇతర రాష్ట్రాలతో పోలిస్తే అత్యంత అనుకూల పరిస్థితులున్నాయని వివరించారు. జైన సమాజం 'సేవా' స్ఫూర్తిని, తెలంగాణ ఇన్నోవేషన్ ఎకో సిస్టమ్ తో అనుసంధానిస్తే ప్రపంచం కోరుకుంటున్న నైతిక వృద్ధి నమూనా ఆవిష్కృతమవుతుందన్నారు. నిజమైన యూనికార్న్ అంటే బిలియన్ డాలర్ల విలువ కాదని, లక్షలాది మంది జీవితాలను ప్రభావితం చేయడమని యువ పారిశ్రామికవేత్తలు, ఆవిష్కర్తలకు సూచించారు. యోగా గురువు రాందేవ్ బాబా, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు, జీటో హైదరాబాద్ ఛాప్టర్ ప్రతినిధులు రోహిత్ కొఠారి, లలిత్ చోప్రా, విశాల్ అంచాలియా, బీఎల్ భండారీ, సుశీల్ తదితరులు పాల్గొన్నారు

భారీగా పెరిగిన మద్యం విక్రయాలు

విశాలాంధ్ర-హైదరాబాద్ : తెలంగాణలో మద్యం విక్రయాలు భారీగా పెరిగాయి. ఈ ఏడాది సెప్టెంబరులోనే రూ.3,046 కోట్ల మేర మద్యం అమ్మకాలు జరిగాయని ఎక్సైజ్ అధికారులు తెలిపారు. ఈ ఏడాది సెప్టెంబరు 29న రూ.278 కోట్లు, 30న రూ.333 కోట్లు, అక్టోబర్ 1న రూ.86.23 కోట్ల మద్యం అమ్మకాలు జరిగాయి. గత ఏడాదితో పోలిస్తే ఈ 3 రోజుల్లోనే 60 నుంచి 80 శాతం వరకు అమ్మకాలు పెరిగాయి. ఈ ఏడాది ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా 29.92 లక్షల కేసుల మద్యం, 36.46 లక్షల కేసుల బీర్లు విక్రయించారు. గత ఏడాదితో పోలిస్తే 7 శాతానికి పైగా మద్యం విక్రయాలు పెరిగాయి. మద్యం అమ్మకాలు పెరగడంతో ఎక్సైజ్ శాఖకు రాబడి పెరిగింది.

నేడు బీహార్‌కు సీఈసీ, ఈసీ

న్యూఢిల్లీ: ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేష్ కుమార్, ఎన్నికల కమిషనర్లు (ఈసీలు) వివేక్ జోషి, ఎస్ఎస్ సంధు శనివారం నుంచి రెండు రోజులపాటు బీహార్‌లో పర్యటిస్తారు. బీహార్‌లో ఎన్నికల సన్నాహాలను సమీక్షిస్తారని అధికారులు తెలిపారు. 243 మంది సభ్యులు కలిగిన బీహార్ అసెంబ్లీ పదవీ కాలం నవంబరు 22తో ముగుస్తుంది. రాష్ట్రంలో ఎన్నికలు ఈ నెలాఖరు నుంచి నవంబరులో ప్రారంభమై బహుళ దశల్లో జరిగే అవకాశం ఉంది. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించే ముందు ఎన్నికల అధికారులు రాష్ట్రాలను

- మిగతా 2 లో

జీఎస్టీ వసూళ్లలో వృద్ధి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: జీఎస్టీ వసూళ్లలో గణనీయమైన వృద్ధి నమోదైందని రాష్ట్ర పన్నుల ప్రధాన కమిషనర్ ఏ.బాబు తెలిపారు. జీఎస్టీ 2.0 ద్వారా అనేక లావాదేవీలపై పన్నుల శాతం తగ్గడంతో వ్యాపార లావాదేవీలు మందగించినప్పటికీ ఈనెలలో 7.45 శాతం (రూ.2,789 కోట్లు) జీఎస్టీ నికర వసూళ్లు నమోదైనట్లు శుక్రవారం ఒక ప్రకటన చేశారు. రూ.3,653 కోట్ల స్థూల వసూళ్లతో రికార్డు నమోదు కాగా, సెప్టెంబర్, 2023తో పోల్చితే, ఈనెల జీఎస్టీ నికర వృద్ధి 12.67 శాతం పెరిగిందన్నారు. సెప్టెంబర్, 2024తో పోల్చితే ఈ

- మిగతా 2 లో

కలిసివచ్చే పార్టీలతో సర్దుబాటు

- స్థానిక ఎన్నికలపై కూనంనేని
- బీసీ రిజర్వేషన్లపై కొందరివి డబుల్ డ్రామాలు

విశాలాంధ్ర - హైదరాబాద్ : స్థానిక సంస్థల ఎన్నికల్లో సీట్ల సర్దుబాటులో కలిసివచ్చే కాంగ్రెస్, సీపీఎం, వామపక్షపార్టీలతో కలిసి ముందుకెళ్తామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో ఈ నెల ఎనిమిదో తేదీన వెలువడనున్న కోర్టు తీర్పు ఆధారంగా, ఆ కేసులో సీపీఐ కూడా ఇంప్లీడ్ అయ్యే విషయంలోను, అలాగే స్థానిక సంస్థల ఎన్నికల అంశంపైన ఆదివారం జరిగే పార్టీ రాష్ట్ర సమితి సమావేశంలో నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. బీసీల రిజర్వేషన్ల అంశంలో చాలా మంది 'డబుల్ డ్రామాలు' ఆడుతున్నారని దుయ్యబట్టారు. మఖ్దూంభవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీపీఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట రెడ్డి, జాతీయ నాయకులు సయ్యద్ అజీజ్ పాషా, పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి .నర్సింహ, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.ఎస్.బోస్‌తో కలిసి కూనంనేని మాట్లాడుతూ శాసనసభలో బీసీ రిజర్వేషన్ల బిల్లులకు అన్ని రాజకీయ పార్టీలు అమోదం తెలిపాయని గుర్తు చేశారు. ఈడబ్ల్యుఎస్ పది శాతం రిజర్వేషన్లను పెంచడంతో రిజర్వేషన్లపైన ఉన్న 50 శాతం పరిమితి ఎప్పుడో దాటిందని అన్నారు. రాష్ట్రంలో బలమైన స్థానాలను గుర్తించి, ఆయా స్థానాల్లో పోటీ చేసేందుకు సిద్ధమవ్వాలని పార్టీ శ్రేణులకు ఎప్పుడో పిలుపునిచ్చినట్టు కూనంనేని వివరించారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రస్తావించిన సామాజిక కార్యకర్త సోనంను అరెస్ట్ చేయడాన్ని ఖండించారు. నిరంకుశంగా పరిపాలించాలని మోదీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. భారతదేశ ప్రజలను అవమానించే విధంగా వ్యవహరిస్తున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ను ప్రధాని మోదీ పల్లెత్తు మాట కూడా అనడం లేదన్నారు. అమెరికాలో చదువుతున్న వారు లక్ష డాలర్లు చెల్లించాలనడం అన్యాయమని అన్నారు. ట్రంప్ విషయంలో మోదీ తన వైఖరిని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. అజీజ్ పాషా మాట్లాడుతూ భారతదేశ వృద్ధి 0.3 శాతానికి, ఉత్పత్తి రంగం ఆరు నుంచి 3.6 శాతానికి తగ్గిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉత్పత్తి రంగాన్ని ప్రోత్సహించాల్సిన అవసరంఎంతైనా ఉందన్నారు. ఆయుధ సరఫరాలో భారతదేశం రెండవ స్థానంలో నిలిచిందన్నారు.

సోదరభావం... ఐక్యమత్యానికి పండగలు వేదికగా నిలవాలి

ప్రజల మధ్య సామరస్యం, ఐక్యమత్యానికి పండగలు వేదికలుగా నిలవాలని కూనంనేని అన్నారు. భిన్న మత, కులాచారాలున్న మన ప్రాంతాల్లో అనాదిగా వస్తున్న మంచి సంప్రదాయలు, ఆచారాలను పరస్పరం గౌరవిస్తూ ఐక్యంగా జరుపుకోవాలని కోరారు. కొత్తగూడెంలో వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపాలను ఆయన సందర్శించారు. ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. పేద వర్గాలను భాగస్వామ్యం చేసి వారిలో సంతోషాన్ని తామున్నామనే భరోసాను నింపాలని పేర్కొన్నారు. మన విశాల ప్రజాస్వామ్య భారతదేశంలో కులమతాలకు అతీతంగా సోదరభావంతో పండుగలు జరుపుకోవడం శుభపరిణామమన్నారు. భక్తి మార్గాన్ని ఎంచుకోవడం వల్ల రాగద్వేషాలకు దూరంగా ఉంటారనే నమ్మకం ఏర్పడాలన్నారు.

డీఎస్పీ అబ్దుల్ రెహమాన్, జిల్లా కార్యదర్శి ఎస్ కె. సాబీర్ పాషా, జిల్లా కార్యవర్గ సభ్యులు కంచర్ల జములయ్య, వాసిరెడ్డి మురళి, జిల్లా సమితి సభ్యులు వంగ వెంకట్, మునిగడప వెంకన్న, రమణమూర్తి, మాజీ కౌన్సిలర్లు యూసుఫ్, ధర్మరాజు, మునిగడప పద్మ, భూక్య శ్రీనివాస్, మాచర్ల శ్రీనివాస్, బోయిన విజయ్ కుమార్, బి.సత్యనారాయణ చారి, దుర్గ, నాయకులు ఎస్ కె. ఫహీమ్, ఖయ్యూం, కమల్, మధు, తూముల శీను, మండలరాజు, పాటి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

అలయ్ బలయ్‌లో ప్రముఖులు

విశాలాంధ్ర-హైదరాబాద్: నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ కుమార్తె విజయలక్ష్మి అధ్వర్యంలో 'అలయ్ బలయ్' కార్యక్రమం శుక్రవారం ఉదయం జరిగింది. ఏటా దసరా మర్నాడు జరిగే ఈ కార్యక్రమానికి మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సుప్రీంకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ, బీజేపీ ఎంపీ లక్ష్మణ్, ప్రముఖ సినీనటులు నాగార్జున, బ్రహ్మానందం, ఎమ్మెల్యే సుజనాచౌదరి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, సీపీఐ నేత నారాయణ, ప్రొఫెసర్ కోదండరామ్, మాజీ ఎంపీ వి.హనుమంతరావు, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ తదితరులు హాజరయ్యారు. దత్తాత్రేయ వారికి కండువాలు వేసి స్వాగతం పలికారు. తెలంగాణ ఉద్యమ సమయంలో రాజకీయ నాయకుల మధ్య ఐక్యత కోసం దత్తాత్రేయ 'అలయ్ బలయ్' ప్రారంభించారు. తెలంగాణ సంస్కృతి, ఆహారపు అలవాట్లను చాటిచెప్పేలా అలయ్ బలయ్ మొదలైంది. అలయ్ బలయ్ ఒక సంప్రదాయం మాత్రమే కాదని, తెలంగాణ ఆత్మ అని దత్తాత్రేయ అభివర్ణించారు. సేంద్రీయ వ్యవసాయం వైపు అడుగులు వేయాలంటూ రైతులకు ఆయన పిలుపునిచ్చారు. పరస్పర సహకారంతో ముందుకు వెళ్లాలని తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులకు బండారు సూచించారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ పరిపాలన సౌలభ్యం కోసమే రాష్ట్రాల విభజన జరిగినట్లు పేర్కొన్నారు. ప్రాంతాలకు అతీతంగా కలిసికట్టుగా ఉండాలంటూ తెలుగు రాష్ట్రాల ప్రజలకు

- మిగతా 2 లో

ప్రముఖ రచయిత లల్లాదేవి మృతి

గుంటూరు: ప్రముఖ రచయిత లల్లాదేవి కన్నుమూశారు. ఆయన అసలు పేరు పరుచూరి నారాయణాచార్యులు. 'కదలివచ్చిన కనకదుర్గ', 'శ్వేతనాగు' చిత్రాలు లల్లాదేవి నవల ఆధారంగానే రూపుదిద్దుకున్నాయి.'లల్లాదేవి' పేరుతో పలు కథలు, నవలలు రాసిన పరుచూరి నారాయణాచార్యులు అక్టోబర్ 3వ తేదీ తెల్లవారు జామున కన్నుమూశారు. ఆయనకు 80 సంవత్సరాలు. కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన గుంటూరులోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుది శ్వాస

- మిగతా 2 లో

ఇదీ లోకం!

రామిరెడ్డి భౌతికకాయానికి రేవంత్ నివాళి

విశాలాంధ్ర - హైదరాబాద్ : మాజీ మంత్రి రామిరెడ్డి దామోదర్ రెడ్డి భౌతికకాయానికి సీఎం రేవంత్ రెడ్డి నివాళులర్పించారు. హైదరాబాద్‌లోని ఏఐజీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ రెండు రోజుల క్రితం ఆయన మృతి చెందారు. శుక్రవారం ప్రజల సందర్శనార్థం జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో రామిరెడ్డి భౌతికకాయాన్ని ఉంచారు. రేవంత్ రెడ్డితో పాటు పలువురు నాయకులు రామిరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి నివాళులర్పించిన వారిలో ఉన్నారు. కోదండరెడ్డి మాట్లాడుతూ దామోదర్ రెడ్డి, తాను ఒకేసారి ఎమ్మెల్యేలుగా ఎన్నికై అసెంబ్లీలో అడుగు పెట్టామని అన్నారు. ప్రజా సమస్యలపై ఆయన అలుపెరగని పోరాటం చేశారని తెలిపారు.

సీపీఐ ప్రముఖులు...

రామిరెడ్డి భౌతికకాయానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి, జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె. నారాయణ, జాతీయ మాజీ కార్యదర్శి సయ్యద్ అజీత్ పాషా, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొమ్మగాని ప్రభాకర్, రాష్ట్ర సమితి సభ్యుడు కేవీఎల్ నివాళులర్పించారు.

పుష్కరాలకు పోలవరం



- జనవరి కల్లా ఎడమ కాలువ పనులు పూర్తి
- వచ్చేనెల నుంచే ప్రధాన డ్యామ్ పనులు
- జలవనరుల శాఖ సమీక్షలో చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: గోదావరి పుష్కరాల నాటికి పోలవరం ప్రాజెక్టు పూర్తి కావాలనే లక్ష్యంతో పనులు వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను, కాంట్రాక్టు సంస్థలను ఆదేశించారు. నిర్దేశిత గడువులోగా లక్ష్యానికి అనుగుణంగా శరవేగంగా పనులు జరగాలని సీఎం సూచించారు. సచివాలయంలో పోలవరం ప్రాజెక్టు పనుల పురోగతిపై ముఖ్యమంత్రి శుక్రవారం సమీక్ష నిర్వహించారు. కేంద్ర జలసంఘం, నిపుణుల కమిటీ నుంచి ఎప్పటికప్పుడు ప్రాజెక్టు పనులపై అనుమతులు తీసుకుని పనులు పూర్తి చేయాలని చంద్రబాబు ఆదేశించారు. పనుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ వద్దని స్పష్టం చేశారు. డయాఫ్రం వాల్ మొత్తం 63,656 క్యూబిక్ మీటర్లకుగాను 37,302 క్యూబిక్ మీటర్ల మేర పనులు పూర్తయ్యాయని, బట్రస్ డ్యామ్ పనులు వంద శాతం, వైబ్రో కాంపాక్షన్ పనులు 74 శాతం మేర పూర్తయినట్లు సీఎంకు అధికారులు వివరించారు. ఈ ఏడాది డిసెంబరు నాటికి డయాఫ్రం వాల్ పనులు పూర్తి కావాలని సీఎం నిర్దేశించారు. ప్రాజెక్టులో ప్రధాన డ్యామ్

- మిగతా 2 లో

భారత్ ఇక సంయమం చూపదు

ఉగ్రవాదం ఆపకపోతే ఆపరేషన్ సిందూర్ 2.0నే

పాక్‌ను హెచ్చరించిన ఆర్మీ చీఫ్ జనరల్ ద్వివేది

జైపూర్: ప్రపంచ పటంలో తన స్థానాన్ని నిలుపుకోవాలనుకుంటే పొరుగు దేశం తన గడ్డపై ఉగ్రవాదాన్ని ప్రోత్సహించడం మానేయాలని భారత ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది శుక్రవారం పాకిస్థాన్‌ను గట్టిగా హెచ్చరించారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో న్యూఢిల్లీ చూపిన సంయమం భవిష్యత్‌లో సైనిక వివాదం తలెత్తినప్పుడు పునరావృతం కాదని సైనికాధిపతి అన్నారు. భారత సైనికులు చర్యకు సిద్ధంగా ఉండాలని కోరారు. రాజస్థాన్‌లోని శ్రీగంగానగర్ జిల్లా అనుప్‌గఢ్‌లో సైనికులను ఉద్దేశించి జనరల్ ద్వివేది మాట్లాడుతూ 'ఒక దేశంగా భారతదేశం ఈసారి పూర్తిగా సిద్ధంగా ఉంది. ఈసారి ఆపరేషన్ సిందూర్ 1.0 సమయంలో చూపిన సంయమం చూపదు. ఈసారి మనం ఒక అడుగు ముందుకు వేసి పాకిస్థాన్ ప్రపంచ పటంలో ఉండాలనుకుంటున్నారా లేదా అని ఆలోచించేలా వ్యవహరిస్తాము' అని స్పష్టం చేశారు. పాకిస్థాన్ ప్రపంచ పటంలో తన స్థానాన్ని నిలుపుకోవాలనుకుంటే, అది తన దేశంలో ఉగ్రవాదాన్ని ప్రోత్సహించడం ఆపవలసి ఉంటుందని ఆయన నొక్కి చెప్పారు. 'ఇప్పుడే పూర్తిగా సిద్ధంగా ఉండండి. దేవుడు కోరుకుంటే, అవకాశం త్వరలో వస్తుంది' అని ఆయన అన్నారు. ఆపరేషన్ సిందూర్ సందర్భంగా

- మిగతా 2 లో

లోకేశ్ వర్సెస్ ఖర్గే

టెక్ హబ్ విస్తరణపై మాటల యుద్ధం

అహంకారం... పరాన్నజీవి వ్యాఖ్యల దుమారం

ప్రాంతీయ వివాదానికి అవకాశం

బెంగళూరు: కర్నాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య 'ఐటీ' చిచ్చు మొదలైంది. రెండు రాష్ట్రాల ఐటీ మంత్రులు ప్రియాంక్ ఖర్గే, నారా లోకేశ్ మాటల యుద్ధానికి దిగారు. టెక్నాలజీ హబ్ విస్తరణకు సంబంధించి పెద్ద వివాదానికి తెర తీశారు. పెట్టుబడులపై ఎవరికి వారు గొప్పలు చెప్పుకోవడంతో... వీరిద్దరి వివాదం ప్రాంతీయ పోరుగా మారుతోంది. బెంగళూరు మౌలిక వసతులకు సంబంధించి ఇబ్బందులు ఎదుర్కొంటున్న కంపెనీలు తమ రాష్ట్రానికి రావచ్చంటూ లోకేశ్ నవ్వుతూ అన్న మాట... రెండు రాష్ట్రాల అభివృద్ధి నమూలపై వివాదంగా మారింది. ప్రత్యామ్నాయాల అన్వేషణకు ఒత్తిడి తెస్తున్న బెంగళూరు ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) వెంబడి ఎదురయ్యే సవాళ్లపై నివేదికల మీద లోకేశ్

- మిగతా 2 లో

విశాలాంధ్ర

ఆధునిక బానిసత్వమా?

- కొత్త కార్మిక చట్టాలు, 13 గంటల పనిపై ప్రజాగ్రహం
- కదం తొక్కిన గ్రీస్ కార్మికులు: 24 గంటల సమ్మెతో స్తంభించిన దేశం

ఏథెన్స్: పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తూ రోజుకు 13 గంటలు పనిచేయాలంటూ ఒత్తిడి తెస్తూ ఉద్యోగులపై మోయలేని పని భారాన్ని మోపే ప్రయత్నం ఆధునిక బానిసత్వానికి దారితీస్తోందంటూ గ్రీస్ ప్రజలు, కార్మిక నాయకులు కన్నెర్రజేశారు. కార్మికులు దోపిడీకి గురవుతారని ఆందోళన వ్యక్తంచేశారు. సంస్కరణల పేరిట ఆధునిక బానిసత్వానికి దారితీసేలా కొత్త చట్టాలు ఉన్నాయని మండిపడ్డారు. అరకొర వేతనానికి మితిమీరి పనిచేయించడం ఎక్కడి న్యాయమంటూ మిట్సోటకీ ప్రభుత్వాన్ని నిలదీశారు. 13 గంటల పని ఆటవికమంటూ కార్మికులు గర్జించారు. 13 గంటలు పనిచేస్తే కార్మికులు/ఉద్యోగులు అలసిపోతారని, ఇది వారి సహనానికి పరీక్ష పెట్టడమే అవుతుంది తప్ప అభివృద్ధి అనిపించుకోదని దుయ్యబట్టారు. 13 గంటల పనిని నిర్దేశించే కొత్త కార్మిక చట్టాలను ముక్తకంఠంతో వ్యతిరేకించారు. పాలకుల తీరును తీవ్రంగా ఆక్షేపించారు. ఏటా 150 గంటలు గరిష్ఠంగా అదనపు గంటలు పనిచేయాల్సి వస్తుందన్నారు. నూతన చట్టాల ఉపసంహరణకు డిమాండ్ చేస్తూ 24 గంటల సార్వత్రిక సమ్మె చేశారు. గ్రీస్ మొత్తం ఆందోళనలు, నిరసనలు, ప్రదర్శనలు జరిగాయి. వేలాది మంది వీధుల్లోకి వచ్చి కొత్త చట్టాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్లకార్డులు, బ్యానర్లు ప్రదర్శించారు. రవాణాను స్తంభింపజేశారు. దీంతో ప్రభుత్వ, ప్రైవేటు రంగాల కార్యకాలాపాలు నిలిచిపోయాయి. ట్యాక్సీలు, రైళ్లు, బస్సులు, సబ్‌వేలు, ట్రామ్‌లు, ట్రాలీలు నడవలేదు. స్కూళ్లు, కోర్టులు, ఆసుపత్రులు, మున్సిపల్ కార్యాలయాలు పనిచేయలేదు. సముద్రం ప్రశాంతంగా కనిపించింది. ఫెర్రీలు, నౌకలు సముద్రంలోకి వెళ్లలేదు.

కార్మికుల సమ్మెకు అన్ని వర్గాల మద్దతు లభించింది. ఏథెన్స్, థెస్సలోనికి నగరాల్లో 8వేల మందికిపైగా సమ్మె చేశారు. వారానికి ముప్పై ఏడున్నర గంటల పని, ఒప్పందాలపై ఏకాభిప్రాయానికి జనరల్ కాన్ఫరెన్స్ ఆఫ్ వర్కర్స్ ఆఫ్ గ్రీస్ పిలుపునిచ్చింది. 'ఇది అమానవీయం, అన్యాయం' అంటూ ఆల్ వర్కర్స్ మిలిటెంట్ ఫ్రంట్ (పీఏఎంఈ) ఆగ్రహం వ్యక్తంచేసింది. పర్యాటకం సహా 24 గంటలు పనిచేసే రంగాల్లో వారానికి ఆరు రోజులు తప్పనిసరిగా పనిచేయాలన్న ఆదేశాలను వ్యతిరేకిస్తూ 2024లోనూ ఇదే స్థాయిలో ఆందోళనలు భారీస్థాయిలో జరిగాయి. అప్పుడు కూడా వేలాది మంది ప్రదర్శనలు నిర్వహించారు. ప్రస్తుతం కొత్త కార్మిక చట్టాలతో పాటు పలస్తీనాలో ఇజ్రాయిల్ మారణహోమం, అమానవీయ పరిస్థితులు, గాజా ఎయిడ్ ఫ్లోటిల్లాకు విఘాతం కలిగించడానికి వ్యతిరేకిస్తూ భారీ ఆందోళనలు జరిగాయి.

మాది ప్రత్యేక బంధం

- బాహ్య ఒత్తిళ్లకు భారత్ తలొగ్గదు-అవమానిస్తే సహించదు
- ట్రంప్ విధానాలు అమెరికాకు చేటు: సోచి సదస్సులో పుతిన్

మాస్కో: తమ దేశానికి, భారతదేశానికి మధ్య బంధం ప్రత్యేకమైనదని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ అన్నారు. భారత్‌కు వాణిజ్య ఇబ్బందులు తొలగించేలా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. బాహ్య ఒత్తిళ్లకు భారత్ తలొగ్గబోదని, అవమానిస్తే సహించదని పుతిన్ వక్కాణించారు. తమ దేశం నుంచి చమురు కొనుగోలు చేస్తున్న కారణంగా అమెరికా సుంకాలతో ప్రపంచ దేశాలపై రెచ్చిపోతుండటాన్ని తప్పుపట్టారు. డొనాల్డ్ ట్రంప్ విధానాలతో అమెరికాకే నష్టమన్నారు. మాస్కోతో న్యూఢిల్లీకి ప్రత్యేక బంధం ఉందన్నారు. సోవియట్ కాలం నుంచే సత్సంబంధాలు కొనసాగుతున్నాయని దక్షిణ రష్యా, సోచిలోని వాల్డై డిస్కషన్ క్లబ్‌లో మాట్లాడిన సందర్భంగా పుతిన్ అన్నారు. ఈ సదస్సులో 140 దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు. రష్యా వాణిజ్య భాగస్వాములపై అధిక సుంకాలు విధిస్తే ప్రపంచంలోని ఇంధన ధరలపై ప్రభావం పడుతుందని పుతిన్ హెచ్చరించారు. అలాంటి చర్య యూఎస్ ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లు పెంచేస్తుందని, దాంతో అమెరికా ఆర్థిక వ్యవస్థ మందగిస్తుందన్నారు. భారత్-రష్యా మధ్య ఎన్నడూ ఎలాంటి సమస్య లేదని చెప్పారు. సోవియట్ యూనియన్ కాలం నుంచే తమ మధ్య ఘర్షణలు లేవన్నారు. తమ దేశాల మధ్య రాజకీయ, దౌత్య, సాంస్కృతిక, మానవీయ బంధాలు బలంగా ఉన్నాయన్నారు. భారతీయ సంస్కృతిపై రష్యన్లు ఆదరిస్తారని చెప్పారు. భారత్‌తో కృత్రిమ మేధ (ఏఐ) భాగస్వామ్యానికి సిద్ధమని చెప్పారు. మరిన్ని వ్యవసాయ, ఔషధ ఉత్పత్తులు కొనుగోలు చేస్తామని పుతిన్ అన్నారు. అమెరికా మార్కెట్‌కు యురేనియం సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. అదే సందర్భంగా ఉక్రెయిన్‌పై యుద్ధాన్ని ప్రస్తావిస్తూ, తమ దేశానిది మేకపోతు గాంభీర్యమన్న ట్రంప్ వ్యాఖ్యలను పుతిన్ తోసిపుచ్చారు. 'యూరప్‌లో పెరుగుతున్న రక్షణాత్మక చర్యలను నిశితంగా గమనిస్తున్నట్లు తెలిపారు. రష్యా యుద్ధం చేస్తున్నది ఉక్రెయిన్‌తో కాదు నాటోతో అని, తమను 'పేపర్ టైగర్'గా ట్రంప్ పిలుస్తున్నారని, అప్పుడు నాటో ఏమిటో ఆయన చెప్పాలని పుతిన్ చురకలు అంటించారు. రష్యా ప్రజలకు భారతీయ సినిమా ఎంతో ఇష్టమని, ఈ చిత్రాలను నిరంతరం ప్రసారం చేసే టీవీ ఛానల్ రష్యాలో ఉందన్నారు. గతేడాది బ్రిక్స్ సదస్సు సందర్భంగానూ భారతీయ చిత్రాలపై అభిమానాన్ని ప్రతిన్ చాటుకున్నారు.

జీఎస్టీ వసూళ్లలో వృద్ధి

(మూడోపేజీ తరువాయి)

ఏడాది సెప్టెంబరులో నికర జీఎస్టీ సేకరణలు 7.45 శాతానికి, స్థూల సేకరణలు 4.19 శాతానికి పెరిగినట్లు తెలిపారు. ఈ ఏడాది వసూళ్లు రూ.1,185 కోట్లకు చేరాయని, ఇది సెప్టెంబర్ 2024తో పోల్చితే 8.28 శాతం అధికమని ఆయన అన్నారు. వినియోగం పెరగడం సమర్థవంతమైన పన్ను విధానం, కఠినమైన అమలు చేయడంతో ఈ వృద్ధి సాధ్యమైనట్లు తెలిపారు.
సెప్టెంబర్ 2023తో పోల్చితే 5.50 శాతం వృద్ధి నమోదైందన్నారు. సెప్టెంబర్ 2025లో ఐజీఎస్టీ సెటిల్‌మెంట్ ద్వారా రాష్ట్రానికి రూ.1,605 కోట్లు లభించగా, సెప్టెంబర్ 2024తో పోల్చితే 6.84శాతం ఎక్కువని, సెప్టెంబర్ 2023తో పోల్చితే 18.62 శాతం వృద్ధి నమోదైందని, దీనికి ప్రధానంగా సమర్థవంత పర్యవేక్షణ వ్యవస్థలు, నిర్ణీత కాలంలో జరిగిన సమన్వయం, మెరుగైన సెటిల్‌మెంట్ విధానాలని ఏ.బాబు వెల్లడించారు. తద్వారా పెట్రోలియం రంగ ఆదాయానికి తోడ్పాటు లభించిందని, వృత్తిపరమైన పన్నుల వసూళ్లల్లో అద్భుత వృద్ధి నమోదైనట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో ఎగవేతదారుల సమాచారం ఇచ్చిపుచ్చుకోవడం, ఐజీఎస్టీ రివర్సల్ మెకానిజానికి ప్రాముఖ్యత ఇవ్వడం, పన్ను చెల్లింపుదారుల క్రెడిట్ లెడ్జర్లలో ఐజీఎస్టీ మొత్తాలను స్పష్టంగా నివేదించడంతో వసూళ్లు పెరిగినట్లు ఏ.బాబు వెల్లడించారు.

ప్రముఖ రచయిత లల్లాదేవి మృతి

(మొదటిపేజీ తరువాయి)

విడిచారు. 1980 దశకంలో తెలుగు సాహితీ రంగంలో సుప్రసిద్ధులైన రచయితల్లో లల్లాదేవి ఒకరు. ఆయన రాసిన పలు నవలలు ముందు సీరియల్స్‌గా వచ్చాయి. చారిత్రక, జానపద, సాంఘిక రచనలు చేయడంతో ఆయన దిట్ట. పాములపై పరిశోధన చేసిన ఏకైక రచయితగా ఆయనకు పేరు. పలు తెలుగు సినిమాలకు రచయితగా ఆయన పనిచేశారు. బి.విఠలాచార్య దర్శకత్వం వహించిన చివరి చిత్రం 'కరుణించిన కనకదుర్గ'కు లల్లాదేవి కథను అందించారు. కృష్ణా పుష్కరాలు దృష్టిలో పెట్టుకుని జానపద, పౌరాణిక, సాంఘిక చిత్రంగా విఠలాచార్య దీన్ని మలిచారు. లల్లాదేవి రాసిన ప్రముఖ నవల 'శ్వేతనాగు' ఆధారంగా సీవీ రెడ్డి... సంజీవ దర్శకత్వంలో 'శ్వేతనాగు' పేరుతోనే సినిమా నిర్మించారు. ఇది సౌందర్య నటించిన 100వ చిత్రం. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావుకు పరుచూరి నారాయణాచార్యులు అత్యంత సన్నిహితులు. కొంతకాలం ఆయన దగ్గర కార్యదర్శిగా పనిచేశారు. 'లల్లాదేవి' మృతి పట్ల పలువురు సాహితీవేత్తలు, సినీ ప్రముఖులు, రాజకీయ నాయకులు ప్రగాఢ సంతాపం తెలిపారు. 'లల్లాదేవి' స్వగ్రామం గుంటూరు జిల్లా ప్రత్తిపాడు సమీపంలోని నిమ్మగడ్డవారిపాలెం. ఆయన కొన్ని వందల కథలు, నవలలు, నాటికలు, నాటకాలు రాశారు.

నేడు బీహార్‌కు సీఈసీ, ఈసీ

(మొదటిపేజీ తరువాయి)

సందర్శించడం సాధారణం. అక్టోబరు 4, 5 తేదీల్లో ఎన్నికల కమిషనర్లు రాష్ట్రంలో ఉంటారని అధికారులు శుక్రవారం తెలిపారు. ఎన్నికల సంసిద్ధతను సమీక్షిస్తూ ఎన్నికల సంఘం రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఉన్నత పోలీసు, పరిపాలన, రాష్ట్ర ఎన్నికల అధికారులను కలుస్తుంది. ఇదిలాఉండగా, బీహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ముగిసింది. సెప్టెంబరు 30న ప్రచురించబడిన తుది ఓటర్ల జాబితాలో దాదాపు 7.42 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. రెండు దశాబ్దాల విరామం తర్వాత నిర్వహించిన ఎస్ఐఆర్ వల్ల కోట్లాది మంది నిజమైన పౌరులు ఓటు హక్కును కోల్పోతున్నారని ప్రతిపక్ష పార్టీలు తీవ్ర విమర్శలు చేశాయి.

అలయ్ బలయ్‌లో ప్రముఖులు

(మొదటిపేజీ తరువాయి)

పిలుపు నిచ్చారు. పండగ పూట ఒకే వేదికపైకి తీసుకు వచ్చి అందరూ కలుసుకునే విధంగా ఏర్పాటు చేసిన కార్యక్రమమే అలయ్ బలయ్ అని కేంద్ర మంత్రి వివరించారు.

సోదరభావాన్ని పెంపొందించే వేడుక: రాష్ట్రపతి

సోదరభావాన్ని పెంపొందించే వేడుక 'అలయ్ బలయ్' అని రాష్ట్రపతి ద్రౌపదీముర్ము అన్నారు. తెలంగాణ ప్రజలకు అభినందనలు తెలుపుతూ రాష్ట్రపతి సందేశమిచ్చారు. "తెలంగాణ ఆచారాలను పునరుజ్జీవింపజేయడానికి బండారు దత్తాత్రేయ అలయ్ బలయ్ పండుగను ప్రారంభించారు. ఇది సోదరభావాన్ని పెంపొందించే వార్షిక సాంస్కృతిక ఉత్సవం. అన్నివర్గాల ప్రజలను ఒక్కచోట చేర్చి తెలంగాణకు చెందిన గొప్ప సంస్కృతిని ప్రదర్శిస్తోంది. ప్రజల్లో ఐక్యత, సమాజ విలువలను వ్యాప్తి చేసేందుకు ఓ సామాజిక సమావేశంగా ఇది ఉపయోగపడుతోందని రాష్ట్రపతి పేర్కొన్నారు.

వణికిన ఉత్తరాంధ్ర

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి/విశాఖపట్నం/శ్రీకాకుళం : బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో ఉత్తరాంధ్ర వణుకుతోంది. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. వర్షాలు, వరదల కారణంగా వేర్వేరు ప్రాంతాల్లో నలుగురు మృతి చెందగా, వందలాది ఎకరాల్లో పంట భూములకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఒడిశాలో కుండపోత వర్షాలకు హిర మండలంలోని గొట్టా బ్యారేజీకి వరద ప్రవాహం అకస్మాత్తుగా పెరిగింది. శుక్రవారం మధ్యాహ్నం నాటికి దాదాపు లక్ష క్యూసెక్కులకు పైగా వరద రావడంతో అధికారులు బ్యారేజీకి ఉన్న అన్ని గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదిలారు. మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. దీంతో నదీ పరివాహక ప్రాంతాల్లో అనేక గ్రామాలు వరద నీటిలో చిక్కుకున్నాయి. వర్ష బీభత్సంతో అనేక చోట్ల భారీ వృక్షాలు నేలకొరిగాయి. చెట్లు కూలి విద్యుత్ తీగలపై పడడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. కొన్ని చోట్ల భారీ వృక్షాలు కూలి రహదారిపై పడడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో వర్ష బీభత్సానికి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. విశాఖ నగరంలో రోడ్లపై కూలిన చెట్లను జీవీఎంసీ, ఈపీడీసీఎల్ అధికారులు తొలగిస్తున్నారు. విశాఖ నగరంలో అనేక చోట్ల కార్లపై చెట్లు కూలిపోవడంతో తీవ్ర నష్టం వాటిల్లింది. లోతట్టు ప్రాంతాలు తీవ్ర జలమయమయ్యాయి. సముద్ర తీర ప్రాంతం అల్లకల్లోలంగా మారింది. వాయుగుండం ప్రభావంతో ఆంధ్రా-ఒడిశా సరిహద్దుల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఒడిశాలో కురుస్తున్న భారీ వర్షాలకు వంశధార నదికి వరద తాకిడి భారీగా పెరిగింది. శుక్రవారం మధ్యాహ్నం 110 క్యూసెక్కుల వరద నీరు హిర మండలం గొట్టా బ్యారేజీకి చేరింది. ప్రధానంగా కొత్తూరు మండలంలోని పెనుగోటువాడ, మాతల, కడుము, హంస, పునుటూరు, మాకవరం, కుద్దిగమ్ గ్రామాల చుట్టూ వరద నీరు చేరింది. దీంతో మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. శ్రీకాకుళం జిల్లాలోని పాతపట్నం వద్ద మహేంద్రతనయ నదిలో నీటి ప్రవాహం పెరుగుతోంది. దీంతో పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ శివారు మహేంద్రనగర్ వీధిలోకి వరద నీరు చేరింది. పాతపట్నంలో చేపట్టాల్సిన చర్యలపై అధికారులకు జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఉన్న 600 ఎకరాల్లో అరటి పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. అనేక చోట్ల వరి పంటలు నీటి మునిగాయి. చెరువులకు గండ్లు పడ్డాయి. పంట పొలాలు చెరువులను తలపించాయి. రహదారులకు గండ్లు పడి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఏజెన్సీ జిల్లాల్లో కురిసిన భారీ వర్షాలకు జనజీవనం స్తంభించిపోయింది. రిజర్వాయర్‌లో నీటి మట్టాలు గరిష్ట స్థాయికి చేరుకున్నాయి. వంశధార నదిలో పెరిగిన వరద కారణంగా భామిని మండలం కీసరలో 300 ఎకరాల్లో పంటలు నీటమునిగాయి. బూర్జ మండలంలో నారాయణపురం, చిన్నలంకాం పరిధిలో చాలా చోట్ల పంట పొలాలు ముంపులో ఉన్నాయి.

మృతుల కుటుంబాలకు రూ.4 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా : సీఎం

ఉత్తరాంధ్ర జిల్లాల్లో భారీ వర్షాలు, వరదల కారణంగా దెబ్బతిన్న రహదారులు, విద్యుత్‌ను వెంటనే పునరుద్ధరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. శుక్రవారం సచివాలయంలో ఉత్తరాంధ్ర జిల్లాల్లో వర్షాలు, వరద ప్రవాహాలపై ఉన్నతాధికారులు, ఆయా జిల్లాల కలెక్టర్లతో సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ జిల్లాల కలెక్టర్లు వీడియో కాన్ఫరెన్సు ద్వారా హాజరయ్యారు. ప్రస్తుతం ఆయా జిల్లాల్లో నెలకొన్న పరిస్థితులను ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం గొట్టా బ్యారేజి, తోటపల్లి బ్యారేజీ పరిధిలో భారీ ఎత్తున వర్షపాతం నమోదయిందని అధికారులు తెలిపారు. గొట్టా బ్యారేజీకి 1.89 లక్షల క్యూసెక్కులు, తోటపల్లికి 44 వేల క్యూసెక్కుల వరద వస్తోందని శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ ముఖ్యమంత్రికి వివరించారు. ఒడిశాలోని వేర్వేరు ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా వంశధార నదికి 1.05 లక్షల క్యూసెక్కుల నీరు వస్తోందని తెలిపారు. భారీ వర్షాలు, ప్రమాదాల కారణంగా మురీడు జిల్లాల్లో నలుగురు మృతి చెందినట్టు అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చారు. విశాఖ నగరం కంచరపాలెంలో ఒకరు, శ్రీకాకుళం జిల్లా మందసలో ఇద్దరు, పార్వతీపురం మన్యం జిల్లాలోని కురుపాంలో ఒకరు మృతి చెందినట్లు అధికారులు తెలిపారు.

దీనిపై స్పందించిన సీఎం మృతుల కుటుంబాలకు రూ.4 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. వరద కారణంగా నీట మునిగిన పంటను కూడా లెక్కించి పంట నష్టం అంచనాలను తయారు చేయాలన్నారు. అదే సమయంలో వర్షపు నీటిని సద్వినియోగం చేసుకునేందుకు గాను రిజర్వాయర్లను నీటితో నింపాలని సూచించారు. ప్రజల ఇబ్బందులను మానవీయ కోణంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు.

కాంగ్రెస్ పాలనలో ఆర్థిక విధ్వంసం: కేటీఆర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ పాలనలో తెలంగాణ ఆర్థిక వ్యవస్థ సంపూర్ణ విధ్వంసానికి గురైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. తాజాగా వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) వసూళ్ల వృద్ధి రేటులో దేశంలోనే అట్టడుగున ఉండటం దారుణమని అన్నారు. రెండేళ్ల క్రితం, కేసీఆర్ సమర్థ పాలనలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో నిలిచిందని ఆయన గుర్తు చేశారు. బీఆర్ఎస్ హయాంలో వ్యవసాయం నుంచి ఐటీ వరకూ అన్ని రంగాలకు రాష్ట్ర ప్రభుత్వం దన్ను ఇవ్వడంతో ఆర్థికవ్యవస్థ పరుగులు తీసి, రికార్డులు తిరగరాసిందని కేటీఆర్ పేర్కొన్నారు. కానీ, నేడు కాంగ్రెస్ పాలనలో అన్ని రంగాలూ నేలచూపులే చూస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.
వ్యవసాయం నుంచి రియల్ ఎస్టేట్ వరకూ దైన్యమే తాండవిస్తోందని మండిపడ్డారు. "అరాచకత్వం, అవినీతి, అనుభవలేమి కలగలసిన రేవంత్ పాలనలో తెలంగాణ ఆర్థిక విధ్వంసానికి గురవుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ విధ్వంసాన్ని వెంటనే ఆపడానికి చర్యలు తీసుకోవాలి" అని కేటీఆర్ డిమాండ్ చేశారు.

ఫిబ్రవరి 23 నుంచి ఏపీ ఇంటర్ పరీక్షలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర పరీక్షల షెడ్యూలును ఆంధ్రప్రదేశ్ ఇంటర్మీడియట్ విద్యామండలి జారీజేసింది. వచ్చే ఏడాది ఫిబ్రవరి 23వ తేదీ సోమవారం నుంచి ప్రథమ సంవత్సర విద్యార్థులకు, 24వ తేదీ మంగళవారం నుంచి ద్వితీయ సంవత్సర విద్యార్థులకు పరీక్షలు ప్రారంభమవుతాయి. ఈ మేరకు ఇంటర్మీడియట్ విద్యామండలి కార్యదర్శి డాక్టర్ నారాయణ భరత్ గుప్తా శుక్రవారం సర్క్యులర్ జారీజేశారు. ద్వితీయ సంవత్సర విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు ఫిబ్రవరి 1వ తేదీ నుంచి 10 వరకు జరుగుతాయి. ప్రథమ, ద్వితీయ సంవత్సర పరీక్షలు కలిపి 24 రోజులపాటు కొనసాగుతాయి. రోజుకొకటి చొప్పున ప్రథమ, ద్వితీయ సంవత్సర పరీక్షలు నిర్వహిస్తారు. ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి.

ప్రథమ సంవత్సర షెడ్యూలు:

ప్రథమ సంవత్సర పరీక్షలు ఫిబ్రవరి 23న తెలుగు పేపర్-1, సంస్కృతం, హిందీ, తమిళం, ఒరియా, కన్నడ, అరబిక్, ఫ్రెంచ్, పర్షియన్ పరీక్షలు నిర్వహిస్తారు. 25వ తేదీన ఇంగ్లీషు పేపర్-1, 27వ తేదీన బోటనీ, హిస్టరీ పేపర్-1, మార్చి 2న మేథమేటిక్స్ పేపర్-1ఏ, 5వ తేదీన మేథమేటిక్స్-1(బి), జువాలజీ పేపర్-1, 7వ తేదీన ఎకనామిక్స్ పేపర్-1, 10వ తేదీన ఫిజిక్స్ పేపర్-1, 12వ తేదీన కామర్స్ పేపర్-1, సోషియాలజీ పేపర్-1, ఫైన్ ఆర్ట్స్ మ్యూజిక్ పేపర్-1, 14వ తేదీన సివిక్స్ పేపర్-1, బ్రిడ్జి కోర్సు మేథమేటిక్స్ పేపర్-1(బైపీసీ స్టూడెంట్స్ కోసం), 24న మోడ్రన్ లాంగ్వేజీ పేపర్-1, జాగ్రఫీ పేపర్-1 నిర్వహిస్తారు.

ద్వితీయ సంవత్సర షెడ్యూలు:

ద్వితీయ సంవత్సర విద్యార్థులకు ఫిబ్రవరి 24న లాంగ్వేజీ పేపర్-2, 26న ఇంగ్లీషు పేపర్-2, 28న బోటనీ పేపర్-2, హిస్టరీ పేపర్-2 పరీక్షలు నిర్వహిస్తారు. మార్చి 3న మేథమేటిక్స్ పేపర్-2ఏ, సివిక్స్ పేపర్-2, 6న జువాలజీ పేపర్-2, ఎకనామిక్స్ పేపర్-2, 9న మేథమేటిక్స్ పేపర్-2బి, 11న కంప్యూటర్ పేపర్-2, సోషియాలజీ పేపర్-2, ఫైన్ ఆర్ట్స్, మ్యూజిక్ పేపర్-2, 13న ఫిజిక్స్ పేపర్-2, 16న మోడ్రన్ లాంగ్వేజీ పేపర్-2, జాగ్రఫీ-2, మేథమేటిక్స్-2 (బైపీసీ విద్యార్థులకు), 18న కెమిస్ట్రీ పేపర్-2, 23న పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ పేపర్-2, లాజిక్ పేపర్-2 నిర్వహిస్తారు.

పుష్కరాలకు పోలవరం

(మొదటిపేజీ తరువాయి)

ఎర్త్ కమ్ రాక్ ఫిల్ డ్యామ్ పనులను నవంబరు 1 నుంచే ప్రారంభించాలని, 2027 డిసెంబరుకు ఎట్టిపరిస్థితుల్లో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. పోలవరం కుడి కాలువను అనుసంధానించే సొరంగాల నిర్మాణం, ఎడమ కాలువకు అనుసంధానం చేసేలా అప్రోచ్ ఛానల్, హెడ్ రెగ్యులేటర్, ఇరిగేషన్ టన్నెల్, కేఎల్ బండ్‌లను, ప్రధాన ఎడమ కాలువను 2026 జనవరి నాటికల్లా అనకాపల్లి వరకూ పూర్తి చేయాలని సీఎం గడువు విధించారు. ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణ, నిర్వాసితులకు పరిహార, పునరావాసాన్ని నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సీఎం ఆదేశాలు జారీ చేశారు.

పోలవరం వద్ద పర్యాటక ఆకర్షణలు

దేశంలోనే అత్యుత్తమ ప్రాజెక్టుగా నిర్మిస్తున్న పోలవరం వద్ద పర్యాటకులను ఆకర్షించేలా నిర్మాణాలు ఉండాలని చంద్రబాబు సూచించారు. ప్రాజెక్టు నుంచి భద్రాచలం, పాపికొండలు, దిగువన ధవళేశ్వరం వరకూ వివిధ ప్రాంతాలను అద్భుతంగా తీర్చిదిద్దాలన్నారు. పోలవరం ప్రాజెక్టు కనెక్టివిటీ కింద ఐకానిక్ రోడ్డు నిర్మించి... దీనిని జాతీయ రహదారికి అనుసంధానించేలా చూడాలన్నారు. రాజమహేంద్రవరం కేంద్రంగా పర్యాటకాన్ని అభివృద్ధి చేసేలా అఖండ గోదావరి ప్రాజెక్టు చేపట్టాలని ముఖ్యమంత్రి అధికారులకు మార్గనిర్దేశనం చేశారు. పోలవరం ప్రాజెక్టులో పనుల పురోగతిని ఎప్పటికప్పుడు తెలుసుకునేలా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి... ఆర్టీజీఎస్‌కు అనుసంధానించాలని సూచించారు. వచ్చే వర్షాకాల సీజన్‌లోగా వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేయాలన్నారు. సమీక్షకు జలవనరుల శాఖమంత్రి నిమ్మల రామానాయుడు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి కె.విజయానంద్, ఉన్నతాధికారులు హాజరయ్యారు.

భారత్ ఇక సంయమం చూపదు

(మొదటిపేజీ తరువాయి)

పాకిస్థాన్‌లో ఉగ్రవాద స్థావరాలు ఉన్నాయని భారతదేశం ప్రపంచానికి రుజువు చేసిందని జనరల్ ద్వివేది అన్నారు. ఈ ఆధారాలను భారతదేశం వెలికితీయకపోతే, పాకిస్థాన్ వాటన్నింటినీ దాచిపెట్టి ఉండేదని ఆయన అన్నారు. ఏప్రిల్ 22 పహల్గామ్ దాడి తర్వాత ఆపరేషన్ సిందూర్‌ను ప్రారంభించినప్పుడు ప్రపంచం మొత్తం భారతదేశంతో నిలబడిందని ఆర్మీ చీఫ్ అన్నారు. ఆపరేషన్ సిందూర్ సందర్భంగా భారత సైన్యం పాకిస్థాన్ లోపల తొమ్మిది లక్ష్యాలను ఢీకొట్టిందని, వాటిలో ఏడు లక్ష్యాలను సైన్యం, రెండు లక్ష్యాలను వైమానిక దళం ధ్వంసం చేశాయని ఆయన అన్నారు. 'ఉగ్రవాదులకు హాని కలిగించాలని మాత్రమే కోరుకుంటున్నందున మేము లక్ష్యాలను గుర్తించాము. మేము వారి స్థావరాలపై దాడి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాము. వారి దేశం ఉగ్రవాదులను ప్రోత్సహించనంత వరకు పాకిస్థాన్ సాధారణ పౌరులపై మాకు ఎటువంటి ఫిర్యాదులు లేవు. ఉగ్రవాదులను ప్రోత్సహిస్తున్నందున ఆ ఉగ్రవాద లక్ష్యాలను ధ్వంసం చేశాము' అని జనరల్ ద్వివేది తెలిపారు. 'సరిహద్దు జనాభాను మేము సాధారణ పౌరులుగా కాకుండా సైనికులుగా పరిగణిస్తాము. అంటే వారు యుద్ధంలో మనతో భుజం భుజం కలిపి నిలబడతారు. ఇది చాలా కీలకం. ఎందుకంటే రాబోయే పోరాటం కేవలం సైన్యం పోరాటం కాదు, దేశం పోరాటం' అని అన్నారు. 1965, 1971 యుద్ధాల సమయంలో సాధారణ పౌరులు సైనికులతో భుజం భుజం కలిపి నిలిచిన చరిత్ర సాక్ష్యంగా ఉందని ఆర్మీ చీఫ్ అన్నారు. 'రాబోయే రోజుల్లో కూడా వారు మాతో చేరాలని మేము కోరుకుంటున్నాము. నేను వారికి కృతజ్ఞతలు చెప్పాలనుకుంటున్నాను. వారి ఉత్సాహం మన సైనికుల మనోధైర్యాన్ని పెంచుతుంది' అని తెలిపారు.

లోకేశ్ వర్సెస్ ఖడ్గే

(మొదటిపేజీ తరువాయి)

స్పందించారు. బెంగళూరుకు ఉత్తరం దిక్కున కొద్ది దూరంలోనే అనంతపురం ఉందని, అక్కడ ప్రపంచస్థాయి ఏరోస్పేస్, డిఫెన్స్ హబ్‌ను ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు చేస్తోందని ఆయన ఒక పోస్టు పెట్టారు. తద్వారా బెంగళూరు ట్రాఫిక్ కష్టాలు, పౌర సేవలకు సంబంధించిన అడ్డంకులు ఎదుర్కొనే సంస్థలకు వాణిజ్య కారిడార్‌గా అనంతపురాన్ని పరిచయం చేసే ప్రయత్నాన్ని లోకేశ్ చేశారు. కానీ కర్నాటక ఐటీ మంత్రి ప్రియాంక ఖడ్గే ఎక్స్ మాధ్యమంగా లోకేశ్‌ను దుయ్యబట్టారు. ఆంధ్రప్రదేశ్‌ను బలహీనమైన ఎకో వ్యవస్థగా వర్ణించారు. బెంగళూరు సాధించిన వృద్ధిపై ఆధారపడే పరాన్నజీవి అంటూ విమర్శించారు. తన వ్యాఖ్యలకు బలం చేకూర్చేలా ఆర్థిక డేటా ప్రస్తావించారు. 2035 నాటికి 8.5 శాతం జీడీపీ వృద్ధిని బెంగళూరు సాధిస్తుందని, రియల్ ఎస్టేట్ మార్కెట్ బాగా పుంజుకుంటుందని, ఆవిష్కరణల ర్యాంకింగ్ మెరుగవుతుందని, వలసదారులను ఆకర్షించే అగ్రగామి రాష్ట్రంగా కర్నాటక నిలుస్తుందని ఖడ్గే తన పోస్టులో పేర్కొన్నారు. కంపెనీల కోసం ఏపీ ఆరాటపడుతోందని విమర్శించారు. ఇతరులపై ఆధారపడి బతికే జీవిని ఏమంటారు? అన్న ఆయన ప్రశ్న ఆన్‌లైన్ వివాదానికి తెరతీసింది. ఖడ్గే అహంకారంగా మాట్లాడారంటూ విమర్శలు వచ్చాయి. లోకేశ్ సంయమనం పాటించారు. దేశంలోని కొత్త రాష్ట్రం నూతన అవకాశాలతో నిండివున్నదంటూ ఆంధ్రప్రదేశ్‌కు ప్రచారం కల్పించే ప్రయత్నం చేశారు. వైజాగ్, అనంతపురంలో నూతన వృద్ధి హబ్‌లు నిర్మించడం వెనుక బెంగళూరు వంటి మెట్రో నగరాలపై ఒత్తిడి పెంచే ఉద్దేశం లేదన్నారు. బెంగళూరు ఎదుర్కొనే పౌర సంబంధిత సవాళ్లను ప్రస్తావించారు. ఆ రాష్ట్రంలో వేల సంఖ్యలో గుంటలు పూడ్చాల్సి ఉందన్నారు. పరిపాలన రికార్డుపై ఖడ్గే సమాధానం కోరారు. ఆయన అహంకారంతో మాట్లాడారన్నారు. బెంగళూరును వీడే సంస్థలను తమ రాష్ట్రానికి తెచ్చుకునేందుకు ఆంధ్రప్రదేశ్ తీవ్రంగా ప్రయత్నిస్తున్న నేపథ్యంలోనే ఇద్దరు మంత్రుల మధ్య వాగ్వాదం జరిగింది. ఇటీవలి కాలంలో కొన్ని కంపెనీలను లోకేశ్ నేరుగా ఆహ్వానించారు. వైజాగ్ లేక అనంతపురాన్ని పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. ఏరోస్పేస్ విధానాలు, ప్రోత్సాహకాలతో ఆకర్షించే ప్రయత్నం చేశారు. భూములు సిద్ధంగా ఉన్నాయంటూ ఆశచూపారు. వాస్తవానికి కెంపగౌడ విమానాశ్రయం వద్ద ప్రధాన ఏరోస్పేస్ పోర్టు ప్రణాళికలను కర్నాటక ఆపేయడంతో లోకేశ్ తన చర్యలలో వేగం పెంచారు.

కాగా, రాష్ట్రాల మధ్య పెట్టుబడులు, ఆవిష్కరణలకు సంబంధించి పోటీ సాధారణమే అయినప్పటికీ తాజా పరిణామం ఆసక్తికరంగా మారింది. లోకేశ్ వైఖరి ఆంధ్రప్రదేశ్ ముందుచూపు, ఆకాంక్షలకు అద్దం పట్టగా... భారత టెక్ మ్యాప్‌లో బెంగళూరు ఆధిపత్యాన్ని సమర్థించుకునేలా ప్రియాంక్ ఖడ్గే వైఖరి ఉందన్న అభిప్రాయం వ్యక్తమైంది.

డిజిట్ ఇన్సూరెన్స్‌కు 'బెస్ట్ ఫిన్‌టెక్ ఇన్సూరెన్స్ అవార్డు'

ముంబై: భారతదేశంలో ప్రముఖ డిజిటల్ ఫుల్-స్టాక్ ఇన్సూరెన్స్ కంపెనీలలో ఒకటైన గో డిజిట్ జనరల్ ఇన్సూరెన్స్ (డిజిట్ ఇన్సూరెన్స్), ప్రతిష్టాత్మకమైన ఎఫ్ఈ బెస్ట్ బ్యాంక్స్ అవార్డ్స్ 2025లో బెస్ట్ ఫిన్‌టెక్ ఇన్సూరెన్స్ అవార్డును అందుకుంది. ఈ అవార్డును డిజిట్ ఇన్సూరెన్స్ మేనేజింగ్ డైరెక్టర్, సిఈఓ జస్లీన్ కోహ్లీకి హోమ్ మంత్రి అమిత్ షా అందజేశారు. ఈ సందర్భంలో మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, ఉప ముఖ్యమంత్రి ఏకనాథ్ షిండే కూడా హాజరయ్యారు. ఈ గుర్తింపుపై జస్లీన్ కోహ్లీ మాట్లాడుతూ, "ఈ అవార్డు టెక్నాలజీ ఆధారిత ఆవిష్కరణలపై మా నిరంతర కృషికి నిదర్శనం. డిజిట్ ఇన్సూరెన్స్ లో మేము ఎప్పుడూ కొత్త మార్గాలను అన్వేషిస్తూ, ఇన్సూరెన్స్ రంగంలో పారదర్శకత, వేగం, నమ్మకాన్ని అందించడానికి కృషి చేస్తాము. ఈ అవార్డు మా కస్టమర్లు, భాగస్వాముల కోసం మరింత శక్తివంతమైన పరిష్కారాలను సృష్టించడానికి మాకు ప్రేరణనిస్తుంది." అని అన్నారు. ఇది డిజిట్‌కు ఎఫ్ఈ బెస్ట్ బ్యాంక్స్ అవార్డుల్లో రెండవ విజయం. 2022లో ఫిన్‌టెక్ కేటగిరీలో కూడా గెలుచుకుంది.

హైదరాబాద్‌లో ప్రారంభమైన జువెలరీ వరల్డ్ ఎగ్జిబిషన్

హైదరాబాద్: హైదరాబాద్‌లోని ఐకానిక్ హోటల్ తాజ్ కృష్ణలో ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న జువెలరీ వరల్డ్ ఎగ్జిబిషన్ ప్రారంభించడంతో ముత్యాల నగరం వైభవంగా మెరిసింది. అక్టోబర్ 3 నుండి 5, 2025 వరకు జరగనున్నఈ మూడు రోజుల ప్రదర్శన ఆభరణాల ప్రకాశం, వారసత్వం, సమకాలీన లగ్జరీ సాటిలేని వేడుకకు హామీఇస్తుంది. ఈ ప్రతిష్టాత్మక ప్రదర్శన భారతదేశంలోని ప్రముఖ ఆభరణాల వ్యాపారులు, డిజైనర్లు, చేతివృత్తుల వారిని ఒకేతాటిపైకి తీసుకువస్తుంది. ప్రారంభరోజున సందర్శకులు సాంప్రదాయ పోల్కి, కుందన్ కళాఖండాల నుండి సమకాలీన వజ్రం, బంగారు సృష్టి వరకు అసాధారణ ప్రదర్శనను ఆస్వాదించారు. ఇది వారసత్వం, ఆధునిక కళాత్మకత పరిపూర్ణ సమ్మేళనంగా మారింది. ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు తెరిచి ఉన్న ఈ ప్రదర్శన, కాబోయే వధువులు, వివాహ కుటుంబాలు, ఆభరణాల ప్రియులు, పరిశ్రమ నిపుణులకు విలాసవంతమైన అనుభవాన్ని అందిస్తుంది. వారసత్వ క్లాసిక్‌ల నుండి అత్యాధునిక డిజైన్ల వరకు ప్రతిదీ ఇందులో ఉంటుంది.

ఆక్సెల్, టైగర్ గ్లోబల్ అండతో ఇన్ఫ్రా.మార్కెట్ ఫైలింగ్

ముంబయి : మార్కెట్ వర్గాల సమాచారం ప్రకారం, యాక్సెల్, టైగర్ గ్లోబల్ మద్దతుతో, భారతదేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నిర్మాణ సామగ్రి ప్లాట్‌ఫామ్‌లలో ఒకటైన ఇన్‌ఫ్రా.మార్కెట్ తన డ్రాఫ్ట్ రెడ్ హెరింగ్ ప్రోస్పెక్టస్ (డీఆర్‌హెచ్‌పీ)ని సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ)కి కాన్ఫిడెన్షియల్‌గా దాఖలు చేసింది. ఈ పరిణామం గురించి తెలిసిన వ్యక్తుల ప్రకారం, కొత్త షేర్ల జారీ, ప్రస్తుత వాటాదారుల ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) ద్వారా కంపెనీ దాదాపు రూ. 4,500%–%5,000 కోట్లు సేకరించాలని చూస్తోంది. సెబీ (ఇష్యూ ఆఫ్ క్యాపిటల్ అండ్ డిస్‌క్లోజర్ రిక్వైర్మెంట్స్) నిబంధనలు, 2018 ప్రకారం సెబీ కాన్ఫిడెన్షియల్ లేదా "ప్రీ-ఫైలింగ్" మార్గంలో ఈ ఫైలింగ్ చేయబడింది. ఈ విధానం కంపెనీలు డీఆర్‌హెచ్‌పీని బహిరంగంగా ప్రకటించే ముందు డ్రాఫ్ట్ ఆఫర్ పత్రాలను నియంత్రణ సంస్థతో ప్రైవేట్‌గా పంచుకోవడానికి అనుమతిస్తుంది.కోటక్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్, హెచ్ఎస్‌బిసి, గోల్డ్‌మన్ సాచ్స్‌లను తమ మర్చంట్ బ్యాంకర్లుగా కంపెనీ నియమించిందని వర్గాల సమాచారం. ఐపిఓ వివరాలు లేదా సమయం వెల్లడించడానికి కంపెనీ లేదా ప్రతినిధి నిరాకరించారు.

ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా ఐపీవో సిద్ధం

ముంబయి: ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇంక్. పూర్తిగా యాజమాన్యంలోని అనుబంధ సంస్థ అయిన ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా లిమిటెడ్, తన ప్రారంభ పబ్లిక్ ఆఫర్ (ఐపీవో) కోసం ఈక్విటీ షేరుకు రూ.1,080 నుండి రూ.1,140 వరకు ధర బ్యాండ్‌ను నిర్ణయించింది. యాంకర్ ఇన్వెస్టర్ బిడ్డింగ్ తేదీ సోమవారం, అక్టోబర్ 6, 2025న ఉంటుంది. బిడ్/ఆఫర్ మంగళవారం, అక్టోబర్ 7, 2025న సబ్‌స్క్రిప్షన్ కోసం తెరవబడుతుంది. గురువారం, అక్టోబర్ 9, 2025న ముగుస్తుంది. పెట్టుబడిదారులు కనీసం 13 ఈక్విటీ షేర్లకు, ఆ తర్వాత 13 ఈక్విటీ షేర్ల గుణిజాలలో బిడ్ చేయవచ్చు. ఉద్యోగుల రిజర్వేషన్ పోర్షన్‌లో బిడ్డింగ్ చేసే అర్హత కలిగిన ఉద్యోగులకు ఈక్విటీ షేరుకు రూ.108 తగ్గింపు లభిస్తుంది. పూర్తి వివరాల కోసం, సెప్టెంబర్ 30, 2025 నాటి ప్రైస్ బ్యాండ్ ప్రకటనను అటాచ్‌మెంట్‌గా చూడవచ్చు. ఈ ఆఫర్‌లో దాని ప్రమోటర్, ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇంక్ ద్వారా రూ.10 ముఖ విలువ కలిగిన 101,815,859 ఈక్విటీ షేర్ల వరకు అమ్మకానికి ఆఫర్ ఉంది. ఈక్విటీ షేర్లను ఎన్ఎస్ఈ, బీఎస్ఈలలో జాబితా చేయాలని ప్రతిపాదించారు.

ఎస్‌బీఐ లైఫ్ ఐడియేషన్ ఎక్స్ 2.0 ఫినాలేలో హైదరాబాద్ ఐఎస్‌బీ

హైదరాబాద్: భారతదేశపు అత్యంత విశ్వసనీయమైన ప్రైవేట్ రంగ జీవిత బీమా సంస్థల్లో ఒకటైన ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ తమ ఐడియేషన్‌ఎక్స్ 2.0 ఫైనలిస్టులను ప్రకటించింది. ఇందుకు సంబంధించి చెన్నైలోని గ్రేట్ లేక్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (జీఎల్ఐఎం)లో నిర్వహించిన సెమీ-ఫినాలే రౌండ్‌లో ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్-హైదరాబాద్ (ఐఎస్‌బీ) టీమ్ విజేతగా నిలవడం ద్వారా ప్రతిష్టాత్మకమైన గ్రాండ్ ఫినాలేలో చోటు దక్కించుకుంది. సెమీ-ఫినాలేకి భారతదేశపు దిగ్గజ బీ-స్కూల్స్ నుంచి 3,500 పైచిలుకు ఎంట్రీలు వచ్చాయి. ఇది 40 టీమ్‌లను ఒకే వేదిక మీదికి తెచ్చింది. వీటిలో కోల్‌కతా, షిల్లాంగ్, జంషెడ్‌పూర్, భువనేశ్వర్, ముంబై, అహ్మదాబాద్, పుణే, ఢిల్లీ, గుర్గావ్, ఘాజియాబాద్, లక్నో, చెన్నై, హైదరాబాద్, కోజికోడ్, మరియు విశాఖపట్నంకి చెందిన సంస్థలు ఉన్నాయి. కఠినతరమైన మదింపు ప్రక్రియ అనంతరం ఐడియేషన్‌ఎక్స్ 2.0 గ్రాండ్ ఫినాలేకి టాప్ ఎనిమిది టీమ్‌లు అర్హత పొందాయి. ఐఎస్‌బీ హైదరాబాద్‌కు చెందిన మెహుల్ చుగ్, అయుష్ చౌబే మరియు కిశ్మిష్ సక్సేనా ఫైనల్ ఎనిమిది మందిలో తమ స్థానం సంపాదించారు.

హైదరాబాద్‌లో అసూస్ ప్రత్యేక స్టోర్ ప్రారంభం

హైదరాబాద్: దేశవ్యాప్తంగా తమ రిటైల్ ఉనికిని మరింతగా బలపరచే దిశగా, తైవాన్‌కు చెందిన టెక్ దిగ్గజం అసూస్ ఇండియా, హైదరాబాద్‌లో ప్రత్యేకమైన స్టోర్ ప్రారంభించుతున్నట్లు ప్రకటించింది. సరికొత్త స్టోర్ 350 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటయింది. ఇందులో అసూస్ ఫ్లాగ్‌షిప్ ప్రొడక్టులు అయిన వివో బుక్, జెన్‌బుక్, రిపబ్లిక్ ఆఫ్ గేమర్స్ (ఆర్‌ఓజీ) ల్యాప్‌టాప్‌లు, గేమింగ్ డెస్క్‌టాప్‌లు, ఆల్-ఇన్-వన్ డెస్క్‌టాప్‌లు, యాక్సెసరీలు సహా విస్తృత శ్రేణి ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ హార్డ్‌వేర్ లభ్యం అవుతాయి. ఈ బ్రాండ్ హైదరాబాద్‌లో 7వ స్టోర్‌గా స్థాపించిబడింది. అసూస్ ఇండియా పీసీ, గేమింగ్ బిజినెస్ నేషనల్ సేల్స్ మేనేజర్ జిగ్నేశ్ భవ్సర్ మాట్లాడుతూ, "భారతదేశంలో మా రిటైల్ ఉనికి విస్తరణ గురించి ప్రకటించడం మాకు ఎంతో సంతోషంగా ఉంది. తెలంగాణ మాకు ఒక కీలకమైన మార్కెట్‌గా ఉన్నందున, ముత్యాల నగరం హైదరాబాద్‌లో కొత్త బ్రాండ్ స్టోర్ ప్రారంభం అయినందున, దేశవ్యాప్తంగా వినియోగదారులకు నూతన ఆవిష్కరణలను ప్రత్యేక అనుభవంగా అందించే దిశలో ఒక కీలకమైన అడుగుగా నిలుస్తుంది" అని అన్నారు. కొత్త స్టోర్ న్యూ మలక్‌పేటలోని ఆనంద్ నగర్ కాలనీ కంప్యూటర్ ప్లానెట్, డోర్ నెం.16, 2701/6/10లో ఏర్పాటయింది.

స్థానిక ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలి

మంత్రి సీతక్క

విశాలాంధ్ర-ములుగు జిల్లా బ్యూరో: ప్రజా ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని, స్థానిక ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని, మంత్రి సీతక్క అన్నారు. శుక్రవారం వెంకటాపూర్ మండలంలోని ఇన్ ఇంచర్ల ఎంఆర్ గార్డెన్‌లో మండల పార్టీ కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఇట్టి కార్యక్రమకు ముఖ్య అతిధిగా రాష్ట్ర పంచాయతీ రాజ్ గ్రామీణ అభివృద్ధి, నీటి సరఫరా, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ, సీతక్క హాజరై మాట్లాడుతూ బీఆర్ఎస్ నేతలు పదేండ్లలో రాష్ట్రంలో ఆర్థిక, పాలన వ్యవస్థలను విధ్వంసం చేశారని, వాటిని ప్రణాళిక ప్రకారం సరి చేసుకుంటూ ప్రజా ప్రభుత్వం ముందుకెళ్తుందని చెప్పారు. లక్ష కోట్లు పెట్టి కట్టిన కాళేశ్వరం కుంగిపోయిందని, కాంగ్రెస్ ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేశామని, ప్రజలు కాంగ్రెస్ అభ్యర్థులను ఆశీర్వదించాలన్నారు. ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో నాయకులు ఉండాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఇప్పటికే రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని, వాటిని ప్రజల్లోకి తీసుకువెళ్లే బాధ్యత నాయకులు, కార్యకర్తలదేనన్నారు. రాష్ట్రంలోని రైతులు, మహిళలు, యువత కోసం ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల ప్రశంసలు అందుకుంటున్నాయని తెలిపారు. బీసీలకు సామాజిక న్యాయం అందించాలనే తపనతో రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తున్నారని చెప్పారు. ఎంటీసీలను, జడ్పీటీసీలను, సర్పంచ్ లను కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని, పలు అంశాలపై మంత్రి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మల్లాడి రామ్ రెడ్డి. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కల్యాణితో పాటు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా, బ్లాక్, మండల గ్రామ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జాతిపిత గాంధీ సిద్ధాంతాలు సమాజానికి మార్గదర్శకం

కలెక్టర్ జితేష్ వి. పాటిల్

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : జాతిపిత మహాత్మా గాంధీ ఆచరించి చూపిన సత్యం, అహింస, శాంతి మార్గాల్లో మనమంతా నడవాలని ఈ మార్గం భారత జాతి మానవ సంబంధాలకు అనివార్యమని జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. గురువారం ఐడిఓసి కార్యాలయంలో మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధులలో అగ్రగణ్యుడైన గాంధీజీ సత్యాగ్రహం, అహింసాయుత పోరాటం ద్వారా భారత స్వాతంత్ర్యానికి మార్గం సుగమం చేశారని తెలిపారు. ఆయన చూపిన ఆలోచనలు కేవలం భారతదేశానికే కాకుండా ప్రపంచానికి కూడా మార్గదర్శకత్వం చేశాయన్నారు. గాంధీజీ సిద్ధాంతాలను ప్రతి ఒక్కరూ తమ జీవితంలో ఆచరిస్తే సమాజంలో ఐక్యత, సోదరభావం ఏర్పడుతుందన్నారు. గాంధీ బోధనలు నేటి యువతకు ఎంతో ప్రేరణాత్మకమన్నారు. క్రమశిక్షణ, నిజాయితీ, సేవాభావంతో ముందుకు సాగితేనే సమాజం అభివృద్ధి సాధ్యమన్నారు. అమరులు, సమరయోధులైన మన పూర్వీకుల చరిత్రను ప్రతి విద్యార్థి యువకులు చదవాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఓ సంజీవరావు, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ షర్ఫుద్దీన్, ఏటీవో వెంకటేశ్వర్లు, ఇంచార్జ్ డిపిఆర్ఓ అజ్గర్ హుస్సేన్, వివిధ శాఖల అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రామ్ రెడ్డి దామోదర్ రెడ్డి మృతి కాంగ్రెస్‌కు తీరని లోటు

విశాలాంధ్ర - నల్లగొండ బ్యూరో : మాజీ మంత్రి టైగర్ రామ్ రెడ్డి దామోదర్ రెడ్డి మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని డిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్ అన్నారు. శుక్రవారం నల్గొండలోని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో మాజీ మంత్రి దామోదర్ రెడ్డి మృతి పట్ల సంతాపం వ్యక్తం చేస్తూ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా శంకర్ నాయక్ మాట్లాడుతూ రామ్ రెడ్డి దామోదర్ రెడ్డి పేద ప్రజల కోసం పనిచేసిన వ్యక్తి అని అన్నారు. తన ఆస్తి మొత్తం పేద ప్రజల కోసం దారతత్వం చేసిన మహోన్నత వ్యక్తి అని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ కోసం నిరంతరం పనిచేస్తూ పార్టీ కార్యకర్తలకు అండగా ఉన్నాడని అన్నారు. ఆయన నిజంగానే టైగర్ల బతికాడని పేర్కొన్నారు. రామ్ రెడ్డి దామోదర్ రెడ్డి ఆశయ సాధన కోసం పార్టీ శ్రేణులంతా కృషి చేయాలని కోరారు. పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్, మాజీ జెడ్పిటిసి వంగూరి లక్ష్మయ్య, నాయకులు కత్తుల కోటి, యువజన కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గాలి నాగరాజు, నియోజకవర్గ అధ్యక్షుడు మామిడి కార్తీక్, గంగుల సైదులు, గురుజ వెంకన్న గౌడ్, కంచర్ల ఆనంద్ రెడ్డి, నల్లగొండ అశోక్, శ్రీనివాస్‌తో పాటు పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికల రిజర్వేషన్లు 5వ షెడ్యూల్డ్ ప్రాంతాల్లో రాజ్యాంగ విరుద్ధం

విశాలాంధ్ర - చర్ల : ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన స్థానిక సంస్థల రిజర్వేషన్లు 5వ షెడ్యూల్ ప్రాంతాల్లో రాజ్యాంగ విరుద్ధమని గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు పాయం సత్యనారాయణ విమర్శించారు. గ్రామ పంచాయితీ సర్పంచ్, వార్డులు, ఎంపీటీసీ, జడ్పిటిసి రిజర్వేషన్లు ఆదివాసీలకు ఏమాత్రం ఆమోదయోగం కాదన్నారు. చర్ల మండలం కేంద్రంలో శుక్రవారం ఆ సంఘం నాయకుడు బెండబోయిన సంతోష్ కుమార్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఇందులో గోండ్వానా నేత సత్యనారాయణ ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతం ఐదో షెడ్యూల్, రాజ్యాంగ బద్ధంగా జరగాలని డిమాండ్ చేశారు. ఈ ఎన్నికలు 2018 పంచాయతీరాజ్ చట్టం రాజ్యాంగ వ్యతిరేకంగా నోటిఫికేషన్ ప్రభుత్వం ఇచ్చిందన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో పంచాయతీ రాజ్ ఎక్స్టెన్షన్స్ 1998 షెడ్యూల్ ఏరియా, పీసా చట్టం ప్రకారం ఎన్నికలు నోటీపికేషన్ ఇచ్చి ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. 5వ షెడ్యూల్ ఏజెన్సీ ప్రాంతంలో చట్ట విరుద్ధంగా ఎన్నికలు జరిగితే ఆదివాసీలు తిరుగుబాటు చేస్తారని హెచ్చరించారు. ప్రస్తుతం ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్ ప్రకారం ఆదివాసి గుడెలలో పూర్తిగా బీసీలు, గిరిజన ప్రజాప్రతినిధులు రాజ్యమేలు తారన్నారు. తమ ప్రాంతాల్లో జనరల్ గా రిజర్వేషన్ ఖరారు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తున్నట్లు భావిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు భీరబోయిన శేఖర్, కల్లూరి సీతారాములు, కొమరం భుజంగరావు. కల్లూరి లక్ష్మణ్. కల్లూరి రామారావు. శ్యామల, మల్లేష్. ఇర్ప కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

సోనాటా ఫెస్టివ్ కలెక్షన్ 2.0. పండుగ మెరుపులు

విశాలాంధ్ర - విజయవాడ: దేశవ్యాప్తంగా పండుగల సీజన్ ప్రారంభం కావడంతో, సోనాటా ఫెస్టివ్ కలెక్షన్ 2.0ను ఆవిష్కరించింది. సమయానుసారంగా సంప్రదాయబద్ధం గా పండుగ జరుపుకునేవిధంగా ఈ వాచీలు రూపొందాయి. ఈ కొత్త వాచీలశ్రేణి, బహుమతిగా సంతోషాన్ని పెంచే విధంగా ఆధునిక డిజైన్, పండుగ మెరుపుల కలయికతో మధురమైన క్షణాల్లా గుర్తుండిపోయేలా నిలుస్తుంది. పురుషుల కోసం సోనాటా ఫెస్టివ్ కలెక్షన్ 2.0లోని వాచీలు నైపుణ్యాన్ని, సొగసును చూపిస్తాయి. వాటిలో కొన్ని రిచ్యూటర్న్ ఉన్న డయల్స్, బోల్డ్ కేస్ షేప్స్ లేదా క్రోకోడైల్ చర్మంలా ఉండేపట్టీలతో క్లాసిక్ రోమన్ నంబర్స్ ఉంటాయి. నీలం, ఆకుపచ్చ వంటిరంగుల డయల్స్ వాచీలకు మరింత లోతు, ఆకర్షణను ఇస్తాయి. అలాగే, క్రోనోగ్రాఫ్, తేదీనిచూపించే ఫీచర్లు, సూర్య-చంద్రుడి సూచిక వంటివి వాచ్‌కు ప్రత్యేక ఆకర్షణ అని చెప్పుకోవచ్చు. వీటినిఉపయోగించడం కూడా చాలా సులభం. ఈ వివరాలన్నీ కలిసి ఈ కలెక్షన్‌ను పండుగలకు, ప్రత్యేకసందర్భాలకు సరైన బహుమతిగా, ఎంతో ఆకర్షణీయంగా మారుస్తాయి.

హిందూపూర్‌లో దెబ్బతిన్న సిటీ గ్యాస్ పైప్‌లైన్‌ను పునరుద్ధరించిన థింక్ గ్యాస్

హిందూపూర్ : హిందూపూర్‌లోని హౌసింగ్ బోర్డ్ కాలనీ సమీపంలో భారతీ ఎయిర్‌టెల్ తరపున స్ట్రైట్ టెక్నాలజీస్ లిమిటెడ్, క్వెస్ కార్ప్ లిమిటెడ్ తరపున ఆప్టికల్ ఫైబర్ కేబుల్ వేయడం కోసం అనధికారకంగా చేపట్టిన తవ్వకం పనుల సమయంలో థింక్ గ్యాస్ (గతంలో ఏజి అండ్ పి ప్రథమ్ సంస్థ) పైప్‌లైన్ ప్రమాదవశాత్తు దెబ్బతిన్నందున హిందూపూర్‌లోని నగర గ్యాస్ సరఫరాలో స్వల్ప అంతరాయం ఏర్పడింది. థింక్ గ్యాస్‌లోని అత్యవసర ప్రతిస్పందన బృందం, ప్రభావిత విభాగాలను త్వరగా వేరుచేసి 10 నిమిషాల్లో గ్యాస్ సరఫరాను పునరుద్ధరించింది. తద్వారా ప్రజల భద్రతను నిర్ధారించటంతో పాటుగా నివాసితులకు అసౌకర్యాన్ని తగ్గించింది. బాధ్యులైన సంస్థపై అధికారికంగా పోలీసు ఫిర్యాదు నమోదు చేసింది. అదే సమయంలో కాంట్రాక్టర్లు, పౌర పనుల ఏజెన్సీలు ఏవైనా తవ్వకం పనులు చేపట్టే ముందుగానే అధికారిక 'డయల్ బిఫోర్ యు డిగ్' నంబర్-1800 2022 999 ద్వారా నగర మున్సిపల్ అధికారులకు లేదా సిజిడి కంపెనీకి ముందుగానే తెలియజేయాలని కంపెనీ కోరింది. సెప్టెంబర్ 23న మధ్యాహ్నం 02:28 గంటలకు హిందూపూర్‌లోని హౌసింగ్ బోర్డ్ కాలనీ సమీపంలో థర్డ్ పార్టీ తవ్వకాల సమయంలో 125 ఎంఎం ఎండీపీఈ చార్జ్ పైప్‌లైన్ దెబ్బతిన్నప్పుడు అంతరాయం ఏర్పడింది. అయితే, థింక్ గ్యాస్ త్వరగా ఆ ప్రదేశానికి చేరుకుని సరఫరాను పునరుద్ధరించింది.

మహనీయుల ఆశయాలను కొనసాగించాలి

విశాలాంధ్ర - ములుగు జిల్లా బ్యూరో : మహనీయుల ఆశయాలను ప్రతి ఒక్కరు కొనసాగించాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అన్నారు. గురువారం గాంధీ జయంతి కార్యక్రమాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని గాంధీ పార్క్‌లో గల గాంధీజీ విగ్రహానికి జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మహాత్మాగాంధీ జీవిత చరిత్ర సంబంధించిన ముఖ్యమైన ఘట్టాలను జిల్లా ఉన్నతాధికారులు స్మరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గాంధీజీ 1869 అక్టోబర్ 2న గుజరాత్‌లోని పోరుబందర్‌లో జన్మించారని తెలిపారు. ఆంగ్లేయుల పాలన నుండి భారతదేశానికి స్వాతంత్ర్యం సాధించిన నాయకులలో అగ్రగణ్యుడని, సత్యము, అహింసలు గాంధీజి నమ్మే సిద్ధాంత మూలాలని, సహాయ నిరాకరణ, సత్యాగ్రహము అతని ఆయుధాలని, అన్ని మతాలూ, కులాలూ ఒకటే అని చాటి చెప్పారని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి దేవ్‌రాజ్, మున్సిపల్ కమిషనర్ సంపత్, ఎంపిడిఓ రామకృష్ణ, గ్రామ పుర ప్రముఖులు, తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సిపిఐ సన్నాహక సమావేశాన్ని జయప్రదం చేయండి

విశాలాంధ్ర - ఖమ్మం : భారత కమ్యూనిస్టు పార్టీ శత వసంత ముగింపు సభను పురస్కరించుకుని ఈనెల ఐదున ఖమ్మంలో జరిగే ఆహ్వాన సంఘ సన్నాహక సమావేశాన్ని జయప్రదం చేయాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఎస్కె జానిమియా కోరారు. భారత కమ్యూనిస్టు పార్టీ నగర సమితి సమావేశం శుక్రవారం ఏనుగు గాంధీ అధ్యక్షతన స్థానిక గిరిప్రసాద్ భవన్లో జరిగింది. ఈ సమావేశంలో జానిమియా మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ వంద సంవత్సరాల ముగింపు వేడుక డిసెంబర్ 26న జరగనుందని ఈ వేడుకకు సంబంధించి ఐదున జరిగే ఆహ్వాన సంఘ సమావేశానికి సిపిఐ జాతీయ కార్యదర్శి రాజా, అతిథులుగా బినయ్ విశ్వం, కె.నారాయణ, అజీజ్ పాషా, పువ్వాడ నాగేశ్వరరావు, చాడ వెంకటరెడ్డి, పల్లా వెంకటరెడ్డిలతో పాటూ ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, కర్ణాటక, పాండిచ్చేరి రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులు హాజరవుతున్నారని ఆయన తెలిపారు. ఖమ్మం నగరం నుంచి పెద్ద సంఖ్యలో సిపిఐ కార్యకర్తలు హాజరై ఆహ్వాన సంఘ సన్నాహక సమావేశాన్ని జయప్రదం చేయాలని జానిమియా కోరారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మహ్మద్ సలాం, పోటు కళావతి, పగడాల మల్లేష్, మేకల శ్రీనివాసరావు, యానాలి సాంబశివరెడ్డి, ఏరియా కార్యదర్శులు వరదా నర్సింహారావు, నూనె శశిధర్, జిల్లా సమితి సభ్యురాలు తాటి నిర్మల, ఎస్కె సైదా తదితరులు పాల్గొన్నారు.

వుడ్‌బర్న్స్ ఇండియన్ విస్కీకి గ్రాండ్ గోల్డ్ బ్లెండెడ్ విస్కీ అవార్డు

ముంబై : అలైడ్ బ్లెండర్స్ అండ్ డిస్టిల్లర్స్ లిమిటెడ్ (ఏబీడీ) సూపర్-ప్రీమియం, లగ్జరీ అనుబంధ సంస్థ అయిన ఏబీడీ మాస్ట్రో ప్రైవేట్ లిమిటెడ్, కాన్కోర్స్ మోండియల్ డి బ్రక్సెల్లెస్ (సీఎంబీ) 2025 ద్వారా 27వ స్పిరిట్స్ సెలెక్షన్‌లో ప్రపంచ గుర్తింపును పొందింది. కంపెనీ పోర్ట్‌ఫోలియో మూడు అత్యుత్తమ బ్రాండ్‌లకు ప్రతిష్టాత్మక ప్రశంసలను పొందింది. ఇది ప్రపంచవేదికపై భారతదేశం పెరుగుతున్న ఉనికికి నిదర్శనం. వుడ్‌బర్న్ కంటెంపరరీ ఇండియన్ మాల్ట్ విస్కీ ఒక మైలురాయి ద్వంద్వ విజయాన్ని సాధించింది, ప్రతిష్టాత్మకమైన గ్రాండ్ గోల్డ్, బెస్ట్ రివెలేషన్ బ్లెండెడ్ విస్కీ ఆఫ్ ది ఇయర్‌ను ప్రపంచవ్యాప్తంగా దాని తరగతిలో అత్యంత అత్యుత్తమ విస్కీగా గుర్తించింది. ఈ అసమానమైన ఘనత భారతీయ విస్కీ సంపాదించిన మొదటిది, వుడ్‌బర్న్‌ను ఎంపిక చేసిన ప్రపంచ విజేతల సమూహంలో ఉంచింది. పుమోరీ స్మాల్ బ్యాచ్ జిన్‌కు జిన్ విభాగంలో బంగారు పతకం లభించింది. అయితే ఆర్థాస్ బ్లెండెడ్ మాల్ట్ స్కాచ్ విస్కీ రద్దీగా ఉండే స్కాచ్ విస్కీ విభాగంలో వెండి పతకం పొందింది.

కమ్మిన్స్ ఇండియాకు ఎన్ఎస్ఈలో 30 సంవత్సరాల లిస్టింగ్

ముంబై: ప్రముఖ పవర్ సొల్యూషన్స్ టెక్నాలజీ ప్రొవైడర్ అయిన కమ్మిన్స్ ఇండియా లిమిటెడ్ (సీఐఎల్) తాజాగా నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ ఇండియా (ఎన్ఎస్ఈ)లో లిస్టింగ్ అయి 30 సంవత్సరాలు పూర్తి చేసుకుంది. ఈ మైలురాయిని ఎన్ఎస్ఈ ఎండీ, సీఈవో ఆశిష్‌కుమార్ చౌహాన్, కమ్మిన్స్ ఇండియా లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ శ్వేతా ఆర్య, సీఐఎల్, ఎన్ఎస్ఈ రెండింటి నుండి ఇతర ప్రముఖుల సమక్షంలో ఉత్సవ గంట మోగించి జరుపుకున్నారు. మార్చి 29, 1995న జాబితా చేయబడినప్పటి నుండి, సీఐఎల్ తన వాటాదారులకు గణనీయమైన విలువను సృష్టించింది. ఈ కాలంలో, కంపెనీ 16% సీఏజీఆర్ వద్ద 76ఎక్స్ వాటాదారుల రాబడిని అందించింది. దాని ఆదాయాలు 10% సీఏజీఆర్ వద్ద దాదాపు 19ఎక్స్ పెరిగాయి. పన్ను తర్వాత లాభం 12% సీఏజీఆర్ వద్ద 30ఎక్స్‌కి పెరిగింది. నేడు, సీఐఎల్, ఎన్ఎస్ఈలో మార్కెట్ క్యాపిటలైజేషన్ ద్వారా టాప్ 100 కంపెనీలలో ఒకటిగా ఉంది, దాని జాబితా చేయబడినప్పటి నుండి దాని మార్కెట్ క్యాప్ 76ఎక్స్ పెరిగింది. ఇది దాని బలమైన మార్కెట్ ఉనికిని, పెట్టుబడిదారుల విశ్వాసాన్ని ప్రతిబింబిస్తుంది.

అనంతనాగ్ టెర్మినల్‌కు మొదటి బ్యాచ్ మారుతి సుజుకి వాహనాలు

న్యూఢిల్లీ: మారుతి సుజుకి ఇండియా లిమిటెడ్ తాజాగా కాశ్మీర్ లోయలో మొట్టమొదటి వాహనాలను రైలు ద్వారా చేరుకుంటున్నట్లు ప్రకటించింది. ఈ ప్రాంతానికి వాహనాలను పంపించడానికి భారతీయ రైల్వేలను ఉపయోగించిన దేశంలో మొట్టమొదటి ఆటోమొబైల్ తయారీదారుగా అవతరించింది. బ్రెజ్జా, డిజైర్, వ్యాగన్ఆర్, ఎస్-ప్రెస్సో వంటి 100 కి పైగా మారుతి సుజుకి వాహనాలను మోసుకెళ్లిన తొలి రైలు ఇటీవల ప్రారంభించబడిన మానేసర్ ఇన్-ప్లాంట్ రైల్వే సైడింగ్ నుండి బయలుదేరింది. జమ్మూ కాశ్మీర్‌లో కొత్తగా ప్రారంభించబడిన అనంతనాగ్ రైల్వే టెర్మినల్‌కు చేరుకోవడానికి రైలు 850 కిలోమీటర్లకు పైగా ప్రయాణించింది. అనంతనాగ్‌కు వెళ్లే మార్గంలో, రైలు చీనాబ్ నదిపై ప్రపంచంలోనే ఎత్తైన రైల్వే ఆర్చ్ వంతెనను దాటింది. ప్రాంతీయ కనెక్టివిటీని బలోపేతం చేయడానికి, లాజిస్టిక్స్‌లో సామర్థ్యాన్ని పెంచడానికి ఉధంపూర్-శ్రీనగర్-బారాముల్లా రైల్ లింక్ (యూఎస్‌బీఆర్ఎల్) ప్రాజెక్ట్‌లో భాగంగా ఈ సంవత్సరం ప్రారంభంలో ఈ వంతెనను ప్రారంభించారు.

బెంగాల్ చేనేత వారసత్వాన్ని నిలిపిన కోకా-కోలా

న్యూఢిల్లీ: ఈ దుర్గా పూజ, బెంగాల్ చేనేత, బ్లాక్-ప్రింట్ సంప్రదాయాలు లాల్ పార్ చీరలతో ప్రధాన వేదికను తీసుకుంటాయి. ఓగిల్వీ ఇండియా భావనలో కోకా-కోలా చొరవ, ఈ ప్రాంత కళాకారుల నైపుణ్యం, వారసత్వాన్ని జరుపుకుంటుంది. కోల్‌కతా సమీపంలోని నదియా జిల్లాలోని ఫులియా నుండి వచ్చిన మాస్టర్ నేత కార్మికులు, ప్రపంచవ్యాప్తంగా చేనేతకు ప్రసిద్ధి చెందిన కోల్‌కతా సమీపంలోని గ్రామం, కోల్‌కతా శివారు ప్రాంతాల నుండి బ్లాక్-ప్రింట్ కళాకారులచే రూపొందించబడిన ఈ చీరలు, తరతరాలుగా దుర్గా పూజ ఉత్సవాల నుండి విడదీయరాని తెలుపు, ఎరుపు రంగు దుస్తులైన క్లాసిక్ లాల్ పార్‌ను గౌరవిస్తాయి. దుర్గా పూజ ఉత్సవాల ప్రారంభాన్ని సూచించే సువాసన గల షియులి పువ్వు, శ్రేయస్సుకు చిహ్నంగా ఉండే చేప వంటి ఐకానిక్ మోటిఫ్‌ల నుండి ప్రేరణ పొందిన ప్రతి డిజైన్ చేతితో బ్లాక్-ప్రింట్ చేసింది. ఇది చాలా అరుదుగా వస్తున్న ఒక క్రాఫ్ట్‌ను సంరక్షిస్తుంది. బెంగాల్ ఆత్మను ప్రతిబింబించే ఈ మోటిఫ్‌లను చీరపై జీవం పోస్తారు, కోకా-కోలా కాంటూర్ బాటిల్ ఈ కాలాతీత క్రాఫ్ట్‌కు సమకాలీన స్పర్శను జోడిస్తుంది.

స్పేసెస్ యువర్ స్పేస్, యువర్ కంఫర్ట్ ప్రచారం

ముంబయి : వెల్‌స్పన్ లివింగ్‌కు చెందిన ప్రీమియం బెడ్, బాత్ లినెన్ బ్రాండ్ అయిన స్పేసెస్, "యువర్ స్పేస్, యువర్ కంఫర్ట్" పేరిట తమ సరి కొత్త ప్రచారం ప్రారంభించినట్లు వెల్లడించింది. ఆటమ్ నెట్‌వర్క్ తీర్చిదిద్దిన ఈ ప్రచారం, ఇంటికి తిరిగి రావడంలో ఉన్న సాటిలేని ఆనందాన్ని, వ్యక్తిగత ప్రాంగణాలను నిజంగా సౌకర్యవంతంగా మార్చే రోజువారీ క్షణాలను వెల్లడిస్తుంది. సన్నిహిత, సంబంధిత అనుభవాలను ఒడిసి పడుతూ "యువర్ స్పేస్, యువర్ కంఫర్ట్" ప్రచారం, ఇంటిని దేవాలయంగా మార్చే రోజువారీ పనులను వేడుక జరుపుకుంటుంది. ఇది రోజంతా శ్రమించిన తరువాత మనకు తెలిసిన దుప్పట్లో దూరి పోయినా లేదా వేడుకల తర్వాత మృదువైన, హాయిగా ఉండే బాత్రోబ్‌లో మీ భాగస్వామితో విశ్రాంతి తీసుకుంటున్నా - వ్యక్తిగతంగా అనిపించినప్పటికీ అందరి జీవితాల్లో కనిపించే చిరు, సన్నిహిత క్షణాలను హైలైట్ చేయడం లక్ష్యంగా పెట్టుకుంది. బ్రాండ్ యువర్ స్పేస్, యువర్ కంఫర్ట్ భావనను సంపూర్ణంగా ప్రతిబింబిస్తుందని వెల్‌స్పన్ లివింగ్ ఎండి, సీఈఓ దీపాలి గోయెంకా తెలిపారు.

సామ్సంగ్ "గో సేవ్ టుడే" ప్రచారం

గురుగ్రామ్ : భారతదేశపు అతిపెద్ద కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ అయిన సామ్సంగ్, ఈ పండుగ సీజన్‌లో వినియోగదారులకు రూ.21000 వరకు ఆదాను అందించే బెస్పోక్ ఏఐ ఎయిర్ కండిషనర్లపై "గో సేవ్ టుడే" ప్రచారాన్ని ప్రకటించింది. జీఎస్‌టీ రేటు తగ్గింపులు, మెరుగైన వారంటీ ప్రయోజనాలు, ఇంధన ఆదా అనే మూడు స్తంభాలపై నిర్మించబడిన "గో సేవ్ టుడే" ప్రచారం, ఈ పండుగ సీజన్‌లో వినియోగదారులకు సాటిలేని విలువను అందిస్తుంది. "గో సేవ్ టుడే" ప్రచారంలో భాగంగా, కస్టమర్లు ప్రీమియం బెస్పోక్ ఏఐ%×% ఎయిర్ కండిషనర్ల కొనుగోలుపై ప్రత్యేకమైన 5-5-50 ఆఫర్‌ను పొందుతారు. సెప్టెంబర్ 22, నవంబర్ 10, 2025 మధ్య 50-రోజుల వ్యవధిలో కొనుగోలు చేస్తే, ఇప్పటికే ఉన్న 5 సంవత్సరాల సమగ్ర వారంటీకి అదనంగా 5 నెలల అదనపు సమగ్ర వారంటీ లభిస్తుంది. బెస్పోక్ ఏఐ ఎయిర్ కండిషనర్ కస్టమర్లు రూ.3800 వరకు జీఎస్‌టీ తగ్గింపు ప్రయోజనం, రూ.1500 విలువైన ఉచిత ఇన్‌స్టాలేషన్, రూ.4000 వరకు బ్యాంక్ క్యాష్‌బ్యాక్‌ను కూడా పొందుతారు.

సంపాదకీయం

భగవత్ గొంతులో వణుకు

రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా సంఘ్ పరివార్ అధినేత మోహన్ భగవత్ నాగపూర్‌లో చేసిన ప్రసంగం కనీసం ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలకైనా స్ఫూర్తి కలిగిస్తుందన్న నమ్మకం లేదు. వందేళ్లు పూర్తి అయిన సందర్భంగా భగవత్ మరో వందేళ్లపాటు సంఘ్ పరివార్ ఎజెండాను ఖరారు చేసే రీతిలో మాట్లాడతారనుకున్న వారి అంచనాలు తారుమారయ్యాయి. ఆయన స్వరంలో ఏదో భయం కనిపించింది. మోదీకి, ఆర్‌ఎస్‌ఎస్. అధినేతకు విభేదాలున్నాయన్న వార్తలు పదే పదే వస్తున్నాయి. అందుకే మోదీ పేరున ఇటీవల పత్రికల్లో సుదీర్ఘ వ్యాసాలు వచ్చాయి. ఆయన ఆ వ్యాసంలో సంఘ్‌ను ఆకాశానికి ఎత్తేశారు. అదే రీతిలో మోహన్ భగవత్ సైతం గురువారం నాటి ప్రసంగంలో మోదీ ప్రభుత్వాన్ని కాపాడే పనికే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారు. ఆయన ప్రసంగం అంతా రెండు అంశాల మీద సాగింది. ఒకటి: శ్రీలంక, బంగ్లాదేశ్, తాజాగా నేపాల్‌లో యువతరం తిరుగుబాటు బావుటా ఎగరేసి ప్రభుత్వాలకు సవాలు విసరడం, నిజానికి ప్రభుత్వాలను పడదోయడం భగవత్ మనసును బాగా కలచి వేస్తున్నట్టుంది. మోదీకి, భగవత్‌కు మధ్య సఖ్యత ఏ మేరకు ఉందన్న అంశం పక్కన పెట్టినా మన దేశంలో అనేక చోట్ల యువత గళమెత్తడం, నిరసన ప్రదర్శనలకు దిగడం భగవత్‌ను కలచి వేస్తున్నట్టుంది. సంఘ్ పరివార్‌కు అనుబంధ సంస్థ అయిన బీజేపీ గౌరవప్రదమైన స్థానం సంపాదించడానికి దశాబ్దాల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది. చివరకు సంఘ్‌కు అనుబంధంగా ఉన్న బీజేపీ మొదట 1967లో కొన్ని రాష్ట్రాలలో సంయుక్త విధాయక్ దళ్ మంత్రివర్గాలలో భాగస్వామి కాగలిగింది. 1977 లో ఎమర్జెన్సీ పుణ్యమా అని బీజేపీకి పూర్వ రూపమైన భారతీయ జనసంఘ్ జనతా పార్టీలో విలీనం కావడంతో రెండేళ్లపై చిలుకు కాలం అధికారంలో భాగస్వామి కాగలిగింది. ఆ తరవాత అటల్ బిహారీ వాజపేయి నాయకత్వంలో ఎన్డీయే ప్రభుత్వం ఆరేళ్ల కాలం కేంద్రంలో ప్రభుత్వం నిర్వహించగలిగింది. ఆ తరవాత మోదీ నాయకత్వంలో బీజేపీ గణనీయమైన విజయం సాధించింది. 2019 లో రెండోసారి మరింత బలపడింది. 2024 లో మెజారిటీ సంపాదించలేక పోయినా ఎన్డీయే భాగస్వామ్య పక్షాలతో కలిసి మోదీ అధికారం సంపాదించగలిగారు. ఈ ప్రభుత్వానికి ఎలాంటి హానీ కలగకూడదని భగవత్ భావిస్తున్నట్టు ఉన్నారని శుక్రవారం నాటి ప్రసంగం నిరూపించింది. భగవత్ ప్రసంగాన్ని నిశితంగా పరిశీలిస్తే మహాత్మా గాంధీ, అంబేద్కర్ పేర్లు ప్రస్తావించకుండా మనుగడ సాధ్యం కాదని భగవత్ గుర్తించారు. స్వాతంత్ర్య పోరాటంలో సంఘ్ పరివార్‌కు ఏ పాత్రా లేదన్నది చారిత్రక సత్యం. కానీ సంఘ్ పాత్ర ఉన్నట్టు నమ్మించడానికి మోదీ తంటాలు పడుతున్నారు. మహాత్మాగాంధీ రెండు సార్లు ఆర్‌ఎస్‌ఎస్ సమావేశాలకు హాజరయ్యారని గొప్పగా చెప్పుకుంటోంది. స్వాతంత్ర్యోద్యమంలో తమ వారసత్వం ఏమీ లేదు కనక మొట్టమొదట సర్దార్ పటేల్‌ను సొంతం చేసుకోవాలని ప్రయత్నించింది. ఆ తరవాత సుభాష్ చంద్రబోసును తమలో కలిపేసుకోవడానికి ప్రయత్నించింది. అంతకు ముందే భగత్‌సింగ్ వారసత్వం తమదేనని చెప్పుకోవడానికి పడరాని పాట్లు పడింది. గాంధీని హతమార్చిన నాథూరాం గాడ్సే సంఘ్ కుదురువాడేనన్న వాస్తవాన్ని దాచేసి భగవత్ మహాత్ముడి పేరెత్తవలసి వచ్చింది. వందేళ్ల కింద విజయ దశమి రోజునే ఆర్‌ఎస్‌ఎస్ అవతరించింది. తమది సామాజిక, సాంస్కృతిక సంస్థ మాత్రమేనని సంఘ్ నిరంతరం వాదిస్తూ ఉంటుంది. విజయదశమికి మరో ప్రాధాన్యతా ఉంది. 1956 లో అదే నాగపూర్‌లో అంబేద్కర్ బౌద్ధ మతం స్వీకరించారు. అంబేద్కర్ హిందూ మతంలో ఉన్న రుగ్మతలను ఎత్తి చూపడానికి ఎంతటి ప్రయత్నం చేశారో చెప్పనక్కర్లేదు. హిందూ మతంలోని కులవివక్షతో విసిగిపోయి ఆయన బౌద్ధం స్వీకరించవలసి వచ్చింది. అంబేద్కర్ పేరును భగవత్ వాడుకున్నారు కానీ హిందూ మతాన్ని పీడిస్తున్న ఒక్క అంశాన్ని అయినా ఆయన ప్రస్తావించలేదు. హిందూ మత ప్రక్షాళనకు ఆయన చేసిన సూచన ఒక్కటీ లేదు.

భగవత్ ప్రసంగంలో నేపాల్, శ్రీలంక, బంగ్లాదేశ్ పరిణామాలను ప్రస్తావించారు కానీ వాటిని అరాచకంగా జమ కట్టేశారు. ఈ ఉద్యమాలు సఫలం కావని భాష్యం కూడా చెప్పారు. చివరకు ఫ్రెంచ్ విప్లవం తరవాత నెపోలియన్ అధికారంలోకి వచ్చారని ఎత్తిపొడిచారు. సోషలిస్టు దేశాలు ఎలా విఫలమయ్యాయో చెప్పడమూ భగవత్ మరిచిపోలేదు. ప్రజాస్వామ్యమే పరమావధి అని భగవత్ నొక్కి చెప్పారు. మోదీ ప్రభుత్వం అనునిత్యం ప్రజాస్వామ్యం గొంతు నులమడం ఆయనకు కనిపించకపోవడంలో ఆశ్చర్యం లేదు. మోదీ ప్రజాస్వామ్యాన్ని పరిరక్షిస్తున్నారన్న భ్రమ ఎవరికీ లేదు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడం వల్ల జనం ఎక్కడ తిరగబడతారో, ఒకప్పుడు సంఘ్ ప్రచారక్ అయిన మోదీ ఎక్కడ గద్దె దిగవలసి వస్తోందోనని భగవత్ భయపడి పోతున్నారు. అన్ని సోషలిస్టు దేశాలూ ఇప్పుడు పెట్టుబడిదారీ దేశాలైపోయాయని భగవత్ విమర్శిస్తున్నారు. బీజేపీ ఆత్మకు ఇంపైన స్వదేశీకి మోదీ ఎప్పుడో తిలోదకాలు ఇచ్చేశారు. ఈ మధ్యే మళ్లీ ఆ పాట పాడుతున్నారు. మరి మోదీ సర్కారు చైనాను ఎందుకు ఆలింగనం చేసుకుంటున్నదో మాత్రం భగవత్ చెప్పలేదు. 2019 లో అమెరికాను పొగిడిన సమయంలో భగవత్‌కు స్వదేశీ గుర్తుకు రాలేదు. అమెరికా పెట్టుబడులను సంఘ్ ఎన్నడూ వ్యతిరేకించలేదు. ప్రభుత్వం ప్రజానుకూల విధానాలు అనుసరించకపోతే జనాగ్రహం పెరుగుతుందని భగవత్ వణికి పోతున్నారు. పొరుగు దేశాల పరిణామాలు భగవత్‌ను భయకంపితం చేస్తున్నాయి. గురువారం నాటి సంఘ్ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ పదే పదే అంబేద్కర్‌ను ప్రస్తావించారు. 2001 లో ఎర్రకోట దగ్గర జరిగిన దళిత సమావేశంలో పాల్గొన్న అటల్ బిహారీ వాజపేయి ఈ దేశం ధీం స్మృతి అంటే రాజ్యాంగం ప్రకారం నడుస్తుందే తప్ప మనుస్మృతి ప్రకారం కాదు అన్న మాటను కోవింద్ గుర్తు చేశారు. భగవత్ ప్రసంగంలో రాజ్యాంగం విశిష్టత ఎక్కడా వినిపించలేదు. సంఘ్ శతవార్షిక సమావేశం మరొకటి మహారాష్ట్రలో జరగాల్సి ఉంది. దానికి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవయ్ తల్లి కమల తాయి గవయ్‌ను ఆహ్వానించాలనుకున్నారు. నిజానికి ఇది ఆమెను రచ్చకీడ్చే ప్రయత్నమే. ఆమె చివరకు ఈ ఆహ్వానాన్ని తిరస్కరించారు. తాను నికార్సైన అంబేద్కర్ వాదినే తప్ప సంఘ్ సిద్ధాంతం తనకు ఏమాత్రం సమ్మతం కాదని కమలా తాయ్ గవయ్ స్పష్టం చేయవలసి వచ్చింది. తాను అంబేద్కర్ వాదాన్ని, రాజ్యాంగాన్ని అనుసరిస్తానని ఆమె తెగేసి చెప్పారు. రాజకీయాలతో తమకు సంబంధం లేదని సంఘ్ నేతలు అదే పనిగా చెప్తూ ఉంటారు. మరి మోహన్ భగవత్ ప్రజాస్వామ్యాన్ని ఎందుకు కీర్తించినట్టో! సంఘ్‌ను నడిపించేది హిందుత్వ సిద్ధాంతం. ఇటీవల సంఘ్ పరివార్ మునుపటి నాయకులు మురళీ మనోహర్ జోషి, గోవిందాచార్య ఒక లేఖ రాసి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను తూర్పారబట్టారు. దీని గురించి భగవత్ ప్రసంగంలో ప్రస్తావనే లేదు. సామాజిక ఘర్షణలను, ధరల పెరుగుదలను, ఆర్థిక అసమానతలను ప్రస్తావిస్తే మొదటికే మోసం. భగవత్ చేసిన పనీ అదే. మోదీ ప్రభుత్వాన్ని వెనకేసుకు రావడంతోనే ఆయన ప్రసంగం అంతా సరిపోయింది.

ఇండియా బ్లాక్ ఐక్యత విస్మరించలేనిది

సుశీల్‌కుట్టి

ఇండియా బ్లాక్ (ఇండియా ఐక్య సంఘటన) అధికారాన్ని సాధించేందుకు ఐక్యతను ఎంతమాత్రం విస్మరించరాదు. 2024 లో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో కొన్ని రాష్ట్రాల స్థాయిలో కాంగ్రెస్ చేసిన పొరపాట్ల మూలంగా బీజేపీ అధిక సీట్లను గెలుచుకోగలిగింది. సొంతంగా అధికారాన్ని బీజేపీ సాధించలేక పోయినప్పటికీ ఐక్య సంఘటన బీజేపీ కంటే ఎక్కువ స్థానాలు గెలుచుకోలేక పోయింది. ఇందుకు కాంగ్రెస్ చేసిన కొన్ని పొరపాట్లే కారణమని భావించారు. అనంతరం హర్యానా, మహారాష్ట్రలో ఐక్య సంఘటనలో భాగస్వాములైన పార్టీలు ఐక్యంగా లేకపోవటంతో ఆ రాష్ట్రాలలో తక్కువ స్థానాలతో సరిపుచ్చుకోవలసి వచ్చింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ నాయకుడు పార్లమెంటులో ప్రతిపక్ష నాయకుడైన రాహుల్‌గాంధీ సంవత్సరం పైగా సాగించిన కృషి మూలంగా ఐక్య సంఘటన ఐక్యతను సంతరించుకుంది. బీహార్ అసెంబ్లీకి త్వరలో జరగనున్న ఎన్నికల్లో ముఖ్యంగా ఆర్జేడీ, కాంగ్రెస్ మధ్య పొరపొచ్చాలు రాకుండా చూసుకోవాలి. ముఖ్యంగా కాంగ్రెస్ ఆర్జేడీ నాయకుడు తేజస్వీయాదవ్‌తో విభేదాలు రాకుండా ఐక్యంగా పోటీ చేయడం ఎంతైనా అవసరం. బీజేపీ నాయకుడు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ అధీనంలో ఎన్నికల కమిషన్ ఉండి బీజేపీని గెలిపించేందుకు సహకరిస్తున్నదన్న ఆరోపణలు గణనీయంగా ఉన్నాయి. అందువల్ల ఇండియా ఐక్య సంఘటనలో ఏమాత్రం విభేదాలు రాకుండా చూసుకోవాలి. ఇండియా ఐక్య సంఘటనలో పార్టీలు ఇప్పుడే సీట్ల పంపిణీ చేసుకుని అన్ని పార్టీలు కలిసి రాష్ట్ర వ్యాప్తంగా ప్రచారం సాగించాలి. మళ్లీ పార్లమెంటు ఎన్నికలు జరిగే వరకు ప్రతిపక్ష పార్టీలన్నీ కలిసి కార్యాచరణ రూపొందించుకుని ప్రభుత్వ అక్రమాలను ప్రజల వద్దకు తీసుకువెళ్లాలి. అప్పుడే బీజేపీ, జేడీ(యు) ప్రభుత్వం ఓడిపోయే అవకాశం ఉంటుంది. విభేదాలు చోటుచేసుకునే విధానాన్ని లేదా వ్యూహాన్ని అనుసరిస్తే పరిస్థితి మారిపోతుంది. లాలూప్రసాద్ యాదవ్ నాయకత్వంలోని రాష్ట్రీయ జనతాదళ్ బీజేపీ జేడీ(యు)తో కలిసి ఉన్న చిరాగ్‌పశ్వాన్‌తో ఆకస్మికంగా దూరమయ్యే సూచనలు కన్పిస్తున్నాయి. ఆర్జేడీ పెద్ద పార్టీ అయినప్పటికీ పశ్వాన్‌తో తగాదా ఏర్పడినట్లయితే ఐక్య సంఘటనకు దెబ్బ తగులుతుంది. ముఖ్యంగా కాంగ్రెస్ మిత్రపక్షాలతో పూర్తి సఖ్యంగా ఉండాలి. మిత్రపక్షాలను కాంగ్రెస్ దగ్గరకు తీసుకోవలసిన అవసరం ఉంది. బీహార్‌లో ఐక్యత అవసరం ఏయే ప్రాంతాల్లో ఉందో గుర్తించి అన్ని పార్టీలను కలుపుకు పోవలసిన బాధ్యత కాంగ్రెస్ మీదే ఉంది. బీహార్‌లో నిరంతరం బీజేపీ, జేడీయు పరిపాలనలో జరిగిన అక్రమాలన్నింటిని కాంగ్రెస్ బయటపెట్టి ప్రజలకు వివరించాలి. ఐక్య సంఘటనలో పార్టీలన్నింటిని వెంటనే సంప్రదించి సీట్ల పంపకం జరిగేట్లుగా కాంగ్రెస్ చొరవ తీసుకోవాలి. ఈ విషయంలో ఎంతమాత్రం సమయాన్ని వదులుకోకూడదు. ఐక్య సంఘటనలోని అన్ని పార్టీలు ముఖ్యంగా రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్జేడీ) తో కలిసి ఐక్యంగా ముందుకు సాగాలి. గతంలో లాలూప్రసాద్‌యాదవ్ గాంధీ కుటుంబాన్ని దూరంగా పెట్టారు. రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి కావటానికి గతంలో ప్రయత్నాలు జరిగాయని భావిస్తూ లాలూ కాంగ్రెస్‌ను దెబ్బతీశారు. రాహుల్‌గాంధీ బీహార్‌లో నిర్వహించిన "ఓట్ అధికార్

యాత్ర" విజయవంతంగా నిర్వహించారు. రాహుల్ ఒక్కరే ఈ యాత్రను నిర్వహించి కాంగ్రెస్ మిత్ర పార్టీలన్నింటిని నిరుత్సాహపరచారని భావిస్తున్నారు.

ఓట్ అధికార్ యాత్ర కేవలం కాంగ్రెస్‌దిగా చెప్పుకుంటున్నారు. ఆర్జేడీ నాయకుడు తేజస్వీయాదవ్ ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టేందుకు రాహుల్‌గాంధీ తిరస్కరించారని అనుకుంటున్నారు. బీహార్‌లో కాంగ్రెస్, ఆర్జేడీ తదితర మిత్ర పార్టీలు మహాఘట బంధన్‌గా ఈ ఎన్నికల్లో పోటీ చేసేందుకు నిర్ణయించుకున్నాయి. తేజస్వీ యాదవ్‌ను రాహుల్‌గాంధీ ఎందుకు అంగీకరించటం లేదని కూడా ప్రశ్నిస్తున్నారు. అయితే రాహుల్‌గాంధీ ఆకాంక్షను తేజస్వీయాదవ్ వ్యతిరేకించడం లేదని వార్తలు అందుతున్నాయి. ముఖ్యమంత్రిగా తేజస్వీయాదవ్‌ను బలపరిచేందుకు కాంగ్రెస్ సిద్ధంగా లేదేమోనని చెబుతున్నారు. ఆర్జేడీకి తగినన్ని ఓట్లు రావేమోనని కాంగ్రెస్ నాయకులు సందేహిస్తున్నారు. కొన్ని కులాలు ముఖ్యంగా ఉన్నత కులాల నుంచి ఆర్జేడీకి ఓట్లు ఎక్కువగా రాకపోవచ్చునని భావిస్తున్నారు. అయితే కాంగ్రెస్‌కి ఎక్కువగా ఓట్లు వస్తాయని అయితే ఉన్నత స్థాయి కులాల ఓటు బ్యాంక్‌గా పరిగణించవచ్చునా అనే మాట కూడా వస్తోంది. తేజస్వీయాదవ్ ప్రతిష్ట గణనీయంగా మెరుగ్గా ఉంది. ఆయన పైన 35 కేసులున్నాయని ప్రచారం చేస్తున్నారు. లాలూప్రసాద్ యాదవ్ గడ్డి కుంభకోణం విషయాన్ని ప్రతిపక్షం లేవనెత్తి ప్రతికూలంగా ప్రచారం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ఇలాంటి సమస్యలను ఎదుర్కోవటం ఎలా అని సందేహిస్తున్నారు. మహాఘట బంధన్ నేర పరిశ్రమ లాంటిదని ప్రచారం సాగిస్తున్నందున మిత్ర పార్టీలు ఒక దానికొకటి ఏమాత్రం సహకరిస్తాయన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మహాఘట బంధన్‌లో కాంగ్రెస్ ఎన్ని సీట్లను కోరుకుంటోంది? కనీసం 70 సీట్లను కాంగ్రెస్ కావాలంటున్నదని సూచనలు వస్తున్నాయి. అయితే ఆర్జేడీ ఇన్ని సీట్లు ఇవ్వడానికి సిద్ధంగా లేదు.

> బీహార్ అసెంబ్లీకి త్వరలో జరగనున్న ఎన్నికల్లో ముఖ్యంగా ఆర్జేడీ, కాంగ్రెస్ మధ్య పొరపొచ్చాలు రాకుండా చూసుకోవాలి. ముఖ్యంగా కాంగ్రెస్ ఆర్జేడీ నాయకుడు తేజస్వీయాదవ్‌తో విభేదాలు రాకుండా ఐక్యంగా పోటీ చేయడం ఎంతైనా అవసరం. బీజేపీ నాయకుడు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ అధీనంలో ఎన్నికల కమిషన్ ఉండి బీజేపీని గెలిపించేందుకు సహకరిస్తున్నదన్న ఆరోపణలు గణనీయంగా ఉన్నాయి. అందువల్ల ఇండియా ఐక్య సంఘటనలో ఏమాత్రం విభేదాలు రాకుండా చూసుకోవాలి.

సార్వత్రిక ఎన్నికల సమయంలో ఇచ్చినన్ని సీట్లను అసెంబ్లీ ఎన్నికలకు ఇవ్వడానికి ఆర్జేడీ అంగీకరించడం లేదు. తాజాగా కాంగ్రెస్ ఆర్జేడీ మధ్య సన్నిహితమైన చర్చలు లేవని చెప్పుకుంటున్నారు. సీట్ల పంపిణీపై చర్చలకు తేజస్వీయాదవ్, రాహుల్‌గాంధీ సిద్ధపడవలసిన సమయమిది. ఆర్జేడీ తమది పెద్ద పార్టీ అని భావిస్తోంది. రెండవ శ్రేణి పార్టీగా అంగీకరించడం లేదు. మహాఘట బంధన్‌ను మరింతగా విస్తరించాలని అప్పుడే విజయం సాధించటం సాధ్యమవుతుందని కాంగ్రెస్ కోరుతోంది. అయితే ఇతర పార్టీలు ఇందుకు అంగీకరించడం లేదు. కాంగ్రెస్, ఆర్జేడీ 25 ఏళ్లుగా కలిసి పోటీ చేస్తున్నాయి. కొన్ని సందర్భాలలో అనేక అసెంబ్లీ నియోజక వర్గాలలో రెండు పార్టీలు పోటీ చేశాయి. ముస్లిం ఓట్ల విషయంలోనే విభేదాలు ఏర్పడి ఒక పార్టీపై మరో పార్టీ పోటీ చేశాయి. 2025 లోనైనా అసెంబ్లీ ఎన్నికలు దగ్గర సంబంధాలతో కలిసి పోటీ చేయటం తప్పనిసరి అవసరం. మహాఘట బంధన్‌లోని పార్టీలన్నీ కలిసి పోటీ చేస్తాయా లేదా అన్న సందేహాలు కలుగుతున్నాయి.ఇదే సమయంలో మోదీ 75 లక్షల మహిళల బ్యాంకు ఖాతాల్లో పదివేల రూపాయలు వేశారు. ఈ డబ్బు ఓట్లను దృష్టిలో ఉంచుకొని వేశారు. రకకాల పథకాలను నెలకొల్పేందుకు ఈ డబ్బు పంపిణీ చేశామని బీజేపీ, జెడి(యు) పార్టీలు ప్రచారం చేసుకుంటున్నాయి. మోదీ ఎలాగైనా బీహార్‌లో అధికారం చేపట్టడానికి అనేక అక్రమాలకు పాల్పడారన్న ప్రచారం సాగిస్తున్నారు. ఓటర్ల సవరణ జాబితానే ఆఘమేఘాల మీద ఎన్నికల కమిషన్ చేపట్టి ఓటర్ల జాబితా నుంచి 56 లక్షల ఓట్లు తొలగించినట్టు ఎన్నికల కమిషన్ ప్రకటించింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు మళ్లీ ఎన్నికల జాబితాను ప్రకటించి మరికొన్ని లక్షల ఓట్లను తొలగించారు. 75 లక్షల మంది మహిళలకు పదివేల చొప్పున పంపిణీ చేయడం ఎనలేని అక్రమమని విశ్లేషకులు చెప్తున్నారు.

భైరప్పా... ఇలా వెళ్లిపోయావేందప్పా...!

అబ్బే... భైరప్ప ఎవరో కాదు. మనోడే. మన పెద్దిభొట్ల సుబ్బరామయ్యే. మన మహా రచయిత రాచకొండ విశ్వనాథశాస్త్రే. కాసింత పరికించి చదివితే రాయలసీమ నుంచి వచ్చిన నికార్సైన కథకుడు కాశీభట్ల వేణుగోపాలే. పున్నమినాగు సినిమాలో చిరంజీవికి ఫొటో తీస్తే పాము పడినట్లు భైరప్పని చదివితే వీళ్లందరి కథలు గుర్తుకొస్తాయి. మొత్తం బాపన యవ్వారం. కాకపోతే బ్రాహ్మణీకం కాదు సుమీ. బ్రాహ్మణ జీవితాలను బట్టలూడదీసి పాఠకుల ముందు మొండిమొలతో నిలబెట్టారు వీళ్లంతా. అంతకు ముందే గురజాడ, శ్రీపాద, కందుకూరి అలాంటి పనే చేశారు. వాళ్ల తర్వాత వీళ్లన్న మాట. పెద్దిభొట్ల సుబ్బరామయ్య తిలాదానం కథ చదివారా...! అది కన్నడంలో రాస్తే ఆ కథ కింద భైరప్ప అని పేరుంటుంది. రా.వి.శాస్త్రి ఇల్లు నవల గుర్తుందా...! ఆ నవల్లో ఆ ఇంటిలో అద్దెకున్న గయ్యాళి స్త్రీ పాత్ర ఒకటి ఉంటుంది. ఆవిడ కూడా భైరప్ప రాసిన గంగమ్మ పాత్ర లాంటిదే. కాకపోతే గంగమ్మ కారణంగా ఇల్లు భ్రష్టు పడితే, రా.వి.శాస్త్రి గయ్యాళి పాత్ర ద్వారా కోర్టు నుంచి వచ్చిన వాళ్లు పుంజాలు తెంపుకుపోయి పారిపోయారు. ఇక కాశీభట్ల అంటారా... ఆయన రాసిన ఓ గయ్యాళి పాత్ర గురించి, ఆ పాత్ర వల్ల ఆ ఇల్లు ఎలా నాశనం అయ్యిందో తెలియాలంటే తెరవని తలుపులు నవల చదవాల్సిందే. ఏదో

చక్రవాకం
- ముక్కాముల చక్రధర్

అనుకుంటాం కానీ... దారుణమైన బతుకులు తెలుగైనా, కన్నడమైనా, తమిళమైనా, ఉత్తరాది అయినా ఒకేలా ఉంటాయి అన్నాడు భైరప్ప తన రచనలతో. అని ఊరుకుంటే ఆయన మనలాంటి వాడే అయి ఉండేవారు కాదు కదా. మనకి ఆయనకి పోలిక లేదు కదా. అందుకే ఆ జీవితాలని కాగితాల మీద పెట్టేశాడు. ఆయన ఆత్మకథే అన్నారు అంతా. కాకపోతే ఆత్మకథాత్మక నవల. అదే ఖిడ్కీ. ఇది కూడా ఇంచుమించు రాణి శివ శంకర శర్మ రాసిన వారి నాన్న నర్సింహశర్మ ఆత్మకథాత్మక నవల. చిన్న తేడా ఏంటంటే నర్సింహశర్మ సనాతన ధర్మ ఆచరణ భైరప్ప దగ్గర తిరగబడింది ఆయన చివరి రోజుల్లో.

భైరప్ప యవ్వనులు కదా... ఆ రోజుల్లో... అందుకని అలా రాశారని భావించాలి. అంతే. మరీ పెద్దయ్యాక... లౌకికం అయిన తర్వాత రాసిందంతా హిందుత్వమే. అలాగని ఏమనలేం. ఏమనకూడదు. కొన్ని మహా వాక్యాలను మనకిచ్చారు కదా... ! వయసుదేముంది. వస్తుంది. కానీ మహా రచనలు అలా కాదు కదా... అందుకని భైరప్పని నెత్తిన పెట్టుకోవాల్సిందే. పదునాలుగేళ్ల వయసులో అన్నయ్య చచ్చిపోయారని పదునాలుగు మైళ్ల దూరంలో ఉన్న భైరప్పకి కబురొచ్చింది. సైకిలు తొక్కుకుంటూ ఆ దరికి చేరుకుని చూస్తే అన్న శవం ఎదురుగా నిద్రిస్తోంది. ఊళ్లో అందరూ అప్పటికే శవాలుగా మారారు కదా...! ప్లేగు భయంతో. వాళ్లెవ్వరూ రాలేదు ఈ దరికి. అన్న శవాన్ని ఓ భుజం మీదా... అగ్నిహోత్రం నిండిన నల్లని కుండ మరో చేత్తో పట్టుకుని శ్మశానంలాంటి ఊరు దాటి ఉత్తరం వైపున్న నిజ శ్మశానానికి నడుచుకుంటూ వెళ్లి అన్నకు ఉత్తర క్రియలు చేసిన బాల్యం భైరప్పది. అదే రాశాడాయన తన ఆత్మకథలో. ఇది చదివాం కదా. మనం బతికుండగా శవాలుగా మారకూడదని నిర్ణయించుకున్నాం కదా. అందుకే... ఇందుకే భైరప్పని నెత్తిన పెట్టుకుంటాం. ఇలాగే... అచ్చం ఇలాగే...గుల్జార్‌ని కూడా నెత్తిన పెట్టుకుంటున్నాం. దేశ విభజన సమయంలో సరిహద్దు దాటుతున్న గుల్జార్, ఆయన తల్లి, ఆ తల్లి భుజంపై చెల్లెలు. ఆ చిన్నారి రక్తం కక్కుకుని మరణిస్తే అక్కడే ఆ చిట్టితల్లిని జార విడిచి ఇక్కడికి వచ్చేశాం అన్నారు గుల్జార్. ఇదిగో... ఇలాంటివి చదివినప్పుడే సాహిత్యానికి భాష ఏంటి అనిపిస్తుంది.

జీవితం అంటే గాయాల పుట్ట కదా...! జీవితం అంటే సలపరింతల మెలకువ కదా...! జీవితం అంటే కన్నీటి కుండ కదా..! జీవితం అంటే క్షణ క్షణం కాలిపోవడం కదా...! ఆ రహస్యం తెలిసి అక్షరం అయ్యారు భైరప్ప. మనం ఇలా మిగిలాం ఆ అక్షరాలను మోస్తూ... వగస్తూ... శ్వాసిస్తూ...! జీవితానుభవాల నుంచి భైరప్ప రెబల్ అయ్యారు. మానవ సంబంధాలని ఏకేశారు. అవన్నీ కలగలిపి గృహబంగ, దాటు, పర్వ, వంశవృక్ష అయ్యాయి. గాయత్రీ మంత్రం ఆడవారు ఎందుకు చదవకూడదని నిలదీశాడు. యజ్ఞోపవీతం మగవారికే ఎందుకని ప్రశ్నించారు ఆ దాటు నవల్లో. మహాభారతాన్ని పర్వ పేరుతో చీల్చి చెండాడారు. అది చదివేంత వరకూ ధృతరాష్ట్రుడి భార్య గాంధారి కళ్ల గంతలకి కారణాలు వెతకలేకపోయిన వాళ్లం. ఆ గంతలు పతివ్రతకు చిహ్నాలు అనుకున్నాం కానీ... భైరప్ప చెప్పే వరకూ ఆ గంతలకు కారణం ధృతరాష్ట్రుడ్ని చూడకూడదనుకుందా గాంధారి అని ప్రశ్నించుకుంటాం. భైరప్ప చెప్పిందే నిజమనుకుంటే గాంధారీ తొట్టతొలి ఫెమినిస్టుగా భావించాలా...! ఇలా ప్రశ్నలు మిగిల్చి వెళ్లిపోయారు భైరప్ప. కానీ, ఆ చివరాఖరి రోజుల్లో ఆయన చేసిన ప్రకటనలకి అచ్చెరువొందుతాం. కాసింత ఆగ్రహిస్తాం కూడా. కాషాయం కలకాలం ఉండాలన్న ఆయన ఆకాంక్షను వ్యతిరేకించారేమో విమర్శకులు అని సర్దుకుంటాం. చివరి రోజుల భైరప్ప నాకిష్టం లేదు. గృహబంగ భైరప్ప నాకు అత్యంత ప్రియం. అయినా... మీ మార్పులు మాకెందుకు. మీ అక్షరాలు కావాలి కానీ. వచ్చే జన్మలో తెలుగు రాష్ట్రాల్లో పుట్టప్పా. కొన్ని వాక్యాల దండగా మారప్పా...! నే నిన్ను కలవకుండా వెళ్లిపోవడమే నాకు మిగిలిన విషాదం. మళ్లీ వస్తావు కదా... పోనీ నేకూడా అక్కడికి వచ్చాక... ఇద్దరం ఓ తల్లి కడుపున పుడదాం భైరప్పా....!

- సీనియర్ జర్నలిస్టు, 99120 19929

ఔషధ రంగంపై ట్రంప్ టారిఫ్ దెబ్బ

గనిశెట్టి సత్యనారాయణ

దిగుమతి అయ్యే అన్ని బ్రాండెడ్ లేదా పేటెంట్ ఔషధాలపై అక్టోబర్ ఒకటి నుంచి వంద శాతం టారిఫ్ విధిస్తూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటనతో ఫార్మా కంపెనీలపై పిడుగుపడినట్లయింది. ఔషధ రంగంపై టారిఫ్ ప్రభావం పెద్దగాలేదని ఇంతవరకు ధీమాగా వున్నప్పటికీ, ఇప్పుడు వంద శాతం టారిఫ్ అమలు చేస్తామని చెప్పడంతో భారత ఔషధ రంగం పరిస్థితిపై తీవ్రమైన ప్రభావం పడుతుందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. అమెరికాలోని ఔషధ కంపెనీలకు ఈ టారిఫ్ నుంచి మినహాయించి, భారత ఔషధ రంగాన్ని దెబ్బతీసే కుట్రలకు ట్రంప్ తెరదీశారు.

భారత ఔషధరంగ ఎగుమతుల్లో 40 శాతం అమెరికాకు వెళ్తున్నాయి. ఇండియా ఔషధ పరిశ్రమకు అమెరికా ప్రధాన మార్కెట్. అమెరికా విధించిన 100 శాతం టారిఫ్, భారతదేశ ఔషధ పరిశ్రమపై తీవ్ర ప్రభావం చూపవచ్చని అంచనా. అమల్లోకి వచ్చిన టారిఫ్‌తో ఇండియా ఫార్మా కంపెనీల ఆదాయాలు గణనీయంగా తగ్గుతాయని ఈ ఏడాది ఆగస్టులో ఎస్‌బీఐ రీసెర్చ్ విడుదల చేసిన నివేదిక పేర్కొంది. ఔషధ రంగం దెబ్బతినడం ద్వారా కార్మికుల ఉపాధి అవకాశాలు తగ్గుతాయి. ఇండియా ఔషధ ఎగుమతులపై 50 శాతం టారిఫ్ అమలుచేస్తే 2026 ఆర్థిక సంవత్సరంలో ఫార్మా కంపెనీల ఆదాయాలు 5 నుంచి 10 శాతం తగ్గే అవకాశం ఉందని ఆ నివేదిక అంచనా వేసింది. పెద్ద ఫార్మా కంపెనీలు తమ మొత్తం ఆదాయంలో 40 నుంచి 50 శాతం వరకు అమెరికా మార్కెట్ నుంచే పొందుతున్నాయి. టారిఫ్‌ల కారణంగా భారత ఉత్పత్తులు అమెరికా వంటి ప్రపంచంలోనే అతిపెద్ద ఔషధ మార్కెట్‌లో ఉనికిని కోల్పోయే అవకాశముంది. పెరిగిన ఖర్చులను వినియోగదారులకు బదిలీచేసి భారం మోపే ప్రమాదముంది.

2024 ఆర్థిక సంవత్సరంలో భారతదేశంలో 27. 9 బిలియన్ డాలర్ల విలువైన ఫార్మా ఎగుమతుల్లో 31 శాతం లేదా 8.7 బిలియన్ డాలర్లు (సుమారు 77. 138 కోట్లు) అమెరికాకు ఎగుమతిచేసినట్లు ఫార్మాస్యూటికల్స్ ఎక్స్‌పోర్టు ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా అనే ఫార్మా సంస్థ ఇటీవల పేర్కొంది. ఈ నివేదికల ప్రకారం అమెరికాలో వినియోగించే జనరిక్ ఔషధాల్లో 45 శాతం బయో సిమిలర్ ఔషధాల్లో 15 శాతం భారత నుంచి సరఫరా అవుతోంది. డాక్టర్ రెడ్డీస్, అరబిందో ఫార్మా, జడేస్ లైఫ్ సైన్స్, సన్ ఫార్మా, గ్లాండ్ ఫార్మా వంటి సంస్థలు తమ మొత్తం ఆదాయంలో 30- 50 శాతం వరకు అమెరికన్ మార్కెట్ నుంచి వస్తున్నాయి. రాష్ట్రంలో అత్యధికంగా అనకాపల్లి జిల్లా పరవాడ మండలంలో జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మా సిటీ ఔషధ కంపెనీలకు పెద్ద కేంద్రంగా వుంది. భారత ఔషధాలపై విధించిన టారిఫ్ ప్రభావం వెనువెంటనే తెలియనప్పటికీ క్రమంగా భవిష్యత్తులో దీని ప్రమాదం తీవ్రంగా ఉండనుంది.



సుంకాల పెంపుతో అమెరికన్ దిగుమతిదారులు, వినియోగదారులకు బ్రాండెడ్ ఔషధ ఉత్పత్తుల ధరలు రెట్టింపు కానున్నాయి. కొత్త సుంకాల వాణిజ్య భాగస్వామి విధించిన జాతీయ సుంకాలకు అదనంగా వర్తింప చేస్తారా? లేదా? అన్నది ట్రంప్ స్పష్టంగా చెప్పనప్పటికీ, భారతలో ఫార్మా రంగం తమ ఉత్పత్తులను తగ్గించుకుంటే ఫార్మా రంగంలో పనిచేస్తున్న లక్షలాది మంది కార్మికులు తమ ఉపాధిని కోల్పోనున్నారు. రాష్ట్రంలో అత్యధిక ఉపాధి ఫార్మా రంగంలో పొందుతున్నారు. ఈ రంగం కుదేలైతే ఉపాధి అవకాశాలు మరింత దిగజారనున్నాయి. ఫార్మారంగాన్ని కుదుపు కుదిపేసే నిర్ణయం ట్రంప్ తీసుకున్నప్పటికీ, ట్రంప్‌కు మంచి మిత్రునిగా చెప్పుకుంటున్న భారత ప్రధాని మోదీ సుంకాల తగ్గింపునకు తీసుకున్న చర్యలేమీ కన్పించడంలేదు. సానుభూతికైనా సుంకాలు తగ్గించాలని ప్రకటన చేయలేదు. మోదీ మిత్రత్వం దేశ ప్రయోజనాలకు దోహదపడేలా లేవు. ట్రంప్‌ను సంతృప్తిపర్చడానికి మోదీ మిత్రత్వం వుంది. ఆసియా, యూరప్‌లోని ఫార్మాస్యూటికల్స్ కంపెనీల్లో తమ షేర్లు భారీగా తగ్గాయి. భారత్‌లో ఫార్మాస్యూటికల్ సూచీ రెండు శాతం పడిపోయింది. సన్ ఫార్మాస్యూటికల్స్ ఇండస్ట్రీ మూడు శాతం పడిపోయింది. ఫార్మా డ్రగ్స్‌తో పాటు గృహ ఉపకరణాలుపైన ట్రంప్ టారిఫ్‌లు విధించారు. గత ఐదేళ్ల నుంచి విదేశీ ముడి పదార్థాలు దిగుమతి చేసుకున్న ఫార్మా రంగం అనేక ఒడిదుడుకులు ఎదుర్కొంటోంది. ఇలాంటి సమయంలో అమెరికా విధించిన టారిఫ్‌తో ఫార్మా రంగం మరింతగా నష్టాలు ఎదుర్కోనున్నది. టారిఫ్ దుష్ప్రభావం భారత ఫార్మారంగంపై పడకుండా మోదీ చొరవతీసుకొని అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో చర్చలు జరపాలి. టారిఫ్ నుంచి ఔషధ రంగాన్ని మినహాయించేలా ఒత్తిడి చేయాలి.

సామ్రాజ్యవాద ఆధిపత్యంతో ప్రపంచాన్ని శాసించాలనుకునే కుట్రలను తిప్పికొట్టకపోతే తృతీయ ప్రపంచదేశాలకు నష్టం జరగనుంది. చమురు, వనరులపై పెత్తనం కోసం దేశాల మధ్య యుద్ధాలను సమర్థించడం, వెనుకేసుకురావడానికి కూడా వెనుకాడని అమెరికా చర్యలను అడ్డుకోవాల్సిన అవసరముంది. రష్యా -ఉక్రెయిన్, ఇజ్రాయిల్ - ఇరాన్, ఇజ్రాయిల్- పలస్తీనాల మధ్య యుద్ధాలను నిలిపి వేస్తాయని ట్రంప్ చెప్పారు. వివిధ దేశాల సరుకులపై భారీ సుంకాలు విధిస్తూ ఆర్థిక అరాచకానికి పాల్పడుతున్నారు. తను ఆదేశించినట్లు నడుచుకోని దేశాలపై సుంకాల విధిస్తూ తన దారిలోకి తెచ్చుకోవాలని ట్రంప్ ప్రయత్నిస్తున్నాడు.

తన రాజకీయ లక్ష్యాలు సాధించే పనిలో అమెరికా నిమగ్నమైంది. సుంకాల భారంతో ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థల అభివృద్ధిపై నీలి నీడలు కమ్ముకున్నాయి. ఐక్యరాజ్యసమితిని కూడా ట్రంప్ లెక్కచేయడంలేదు. వాతావరణ కాలుష్యం తగ్గించే ఒప్పందాన్ని కూడా కాలదన్నాడు. మోదీ ప్రభుత్వం రోజురోజుకీ ట్రంప్‌కు లొంగుబాటు ప్రదర్శిస్తోంది. చైనా, మెక్సికో, కెనడా తదితర దేశాలన్నీ ట్రంప్ విధించిన సుంకాలపై ప్రతీకార సుంకాలు విధించి, అమెరికాను దారికి తెచ్చుకున్నాయి. భారత సరుకులపై ట్రంప్ ఆగస్టు 7 నుంచి వేసిన 25 శాతం ప్రతీకార సుంకాలకు అదనంగా రష్యా నుంచి ఆయిల్ దిగుమతి చేసుకున్నారని చెప్పి ఆగస్టు 27న ట్రంప్ మరో 25 శాతం టారిఫ్ వేసి మొత్తం 50 శాతానికి పెంచాడు. చైనా, యూరప్ దేశాలు కూడా రష్యా నుంచి ఆయిల్ దిగుమతి చేసుకున్నప్పటికీ, ట్రంప్ వాటిపై సుంకాలు వేసే ధైర్యం చేయలేదు. ట్రంప్ తమ వ్యవసాయ ఉత్పత్తులను కొనమని బ్లాక్‌మెయిల్ చేయడానికి ట్రంప్ భారత ప్రభుత్వంపై ఒత్తిడి చేస్తున్నాడు. రష్యా ఆయిల్ దిగుమతిని కూడా సాకుగా వాడుకుంటున్నాడు. తాజాగా భారతీయులపై హెచ్ వన్ బి వీసాను లక్ష డాలర్ల నుంచి కోటికి పెంచాడు. అయినా మోదీ ప్రభుత్వానికి చీమకుట్టినట్లు లేదు. ట్రంప్ నాటకీయ పొగడ్తలకు మోదీ ఉబ్బితబ్బి అవుతున్నాడు. తన లొంగుబాటు కనపడకుండా ఉండడానికి స్వదేశీ సరుకులు వాడమని నినాదం ఇస్తున్నాడు. ఇప్పుడు అమెరికాతో జరుగుతున్న వాణిజ్య చర్చల్లో వ్యవసాయం, డెయిరీ, జన్యుపర మార్పులతో కూడిన ఆహారాలకు సంబంధించి అమెరికా సరుకులను దిగుమతి చేసుకోవడానికి, అమెరికా ఆయిల్‌ను, వాయిదాలుగా కొనుగోలు చేసేందుకు మోదీ ప్రభుత్వం అంగీకరించే అవకాశం ఉన్నది. ఇది దేశానికి నష్టం. ఈ లొంగుబాటుకు వ్యతిరేకంగా భారత ప్రజలు, కార్మికవర్గం ఐక్యంగా ఉద్యమించాలి. దేశ ఆర్థిక వ్యవస్థను, భవిష్యత్‌ను కాపాడుకోవాలి. భారతదేశ ఫార్మా రంగాన్ని పరిరక్షించుకోవాలి. లక్షలాది మంది ఉపాధి కోల్పోకుండా భారత కార్మిక వర్గం అప్రమత్తంగా వ్యవహరించి నిలబెట్టుకోవాలి.

సెల్ 9247335058

బీజేపీ 'అమీబా' లాంటిది ఉద్ధవ్ ఠాక్రే

ముంబై: బీజేపీ 'అమీబా' లాంటిదని శివసేన (యూబీటీ) అధినేత ఉద్ధవ్ ఠాక్రే విమర్శించారు. ముంబైలోని శివాజీ పార్క్‌లో జరిగిన దసరా ర్యాలీలో ఆయన మాట్లాడుతూ 'బీజేపీ తనకు నచ్చిన విధంగా వ్యాపిస్తుంది. తనకు నచ్చని విధంగా పొత్తులు ఏర్పరుచుకుంటుంది. పని పూర్తయిన తర్వాత, మరోదానికి మారుతుంది. ఇది శరీరంలోకి ప్రవేశిస్తే కడుపు నొప్పి కలిగిస్తుంది. సమాజంలోకి ప్రవేశించినప్పుడు శాంతికి భంగం కలిగిస్తుంది' అని అన్నారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్, ఏక్‌నాథ్ షిండే వర్గాన్ని నకిలీ హిందుత్వ అని, అవకాశవాదం అని ఉద్ధవ్ ఆరోపించారు. 'ఒక గాడిద పులి చర్మాన్ని ధరించింది'అని ప్రత్యర్థులపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. నిజమైన హిందుత్వ వారసత్వం తనతో ఉందని అన్నారు. హిందుత్వ పరిధిపై ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ చేసిన వ్యాఖ్యల్ని ఠాక్రే తప్పుపట్టారు. ఆర్ఎస్ఎస్ దశాబ్దాలుగా 'విభజన విష ఫలాలను' ఇచ్చిందా అని ప్రశ్నించారు. ప్రధాని మోదీ, పాక్ ప్రధాని నవాజ్ షరీఫ్ ఇంటికి వెళ్లడాన్ని, పాకిస్థాన్‌తో క్రికెట్ ఆడటాన్ని, బిల్కిస్ బానో కేసులో దోషులకు బీజేపీ మద్దతు ఇవ్వడాన్ని ప్రస్తావిస్తూ... హిందూ విలువలపై ఇతరులకు ఉపన్యాసాలు ఇవ్వద్దని థాకరే చెప్పారు. సోనమ్ వాంగ్‌చుక్ అరెస్ట్‌పై స్పందిస్తూ... న్యాయం కోసం పోరాడటం దేశద్రోహంగా ఉందని అన్నారు. ముంబై కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధిస్తే, ముంబైని అదానీకి అప్పగిస్తుందని ఆయన హెచ్చరించారు.

వందే భారత్ ఎక్స్‌ప్రెస్ ఢీకొని నలుగురి దుర్మరణం

పట్నా: బీహార్‌లోని పూర్ణియాలో విషాద ఘటన చోటుచేసుకుంది. వందే భారత్ ఎక్స్‌ప్రెస్ ఢీకొని నలుగురు మృతిచెందగా... పలువురు గాయపడ్డారు. జోగ్బాని నుంచి పాటలీపుత్రకు రైలు వెళ్తుండగా శుక్రవారం తెల్లవారుజామున 5 గంటల ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. క్షతగాత్రులను జీఎంసీకి తరలించగా... మృతదేహాలను రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకుని విచారణ చేపట్టారు. పట్టాలు దాటుతున్న యువకులను హైస్పీడు రైలు ఢీకొట్టినట్టు స్థానికులు తెలిపారు. రైల్వే క్రాసింగ్ ఉద్యోగుల నిర్లక్ష్యం వల్ల ఈ ప్రమాదం జరిగిందా?, రైలు వేగంగా వస్తున్న విషయం తెలిసినా పట్టాలు దాటేందుకు యువకులు ప్రయత్నించడం వల్ల ప్రమాదం చోటుచేసుకుందా? అనేది ఇంకా తెలియాల్సి ఉంది. దుర్గా మేళాలో సాంస్కృతిక కార్యక్రమాలు చూసేందుకు వెళ్లిన యువకులు తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగినట్టు చెబుతున్నారు. వేగంగా వస్తున్న రైలు ఢీకొనడంతో ముగ్గురు యువకులు అక్కడికక్కడే మరణించగా... మరో వ్యక్తి ఆసుపత్రిలో చికిత్సపొందుతూ కన్నుమూశాడు. గాయపడిన మరో వ్యక్తి పరిస్థితి ప్రమాదకరంగా ఉంది. ఈ ప్రమాదంలో మృతిచెందిన వారంతా 18 నుంచి 24 ఏళ్ల వయస్సు వారే.

చిరిగిన రికార్డులు... నిర్దోషులుగా ఐదుగురు

థానె: ఓ కేసుకు సంబంధించిన రికార్డులు చిరిగిపోవడంతో ఐదుగురు నిందితులను ఓ సెషన్స్ కోర్టు నిర్దోషులుగా తేల్చింది. 32 ఏళ్ల క్రితం జరిగిన హత్య కేసులో పత్రాలు కనిపించకపోవడంతో పాటు సరైన సాక్ష్యాలు సమర్పించడంలో ప్రాసిక్యూషన్ విఫలమైందని మహారాష్ట్రలోని థానే కోర్టు పేర్కొంది. 1992లో సామ్రాట్ అశోక్‌నగర్‌లో లక్కీ ప్రేమ్‌చంద్ భాటియా అనే వ్యక్తి హత్యకు గురయ్యాడు. దీనికి సంబంధించి ఐదుగురిని నాడు పోలీసులు అరెస్టు చేశారు. అయితే, ఈ కేసు విచారణలో తీవ్ర జాప్యం జరిగింది. దీంతో నిందితులకు బెయిల్ మంజూరైంది. ఆ తర్వాత వారి ఆచూకీ తెలియకపోవడంతో కోర్టు నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. తాజాగా కల్యాణ్‌లోని అదనపు సెషన్స్‌జడ్జి పీఎఫ్ సయ్యద్ ఈ కేసును విచారించారు. కేసుకు సంబంధించి ఛార్జిషీట్, సాక్షుల వాంగ్మూలాలు సహా కీలకపత్రాలు చిరిగిపోయాయని న్యాయమూర్తి పేర్కొన్నారు. పోస్టుమార్టం నివేదిక కూడా అందుబాటులో లేని విషయాన్ని ప్రస్తావించారు. దీంతో ఐదుగురు నిందితులను నిర్దోషులుగా ప్రకటిస్తూ తీర్పునిచ్చారు.

స్టాలిన్, త్రిష నివాసాలకు బాంబు బెదిరింపులు

చెన్నై: తమిళనాడులో మరోసారి బాంబు బెదిరింపులు కలకలం సృష్టించాయి. సినీ, రాజకీయ ప్రముఖుల ఇళ్లతో పాటు పలు ప్రదేశాలకు బాంబు బెదిరింపులు వచ్చాయి. దీంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, సినీ నటి త్రిష నివాసాలతో పాటు బీజేపీ ప్రధాన కార్యాలయానికి, డీజీపీ ఆఫీసుకు, రాజ్‌భవన్‌కు కూడా బాంబు బెదిరింపులు వచ్చాయి. దీంతో భద్రతా బలగాలు అప్రమత్తమయ్యాయి. ఆయా ప్రాంతాల్లో బాంబు స్క్వాడ్ బృందాలు, డాగ్ స్క్వాడ్‌ల సహాయంతో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించాయి. అయితే, ఎలాంటి అనుమానిత వస్తువులు లభించలేదు. తాజా బెదిరింపుల నేపథ్యంలో చెన్నైలో భద్రతను కట్టుదిట్టం చేశారు. బెదిరింపులకు పాల్పడిన వారిని గుర్తించేందుకు అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. గత ఆరు రోజుల్లో ఇలాంటి బెదిరింపులు రావడం ఇది మూడోసారి.

మట్టి అగ్నిపర్వతం బద్దలు

పోర్ట్ బ్లెయిర్: సుమారు 20 ఏళ్లకుపైగా నిద్రాణంగా ఉన్న భారత్‌లోని ఏకైక మట్టి అగ్నిపర్వతం మళ్లీ బద్దలైంది. పెద్ద శబ్దంతో భూమి లోపల నుంచి బురద, వాయువులను పైకి ఎగజిమ్మింది. దీంతో అధికారులు అప్రమత్తమయ్యారు. అండమాన్, నికోబార్ దీవులలో ఈ సంఘటన జరిగింది. ఈ నెల రెండో తేదీ మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో బరాటాంగ్‌లోని జార్వా క్రీక్‌లో పెద్ద శబ్దంతో మట్టి అగ్నిపర్వతం బద్దలైంది. పేలుడు వల్ల సుమారు మూడు నుంచి నాలుగు మీటర్ల ఎత్తులో మట్టి దిబ్బ ఏర్పడినట్లు అధికారులు తెలిపారు. వెయ్యి చదరపు మీటర్లకు పైగా బురద వ్యాపించినట్లు చెప్పారు. విస్ఫోటనం ఇంకా కొనసాగుతున్నదని, బురదతో పాటు పొగలు బయటకు వస్తున్నాయని వెల్లడించారు. ఈ మట్టి అగ్నిపర్వతం గతంలో 2005లో బద్దలైందని వివరించారు. మట్టి అగ్నిపర్వతం ఉన్న ప్రాంతం వైపు రాకపోకలను పోలీసులు నిలిపివేశారు.

'సుదర్శన చక్ర' సిద్ధం చేస్తున్నాం

వాయుసేనాధిపతి ఏపీ సింగ్

న్యూఢిల్లీ: ఆపరేషన్ సిందూర్ సమయంలో ఐఏఎఫ్ సత్తా ఎలాంటిదో ప్రపంచం చూసిందని వాయుసేన అధిపతి ఏపీ సింగ్ తెలిపారు. భవిష్యత్తు సవాళ్లను అధిగమించేందుకు రక్షణరంగంలో స్వావలంబన కోసం 'సుదర్శన చక్ర' తయారుచేస్తున్నట్లు తెలిపారు. ఈ కవచంతో కీలకమైన వ్యవస్థలకు రక్షణ కల్పిస్తామని, దేశాన్ని శత్రు దుర్భేద్యంగా తయారు చేస్తామని స్పష్టంచేశారు. దీనికోసం ఇప్పటికే త్రివిధ దళాలు పని ప్రారంభించాయన్నారు. 2035 నాటికల్లా ఈ కొత్త భద్రతా వ్యవస్థ పనిచేయడం ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ప్రధాని సూచించారన్నారు. ఇతర దేశాలతో ఘర్షణలు తలెత్తిన సమయాల్లో వాటిని ఎదుర్కోవాలి, పరిష్కరించుకోవాలనే విషయాలకు భారత్ ఆదర్శంగా ఉందన్నారు. స్పష్టమైన లక్ష్యంతో భారత్ ఆపరేషన్ సిందూర్ ప్రారంభించిందని, అది నెరవేరగానే ఘర్షణను నిలిపివేసిందని ఏపీ సింగ్ అన్నారు. ప్రపంచ దేశాలు ఈ విషయాన్ని భారత్ నుంచి నేర్చుకోవాలని సూచించారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో త్రివిధ దళాల సమన్వయంతో పాక్‌కు చెందిన పది ఫైటర్ జెట్ విమానాలను ధ్వంసం చేశామన్నారు. వాటిలో ఎఫ్-16, జేఎఫ్ -17 యుద్ధ విమానాలు కూడా ఉన్నట్లు తెలిపారు. శత్రువుల స్థావరాలను గురిచూసి కొట్టడంతో పాక్‌లోని ఉగ్రస్థావరాలతో పాటు రాడార్ వ్యవస్థలు, కమాండ్ కంట్రోల్ సెంటర్లు, రన్‌వేలు, హ్యాంగర్లు, యుద్ధ విమానాలు ధ్వంసమయ్యాయని ఏపీ సింగ్ అన్నారు. ఆ దేశంలోని దాదాపు 300 కిమీ లక్ష్యాలను ఛేదించి భారత సైన్యం పాక్‌ను మోకాళ్లపై కూర్చోబెట్టిందన్నారు. ఆపరేషన్ సమయంలో కేంద్రం సైన్యానికి పూర్తి స్వేచ్ఛనివ్వడంతో మన సైన్యం శత్రుదేశానికి చుక్కలు చూపించిందని తెలిపారు. దీంతో కాల్పుల విరమణపై పాక్ కాళ్ల బేరానికి వచ్చిందన్నారు. ఈ విషయంలో మరెవరి జోక్యం లేదని, ఇస్లామాబాద్ కోరడంతోనే తాము కాల్పుల విరమణకు అంగీకరించామని తెలిపారు. భవిష్యత్తులో పాకిస్థాన్ మళ్లీ దుస్సాహసానికి ఒడిగడితే భారత సైన్యం చేతిలో చావుదెబ్బ తప్పదని హెచ్చరించారు.

తొక్కిసలాటపై సిట్ విచారణ

మద్రాస్ హైకోర్టు ఆదేశం

చెన్నై: తమిళనాడులోని కరూర్‌లో ఇటీవల జరిగిన తొక్కిసలాట ఘటనపై మద్రాస్ హైకోర్టు సిట్ విచారణకు ఆదేశించింది. ఐజీ అస్రాగార్గ్ నేతృత్వంలో సిట్ దర్యాప్తునకు ఆదేశాలు ఇచ్చింది. ఈ తొక్కిసలాట ఘటన కేసు ఎఫ్ఐఆర్‌లో టీవీకే పార్టీ అధ్యక్షుడు విజయ్ పేరు ఎందుకు చేర్చలేదనే రిట్ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం ఈ ఆదేశాలు జారీ చేసింది.

ఘటన జరిగిన తర్వాత టీవీకే నేతలందరూ అక్కడి నుంచి వెళ్లిపోవడాన్ని మద్రాస్ హైకోర్టు తప్పుపట్టింది. ప్రమాదాన్ని పట్టించుకోకుండా పార్టీ నేతలందరూ అక్కడి నుంచి వెళ్లిపోవడం వాళ్ల ఆలోచనా ధోరణిని తెలియజేస్తోందని వ్యాఖ్యానించింది. టీవీకే నాయకులు బుస్సీ ఆనంద్, సీటీఆర్ నిర్మల్ కుమార్ దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్లపై ఆదేశాలను రిజర్వ్ చేసినట్లు జస్టిస్ సెంథిల్ కుమార్ తెలిపారు. ఈ ఘటనపై శుక్రవారం ఉదయం కూడా విచారణ జరిపిన మద్రాస్ హైకోర్టు సీబీఐ దర్యాప్తు కోరుతూ విజయ్ పార్టీ వేసిన పిటిషన్‌ను తోసిపుచ్చింది. విజయ్ వేసిన పిటిషన్‌పై ఆగ్రహం వ్యక్తం చేసింది. కరూర్ ఘటనపై పోలీసుల దర్యాప్తు ఇంకా ప్రారంభదశలోనే ఉన్న విషయాన్ని గుర్తుచేసింది. ఈ క్రమంలోనే సీబీఐ దర్యాప్తు కోరడం సరికాదని పేర్కొంది. కోర్టులను రాజకీయ వేదికలుగా మార్చవద్దని వ్యాఖ్యానించింది. సీబీఐ దర్యాప్తు కోరుతూ బీజేపీ న్యాయవాది జీఎస్ మణి దాఖలు చేసిన పిటిషన్‌ను కూడా కొట్టివేసింది. విచారణ సందర్భంగా రాజకీయ పార్టీలకు కోర్టు కీలక సూచనలు చేసింది. భవిష్యత్తులో నిర్వహించే బహిరంగ సభలు, సమావేశాల్లో తాగునీరు, పారిశుద్ధ్య సౌకర్యాలు, అంబులెన్స్ సేవలు, నిష్క్రమణ మార్గాలు వంటి ప్రాథమిక సౌకర్యాలు కల్పించాలని పేర్కొంది.

పాక్‌దే బాధ్యత: జైస్వాల్

న్యూఢిల్లీ: పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే)లో మానవ హక్కుల ఉల్లంఘనలకు పాకిస్థాన్ బాధ్యత వహించాల్సిందేనని భారత్ పేర్కొంది. అక్కడ పరిస్థితులు దారుణంగా ఉన్నాయని తెలిపింది. ప్రాథమిక హక్కులు, న్యాయం కోసం ప్రజలు పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తున్నారని, సంస్థాగత అణచివేత అంతాన్ని కోరుతున్నారని విదేశీ వ్యవహారాల శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ శుక్రవారం తెలిపారు. పాకిస్థాన్ ఆక్రమిత జమ్మూకశ్మీర్‌లోని అనేక ప్రాంతాల్లో అమాయక పౌరులపై పాకిస్థానీ దళాల దురాగతాలకు వ్యతిరేకంగా ఆందోళనలు జరిగిన నివేదికలు అనేకం ఉన్నాయన్నారు. పాకిస్థాన్ అణచివేత ధోరణి, సంస్థాగతంగా వనరుల దోపిడీకి ఇవి సహజమైన పర్యవసానాలని జైశ్వాల్ అన్నారు. ఘోరమైన మానవ హక్కుల ఉల్లంఘనలకు పాకిస్థాన్ జవాబుదారీ తీసుకోవాల్సిందేనని నొక్కిచెప్పారు.

నా భర్త ఎక్కడ?

సుప్రీంలో వాంగ్‌చుక్ భార్య పిటిషన్

న్యూఢిల్లీ: వాతావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ భార్య గీతాంజలి ఆంగ్మో తన భర్త అరెస్టును, అతనిపై కఠినమైన జాతీయ భద్రతా చట్టం (ఎన్ఎస్ఏ) ప్రయోగాన్ని సవాలు చేస్తూ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. వాంగ్‌చుక్‌ను వెంటనే విడుదల చేయాలని, నిర్బంధం చట్టబద్ధతను ఆ పిటిషన్‌లో ప్రశ్నించారు. ఇది ఆమె భర్తపై చర్య ఏకపక్షంగా, చట్టపరమైన రక్షణలను స్పష్టంగా ఉల్లంఘించింది. 'నా భర్తను నిర్బంధించిన ఉత్తర్వు ప్రతి మాకు అందలేదు. ఇది నిబంధనలకు విరుద్ధం. సమర్థవంతమైన చట్టపరమైన పరిష్కారాలను కోరే హక్కును కోల్పోతోంది' అని ఆంగ్మో తన పిటిషన్‌లో పేర్కొన్నారు. వాంగ్‌చుక్‌ను అరెస్టు చేసినప్పటి నుంచి ఆయన గురించి ఎటువంటి సమాచారం లేదని ఆరోపించారు. 'నా భర్తతో నాకు ఎలాంటి సంబంధం లేదు. ఇది మొత్తం ప్రక్రియను మరింత అస్పష్టంగా చేస్తుంది. అతని కస్టడీ చట్టబద్ధత గురించి తీవ్రమైన ఆందోళనలను లేవనెత్తుతోంది' అని ఆంగ్మో అన్నారు. వాంగ్‌చుక్ నిర్బంధానికి గల కారణాలను తమ కుటుంబానికి తెలియజేయలేదని పేర్కొన్నారు. వాంగ్‌చుక్ అరెస్టు రాజకీయ ప్రేరేపితమని ఆమె పిటిషన్‌లో వాదించారు. వాంగ్‌చుక్ గత కొన్ని నెలలుగా కేంద్ర పాలిత ప్రాంతమైన లద్దాఖ్‌కు రాష్ట్ర హోదా, హిమాలయ పర్యావరణాన్ని, స్వదేశీ ప్రజల హక్కులను కాపాడటానికి ఆరవ షెడ్యూల్ కింద రాజ్యాంగ రక్షణలను కోరుతూ జరిగిన నిరసన ప్రదర్శనలకు నాయకత్వం వహించారు. ఈ వారం ప్రారంభంలో ఆయనను ఎన్ఎస్ఏ క్రింద ఆకస్మికంగా అరెస్టు చేశారు. కాగా ఈ చర్యను లద్దాఖ్‌లోనే కాకుండా దేశ వ్యాప్తంగా పౌర సమాజ సమూహాలు, విద్యావేత్తలు, కార్యకర్తలు విమర్శించారు. ఎన్ఎస్ఏను కార్యకర్తలు, అసమ్మతివాదులకు వ్యతిరేకంగా తరచూ ఉపయోగించడం రాజ్యాంగ స్వేచ్ఛలను దెబ్బతీస్తుందని విమర్శకులు వాదిస్తున్నారు. సుప్రీం కోర్టు వచ్చే వారం ఆంగ్మో పిటిషన్‌ను విచారణకు స్వీకరించనుందని భావిస్తున్నారు.

ఎన్నికల వేళ మహిళలకు నితీశ్ డబ్బు పంపిణీ

పట్నా: బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ శుక్రవారం 'ముఖ్యమంత్రి మహిళా రోజ్‌గార్ యోజన' కింద 25 లక్షల మంది లబ్ధిదారులకు రూ.2,500 కోట్లు పంపిణీ చేశారు. దీంతో స్వయం ఉపాధి పథకం కింద రూ.10 వేల చొప్పున పొందిన మహిళల సంఖ్య కోటికి పెరిగింది. సీఎం అధికారిక నివాసంలో జరిగిన కార్యక్రమంలో ఈ మొత్తాన్ని పంపిణీ చేశారు. సెప్టెంబరు 26న వర్చువల్‌గా ఇలాంటి కార్యక్రమంలో పాల్గొన్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నుంచి 75 లక్షల మంది మహిళలు డబ్బును అందుకున్నారని నితీశ్ గుర్తు చేసుకున్నారు. 'ఈ పథకం కింద రాష్ట్రంలోని ప్రతి కుటుంబం నుంచి ఒక మహిళను చేర్చాలని మేము భావిస్తున్నాము. అక్టోబరు 6న మరింత మంది లబ్ధిదారుల ఖాతాల్లో రూ.10 వేలు జమ అవుతాయి' అని చెప్పారు. 'ఆ తర్వాత ఏ మహిళనూ ఈ పథకం నుంచి వదిలిపెట్టకుండా వారానికి ఒకసారి డబ్బు పంపిణీ కొనసాగుతుంది. తమ వ్యాపారం విజయవంతం అయినట్లు నివేదించిన మహిళలు రూ.2 లక్షల వరకు అదనపు ప్రయోజనాలను పొందుతారు' అని చెప్పారు. 'మేము పంచాయతీలు, స్థానిక సంస్థల్లో మహిళలకు 50 శాతం కోటాలు ఇచ్చాము. పోలీసు, ఇతర ప్రభుత్వ విభాగాలలో వారికి 35 శాతం సీట్లను రిజర్వ్ చేశాము' అని ఆయన తెలిపారు.

ఆధార్ అప్‌డేట్‌కు సర్వీస్ చార్జిల పెంపు

న్యూఢిల్లీ: ఆధార్ అప్ డేట్ సర్వీసు ఛార్జీలను ఉడాయ్ తాజాగా సవరించింది. పెరిగిన ఛార్జీలు ఈ నెల ఒకటో తేదీ నుంచి అమల్లోకి వచ్చాయి. ఇవి సెప్టెంబరు 30, 2028 వరకు చెల్లుబాటు అవుతాయి. సర్వీసును బట్టి ఛార్జెస్‌లో మార్పులు ఉంటాయి. పేరు, చిరునామా, పుట్టిన తేదీ, మొబైల్ నంబర్ లేదా ఈ-మెయిల్ వివరాల అప్‌డేట్‌కు రూ. 75 ఖర్చవుతుంది. గతంలో ఇది రూ. 50 ఉండేది. ఫింగర్ ప్రింట్, ఐరిస్, ఫొటో అప్ డేట్‌కు ఇకపై రూ.125 చెల్లించాల్సి ఉంటుంది. ఇప్పటి వరకూ ఇది రూ.100 ఉండేది. ఇది 2028 అక్టోబరు ఒకటి తర్వాత రూ.150కి పెరగనుంది. మై ఆధార్ పోర్టల్ ద్వారా డాక్యుమెంట్ అప్‌డేట్ జూన్ 14, 2026 వరకు ఉచితంగా చేసుకోవచ్చు. అదే నమోదు కేంద్రాల్లో అయితే రూ.75 ఖర్చవుతుంది. ఆధార్ ప్రింటవుట్ పొందడానికి రూ. 40 ఖర్చవుతుంది. ఐదు నుంచి ఏడేళ్ల పిల్లలకు బయోమెట్రిక్ అప్‌డేట్‌ను ఉచితంగా చేసుకోవచ్చు. ఆ పైన 15 నుంచి 17 ఏళ్ల పిల్లలకు ఒకసారి ఉచితం. ఏడు నుంచి 15 సంవత్సరాల వయస్సు పిల్లలకు సాధారణంగా రూ. 125 వసూలు చేస్తారు... కానీ, ఈ ఛార్జీని సెప్టెంబరు 30, 2026 వరకు మాఫీ చేశారు. ఆధార్ సెంటర్లకు వెళ్లలేని వారు ఇంటి వద్దే ఆ సేవలు పొందొచ్చు. అయితే, హోమ్ సర్వీస్‌కు రూ. 700 చెల్లించాల్సి ఉంటుంది. డెమోగ్రాఫిక్, బయోమెట్రిక్ అప్‌డేట్స్‌కు వేర్వేరుగా ఛార్జీలు ఉంటాయి.

ముంచుకొస్తున్న 'శక్తి'

అరేబియా తీరంలో తుపాను ముప్పు

న్యూఢిల్లీ: దేశ పశ్చిమ తీరంలో 'సైక్లోన్ శక్తి' ముంచుకొస్తోంది. ఈ ఏడాది అరేబియా సముద్రంలో తొలి తుపాను ఏర్పడనుందని భారత వాతావరణశాఖ శుక్రవారం వెల్లడించింది. ద్వారకకు నైరుతి దిశగా 240 కి.మీ, పోర్‌బందర్‌కు పశ్చిమం వైపు 270 కి.మీ దూరంలో అరేబియా సముద్రంలో ఈ అల్పపీడనం ఏర్పడింది. అది వాయుగుండంగా బలపడి గంటకు 12కి.మీ. వేగంతో పశ్చిమ-వాయవ్య దిశగా కదులుతోంది. రానున్న 24 గంటల్లో ఇది తీవ్ర తుపానుగా మారవచ్చని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఈ తుపానుకు 'శక్తి' అని పేరు పెట్టారు. ప్రపంచ వాతావరణ సంస్థ ఆదేశాల ప్రకారం హిందూ మహాసముద్రం తీరప్రాంతంగా కలిగిన 13 దేశాలు తుపాను పేర్లను నిర్ణయిస్తాయి. భారత్, బంగ్లాదేశ్, ఇరాన్, మాల్దీవులు, మైన్మార్, ఒమన్, పాకిస్థాన్, ఖతార్, సౌదీ అరేబియా, శ్రీలంక, థాయిలాండ్, యూఏఈ, యెమెన్‌కు తుపానులకు నామకరణ చేసే అవకాశం ఉంది. కొన్ని తుపానుల ప్రభావం వారం కన్నా ఎక్కువ రోజులు ఉంటుంది. అదే సమయంలో మరో తుపాను వస్తే ఎలా అని ఆలోచించి... వాటికి పేర్లు పెట్టడం ప్రారంభించారు. ఈ సారి శక్తిపేరును శ్రీలంక పెట్టింది. ఒక్కో తుపానుకు ఒక్కో పేరు పెడితే డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌కు, మీడియాకు, సాధారణ ప్రజలకు ఇది ఫలానా తుపాను అని గుర్తుండిపోతుంది. అంతేకాకుండా ఆ పేరుతో ప్రజలను అప్రమత్తం చేసే అవకాశం ఉంటుంది. ఈ పేర్లు వీలయినంత చిన్నగా... సులభంగా పలికే విధంగా ఉండాలనే నిబంధన ఉంది.

పెరిగిన భారత ఇంధన ఎగుమతులు

న్యూఢిల్లీ: రష్యా రిఫైనరీలపై దాడులు తీవ్రం కావడంతో ప్రపంచ ఇంధన మార్కెట్‌లో తీవ్ర ఇబ్బందులు మొదలయ్యాయి. దీంతో ఆ కొరతను భర్తీ చేయడానికి భారత్ తన ఇంధన ఉత్పత్తుల ఎగుమతులను వేగవంతం చేసింది. ప్రైవేటు రంగంలోని రిలయన్స్ ఇండస్ట్రీస్, నయారా ఎనర్జీ సంస్థలు బ్రెజిల్, టర్కీ యూఏఈ, పలు ఆఫ్రికా దేశాలకు భారీగా ఎగుమతి చేస్తున్నాయి. ఆయా దేశాలు రష్యాలో శుద్ధి చేసిన ఇంధనంపై ఇన్నాళ్లూ ఆధారపడ్డాయని ఎకనామిక్ టైమ్స్ కథనంలో పేర్కొంది. చమురు శుద్ధి సామర్థ్యం దెబ్బతినడంతో రష్యా దేశీయ అవసరాలపైనే ఎక్కువ దృష్టి సారించింది. శీతాకాలం సమీపిస్తుండటంతో రష్యాలో చమురు అవసరాలు భారీగా పెరగనున్నాయి. దీంతో సెప్టెంబర్‌లో రోజుకు రెండు లక్షల బ్యారెళ్ల ఇంధన ఎగుమతులను తగ్గించిందని క్లెప్లర్ నివేదికలో వెల్లడించింది. రిఫైనరీలు దెబ్బతినడం, పెట్రోల్, డీజిల్ ఎగుమతులపై నిషేధం వంటివి ప్రభావం చూపాయని ఆ సంస్థ నిపుణులు వెల్లడించారు. భారత్ నుంచి బ్రెజిల్‌కు శుద్ధి చేసిన ఇంధన ఎగుమతులు పెరిగి రోజుకు 97 వేల బ్యారెళ్లకు చేరాయి. ఆగస్టులో ఇవి కేవలం 40 వేల బ్యారెళ్లు మాత్రమే ఉన్నాయి. మన దేశం నుంచి టర్కీ కూడా ఎగుమతులు అంతకుముందు నెలతో పోలిస్తే 20 బ్యారెళ్ల నుంచి 56 వేల బ్యారెళ్లకు చేరాయి. గతేడాది మన దేశం నుంచి టర్కీకి చమురు ఎగుమతి చేయలేదు. పై రెండు దేశాలకు అధికంగా రిలయన్స్ ఇండస్ట్రీస్ నుంచి ఎగుమతులు అవుతున్నాయి. యూఏఈకి భారత్ నుంచి శుద్ధి చేసిన ఇంధన ఎగుమతి పెరిగింది. ఆగస్టులో 1.4 లక్షల బ్యారెళ్లు కొనుగోలు చేయగా... సెప్టెంబర్‌లో 2.01 లక్షల బ్యారెళ్లకు చేరడం గమనార్హం. మొత్తంగా భారత్ నుంచి శుద్ధి చేసిన ఇంధన ఎగుమతులు గత నెల ఏకంగా 14 శాతం పెరిగి రోజుకు 1.59 మిలియన్ పీపాలుగా నమోదయ్యాయి.

గంజాయి స్మగ్లర్ ఎన్ఎస్‌జీ మాజీ కమాండర్

జైపూర్: నేషనల్ సెక్యూర్టీ గార్డు (ఎన్ఎస్‌జీ)లో కమాండోగా పనిచేసిన బజరంగ్ సింగ్ ఇప్పుడు డ్రగ్ స్మగ్లింగ్ రాకెట్ నిర్వహిస్తున్నాడు. ముంబైలో 2008, సెప్టెంబరు 26న జరిగిన దాడుల సమయంలో అతడు ఎన్ఎస్‌జీ కమాండో పాత్ర పోషించాడు. ప్రస్తుతం రాజస్థానీ పోలీసులకు డ్రగ్ రాకెట్ సూత్రధారిగా దొరికిపోయాడు. అతడిని చురులో రాజస్థానీ పోలీసులు పట్టుకున్నారు. తెలంగాణ, ఒడిశా రాష్ట్రాల నుంచి ఆ కమాండో గంజాయి స్మగ్లింగ్ చేసి రాజస్థాన్‌కు చేరవేస్తున్నట్లు గుర్తించామని ఐజీ వికాశ్ కుమార్ తెలిపారు. మాజీ కమాండో నుంచి సుమారు 200 కిలోల డ్రగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. అతడి స్వస్థలం సికర్ జిల్లా. ఆపరేషన్ గాంజానే పేరుతో పోలీసులు అతడిపై చాలాకాలంగా నిఘా పెట్టారు. అతడిని పట్టుకునేందుకు పోలీసులకు రెండు నెలలు పట్టింది. యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్, యాంటీ నార్కోటిక్స్ టాస్క్ ఫోర్స్ ఈ ఆపరేషన్ నిర్వహించాయి. బీఎస్ఎఫ్ కానిస్టేబుల్‌గా అతడు పంజాబ్, అస్సాం, రాజస్థాన్, ఒడిశా, బెంగాల్‌లో పనిచేశాడు. చొరబాటుదారులు, మావోయిస్టులకు వ్యతిరేకంగా పోరాటం చేశాడు. సెక్యూరిటీ అధికారుల దృష్టిలో పడి ఎన్ఎస్‌జీకి ఎంపికయ్యాడు. ఏడేళ్ల పాటు అతడు ఎన్ఎస్‌జీ కమాండోగా చేశాడు. ఎన్ఎస్‌జీలో ఉన్న సమయంలోనే.. 2008 ముంబై దాడుల ఘటన జరిగింది. ఆ ఆపరేషన్‌లో బజరంగ్ పాల్గొన్నాడు. గంజాయి వ్యాపారంతో డబ్బు సంపాదించవచ్చు అన్న ఆశ తో ఒడిశా, తెలంగాణలో గాంజాయి స్మగ్లర్లతో సంబంధాలు పెట్టుకున్నాడు. అతడిపై చాలా కేసులు నమోదు అయ్యాయి. 2023లో హైదరాబాద్ లో గంజాయి స్మగ్లింగ్ చేస్తూ దొరికిపోయాడు. గంజాయి స్మగ్లింగ్ నిర్వహిస్తోంది సింగ్ అని రాజస్థానీ పోలీసులు ఆలస్యంగా తెలుసుకున్నారు. వంట మనిషి ఇచ్చిన సమాచారం ఆధారంగా మాజీ కమాండో బజరంగ్ సింగ్‌ను అరెస్టు చేశారు.

పాక్ టార్గెట్ రాణ్ ఆఫ్ కచ్!

న్యూఢిల్లీ: పాకిస్థాన్ సర్ క్రీక్ వద్ద దుస్సాహసాలకు పాల్పడితే కరాచీ ప్రాంతం దద్దరిల్లుతుందని దసరా నాడు రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ హెచ్చరించడం సంచలనం సృష్టించింది. గత చరిత్రను పరిశీలిస్తే పాక్ ఇక్కడ దుస్సాహసాలకు పాల్పడిన చరిత్ర ఉంది. ఇదొక్కటే కాదు... గుజరాత్‌లోని జూనాగఢ్‌పై కూడా పాక్ కన్నేసింది. పాకిస్తాన్‌కు 1965 నాటికి అమెరికా కూటమి సెంటో ఆశీస్సులతో అత్యాధునిక ఎఫ్-86ఎఫ్ సేబర్ జెట్లు, ఎం47, ఎం48 పట్టొన్ ట్యాంక్‌లు సహా పలు ఆయుధాలను సమకూర్చుకుంది. మరోవైపు భారత్ తీవ్రమైన కరువు, 1962లో చైనాతో యుద్ధంలో ఎదురుదెబ్బలతో ఇబ్బందిపడుతోంది. దీంతో తన అత్యాధునిక ఆయుధాలు వాడి భారత్ భూభాగాలను ఆక్రమించాలనే దుర్బుద్ధి పుట్టింది. తొలుత భారత్ శక్తిని అంచనా వేయడానికి ఓ పరీక్షలాగా 1965 ఏప్రిల్‌లో ఆపరేషన్ డిజర్ట్ హాక్ పేరిట రాణ్ ఆఫ్ కచ్‌లోకి పాక్ దళాలు దూసుకొచ్చాయి. భారత్ సైన్యం భీకరంగా ఎదురుదాడి చేసింది. చివరికి బ్రిటన్ మధ్యవర్తిత్వంతో యథాతథస్థితిని నెలకొల్పారు. ఆ తర్వాత కొన్ని నెలలకే ఆపరేషన్ జిబ్రాల్టర్ పేరిట కశ్మీర్‌ను ఆక్రమించుకొనేందుకు దాడి చేసి ఘోరంగా పరాజయం పాలైంది. కానీ, ఈ యుద్ధంలో రాణ్ ఆఫ్ కచ్ వద్ద గుజరాత్ ముఖ్యమంత్రి బల్వంత్‌రాయ్ మెహతా ప్రయాణిస్తున్న బీచ్‌క్రాఫ్ట్ విమానాన్ని పాక్ జెట్‌లు కూల్చేశాయి. సర్‌క్రీక్‌పై పాకిస్థాన్ ఎప్పటినుంచో కన్నేసింది. ఆ దేశ నౌకాదళానికి చెందిన బ్రేగ్వేట్ అట్లాంటిక్ విమానం 1999లో సరిహద్దులు దాటి సర్‌క్రీక్‌పై ప్రయాణించింది. నాడు భారత్‌కు చెందిన మిగ్-21 జెట్ దానిని కూల్చేసింది. ఈ ఘటనలో 16 మంది పాక్ నేవీ అధికారులు మరణించారు. కార్గిల్ ముగిసిన కొన్ని నెలల్లోనే ఈ ఘటన చోటుచేసుకోవడంతో ఉద్రిక్తతలు భగ్గుమన్నాయి. ఆ తర్వాత పాక్ మెరైన్ యూనిట్లను ఇక్కడికి తరలించింది. అదే ఏడాది భారత మిగ్‌పై ఓ క్షిపణి ప్రయోగించింది. కానీ, నాడు మన జెట్ దానిని సురక్షితంగా తప్పించుకొంది.

జూనాగఢ్‌ను మ్యాప్‌లో చూపిన పాక్

గుజరాత్‌లోని జూనాగఢ్ తమదే అంటూ పాక్ 2020లో కొత్త వాదనను తెరపైకి తెచ్చింది. దీనికి అనుకూలంగా నాటి ఇమ్రాన్ సర్కారు తమ దేశ మ్యాప్‌లో ఆ ప్రాంతాన్ని చూపించడం మొదలుపెట్టింది. స్వాతంత్ర్యం లభించిన కొత్తల్లో జూనాగఢ్ సంస్థానాన్ని తమలో విలీనం చేసుకోవాలని పాక్ తీవ్రంగా ప్రయత్నించింది. 2019 నుంచి పాక్ సర్‌క్రీక్ వద్ద భారీగా సైనిక మోహరింపులు చేపడుతోందని మీడియా కథనాలు వెలువడ్డాయి. వీటిల్లో ఇన్‌ఫాంట్రీ, యాంఫీబియస్ బెటాలియన్లు, నిఘా కోసం కోస్టల్ డిఫెన్స్ బోట్లు, ఎయిర్‌డిఫెన్స్ యూనిట్లు వంటి వాటిని ఇక్కడికి తరలించింది. గుజరాత్ రాష్ట్రంలో సర్‌క్రీక్ రేఖ 96 కి.మీ. పొడవు, 1-3 కి.మీ. వెడల్పుతో వివాదాస్పద సరిహద్దు రేఖగా ఉంది. సర్‌క్రీక్ అనేది అనిశ్చల అలల ప్రాంతం. తరచూ తన ఉనికిని మారుస్తుంది. పాకిస్థాన్ సర్‌క్రీక్‌ను అంగీకరిస్తూనే ఆ రేఖ తూర్పుతీరానికి సరిహద్దుగా గుర్తించాలని వాదిస్తోంది. భారత్ మాత్రం దాని మధ్యభాగం నుంచి సరిహద్దు గుర్తించాలని చెబుతోంది. అందుకు కారణం అధిక ఆటుపోటుల కాలంలో ఈ క్రీక్ నౌకాయానానికి అనుకూలంగా ఉంటుందని భారత్ భావిస్తోంది. వాస్తవానికి ఈ ప్రదేశం మొత్తం బురద నేలలతో ఉండటం వల్ల సైనికులు దాడులకు పాల్పడటం కష్టమే. ఇక్కడ చమురు నిల్వలు ఉండే అవకాశాలు ఉండటంతో దీనికి ప్రాధాన్యం పెరిగింది.

అంతేకాకుండా సముద్ర సరిహద్దుల నిర్ధారణ, ఎక్స్‌క్లూజివ్ ఎకనామిక్ జోన్‌పై దీని ప్రభావం పడుతుంది. దాదాపు 96 కిలోమీటర్ల పొడవున్న సర్‌క్రీక్‌పై ఎన్నిసార్లు చర్చలు జరిపినా సమస్య పరిష్కారం దిశగా అడుగులు పడలేదు. పాకిస్థాన్ అతిపెద్ద పోర్టు నగరమైన కరాచీ ప్రాంతం సర్‌క్రీక్‌కు నైరుతి దిశలో ఉంటుంది. ఈ ప్రాంతంపై పట్టు సాధిస్తే కరాచీకి భద్రత లభిస్తుందని పాక్ భావిస్తోంది.

విశాలాంధ్ర హైదరాబాద్

శ్రీషిర్డి సాయిబాబా ఆలయంలో కార్పొరేటర్ పూజలు

విశాలాంధ్ర - మల్కాజిగిరి : భక్తుల కోరికలు తీర్చే కొంగు బంగారం శ్రీ షిర్డి సాయిబాబా అని గౌతమ్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ పేర్కొన్నారు. మల్కాజిగిరి సాయినగర్‌లోని సాయిబాబా ఆలయంలో శ్రీ షిర్డి సాయిబాబా సమాధి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఈ కార్యక్రమానికి కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ హాజరై బాబాను దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, వెంకటేశం, మేనేజర్ శ్రీనివాస్, స్థానిక బి.ఆర్.ఎస్ నాయకులు మేకల రాము యాదవ్ పార్టీ నేతలు కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కాచిగూడ-అనకాపల్లి రైలుకు స్వాగతం పలికిన మల్కాజిగిరి వాసులు

విశాలాంధ్ర - మల్కాజిగిరి : మహాత్మా గాంధీ జయంతి, దసరా, సౌత్ సెంట్రల్ రైల్వే 59వ వార్షికోత్సవ సందర్భంలో పండుగ కోసం ప్రత్యేకంగా ప్రవేశ పెట్టిన రైలు 07055 కాచిగూడ - అనకాపల్లి రైలుకు మల్కాజిగిరి పుర ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. ఈ రైలు ప్రతి గురువారం సాయంత్రం కాచీగూడలో 4-50 బయలు దేరి మల్కాజిగిరి 5 -10, 5-12, అనకాపల్లి మరసటి రోజు 08-00 చేరుకుంటుంది. తిరుగు ప్రయాణం అనకాపల్లి సాయంత్రం 5-35 మల్కాజిగిరి 6-43, 6-45 కాచిగూడ 09-00 చేరుకొంటుందని నూర్ తెలియజేశారు. రైలు ప్రయాణికుల సంఘం ప్రతినిధులు స్వామి, కరీమా, పి.భరద్వాజ్, వహీదా, ధనుంజయ్, హసీనా, రామచంద్ర రెడ్డి తదితరులు పాల్గొని మల్కాజిగిరిలో హాల్ట్ సౌకర్యం కల్పించినందుకు సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్, సంజయ్ కుమార్ శ్రీవాత్సవ, డివిజినల్ రైల్వే మేనేజర్, హైదరాబాద్ డివిజన్ సంతోష్ కుమార్ వర్మ ఇతర అధికారులకు, సిబ్బందికి దసరా శుభాకాంక్షలు, ధన్యవాదాలు తెలిపారు. రాయలసీమ ఎక్స్ ప్రెస్‌ను మల్కాజిగిరిలో నిలపాలని పలువురు కోరారు.

మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి పార్థివదేహానికి నివాళులు

విశాలాంధ్ర - హైదరాబాద్ : జూబ్లీహిల్స్ లోని వారి నివాసంలో మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి పార్థివ దేహానికి నివాళులు అర్పించిన మంత్రి పొన్నం ప్రభాకర్, మేయర్ గద్వాల విజయలక్ష్మీ, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరు సేవాభావం కలిగి ఉండాలి

విశాలాంధ్ర - మొయినాబాద్: ప్రతీ ఒక్కరు సేవా భావం కలిగి ఉండాలని సామజిక కార్యకర్త అత్తెల్లి జగన్నాథ్ రెడ్డి అన్నారు. దసరా పర్వదినం సందర్భంగా చేవెళ్లలో ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. చేవెళ్లకు చెందిన సామాజిక కార్యకర్త అత్తెల్లి జగన్నాథ్ రెడ్డి శుక్రవారం మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అత్తెల్లి జగన్నాథ్ రెడ్డి మాట్లాడుతూ మహిళలకు సంతోషం కలిగించడం ద్వారానే పండగ ఆత్మస్థారకత సాధిస్తుందని, వారిని గౌరవించడమే సమాజాభివృద్ధికి బాటలు వేస్తుందని అన్నారు. సమాజంలో సేవా కార్యకమాలు చేపట్టడంలో ఉన్న ఆత్మ సంతృప్తికి మరెందులో లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో అత్తెల్లి భాగ్యమ్మ, భవాని, శ్రీమాన్ రెడ్డి, శ్రీనికేత్ రెడ్డి, శ్రీనాథ్ రెడ్డి, మౌనిక, వీహలు పాల్గొన్నారు.

మేడిపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఘనంగా ఆయుధ పూజ

విశాలాంధ్ర - మేడిపల్లి: విజయదశమి పండుగ సందర్భంగా గురువారం ఉదయం మేడిపల్లి పోలీస్ స్టేషన్లో సిఐ ఆర్.గోవిందా రెడ్డి అధ్యక్షతన ఘనంగా ఆయుధపూజ నిర్వహించడం జరిగినది. పూజ కార్యక్రమం సందర్భంగా సిఐ ఆర్.గోవిందా రెడ్డి మాట్లాడుతూ విజయదశమి అంటే చెడుపై మంచి విజయం సాధించడం అని అదే విధంగా సమాజంలో ప్రజలు కూడా వారి చెడు సావాసుల ను వదిలి విజయం సాధించాలి, సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి అని కోరుకుంటూ సిబ్బంది అందరూ కూడా వారు కోరుకున్న కోరికలు నెరవేరాలని ఆ దుర్గామాత ఆశీస్సులు అందరిపై చల్లగా ఉండాలని సూచించడం జరిగినది. ఇట్టి కార్యక్రమంలో మేడిపల్లి ఎస్సైలు సిబ్బంది పాల్గొనడం జరిగింది.

లబ్ధిదారులకు 2బిహెచ్‌కే ఇళ్ల పట్టాలు పంపిణీ

మంత్రి పొన్నం

విశాలాంధ్ర - హైదరాబాద్ : గతంలో డబుల్ బెడ్ రూం కేటాయించి కోర్టు కేసులో ఆగిపోయి కోర్టు నుండి క్లియరెన్స్ వచ్చిన చార్మినార్, మలక్ పేట, యాకత్ పుర, చాంద్రాయణ గుట్ట నియోజకవర్గాలకు సంబంధించిన లబ్ధిదారులకు మినిస్టర్ క్వార్టర్స్‌లో డబుల్ బెడ్ రూం పట్టాలు హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో జీహెచ్ ఎంసీ మేయర్ గద్వాల విజయ లక్ష్మీ, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, మేయర్ గద్వాల విజయలక్ష్మి, ఎమ్మెల్యేలు ఇతర ముఖ్య నేతలు పాల్గొన్నారు. జీహెచ్ఎంసి ప్రాంత నివాసితులకు 2బిహెచ్‌కే ఇళ్ల కేటాయింపు పథకంలో భాగంగా, రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం మంకల్ గ్రామంలో 2 బిహెచ్‌కే ఇళ్ల నిర్మాణాన్ని జీహెచ్ఎంసి చేపట్టింది. కలెక్టర్, రంగారెడ్డి హైదరాబాద్ జిల్లాకు చెందిన 1730 మంది లబ్ధిదారుల జాబితాను ప్రచురించారు. మంకల్-ఫేజ్-2 స్థానంలో 2 బిహెచ్‌కే ఇళ్లను కేటాయించారు. అందులో భాగంగా చార్మినార్, మలక్ పేట, యాకత్ పుర, చాంద్రాయణగుట్ట నియోజకవర్గంలో ఉన్న లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేశారు. అంబర్ పేట - 134, బహదూర్ పుర- 294, బండ్లగూడ - 155, చార్మినార్ - 209 సైదాబాద్ - 206, ఇతర ప్రాంతాల్లో ఉన్న 28 డబుల్ బెడ్ రూంలలో మొత్తం 1024 మంది లబ్ధిదారుల్లో శుక్రవారం మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా 75 మంది పట్టాలు అందుకున్నారు. మిగిలిన లబ్ధిదారులకు స్థానిక ఎమ్మార్వో కార్యాలయంలో పట్టాలు పంపిణీ చేయనున్నారు.

ఒడిశా నైనీ నుంచి తమిళనాడు జెన్ కో కు

బొగ్గు సరఫరా చేసేందుకు సర్వం సిద్ధం

విశాలాంధ్ర - హైదరాబాద్ : సింగరేణి సంస్థ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఒడిశాలోని నైనీ బొగ్గు బ్లాక్ నుంచి తమిళనాడు పవర్ జనరేషన్ కార్పోరేషన్కు బొగ్గును సరఫరా చేసేందుకు సర్వం సిద్ధమైంది. ఈ బ్లాక్ నుంచి ఏటా 2.88 మిలియన్ టన్నుల బొగ్గు సరఫరాకు తమిళనాడు జెన్ కో తో సింగరేణి సంస్థ మరో 10 రోజుల్లో ఇంధన సరఫరా ఒప్పందం చేసుకోనుంది. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్ సింగరేణి భవన్‌లో తమిళనాడు పవర్ జనరేషన్ కార్పోరేషన్ ఎండీ ఎం.గోవిందరావు, సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్‌ను కలిసి చర్చలు జరిపారు. తమిళనాడులోని తుత్తుకూడి జిల్లా ఉడంగిడిలో ఉన్న 1200 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ కోసం ప్రతీ ఏడాది 2.88 మిలియన్ టన్నుల జీ-11 బొగ్గు అవసరముందని తమిళనాడు జెన్‌కో ఎండీ ఎం.గోవిందరావు పేర్కొన్నారు. సింగరేణి నుంచి ఈ బొగ్గును సరఫరా చేయాల్సిందిగా కోరారు. దీనిపై సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ స్పందిస్తూ ఒడిశాలోని నైనీ బొగ్గు బ్లాక్ నుంచి ఉత్పత్తి ప్రారంభమైన నేపథ్యంలో రైలు, జల మార్గంలో సరఫరా చేసేందుకు సంసిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఈ మేరకు బొగ్గు సరఫరాకు ఏర్పాట్లు చేయాల్సిందిగా నైనీ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అదే సమయంలో తమిళనాడు జెన్ కో తో మరో 10 రోజుల్లో ఇంధన సరఫరా ఒప్పందం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాల్సిం దిగా బొగ్గు రవాణా, మార్కెటింగ్ శాఖ అధికారులకు స్పష్టం చేశారు. సింగరేణితో తమిళనాడు జెన్ కోకు ఉన్నదీర్ఘ కాలిక బంధాన్ని మరింత బలపరిచేందుకు ఈ ఒప్పందం దోహదపడుతుం దని ఈ సందర్భంగా సీఎండీ ఎన్.బలరామ్, తమిళనాడు జెన్ కో ఎండీ ఎం.గోవింద రావు పేర్కొన్నారు. ఇప్పటికే సింగరేణి ద్వారా తమిళ నాడులోని నార్త్ చెన్నై విద్యుత్ ప్లాంట్కు ప్రతీ ఏడాది 1.75 మిలియన్ టన్నుల బొగ్గు సరఫరా జరుగుతోంది. తాజాగా ఒడిశాలోని నైనీ ప్రాజెక్టు నుంచి ఏడాదికి 2.88 మిలియన్ టన్నుల బొగ్గు సరఫరాకు అంగీకారం కుదిరింది. ఈ నేపథ్యంలో నైనీ బొగ్గుకు మొదటి వినియోగదారుగా తమిళనాడు నిలవనుండటం విశేషం. ఈ సమావేశంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(కోల్ మూవ్మెంట్) బి.వెంకన్న, జీఎం (కో ఆర్డినేషన్, మార్కెటింగ్) టి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉస్మానియా ఆసుపత్రి నూతన భవనాల నిర్మాణం ప్రారంభం

విశాలాంధ్ర - హైదరాబాద్ : అధునాతన సౌకర్యాలతో రెండువేల పడకలతో హైదరాబాద్, అక్టోబర్ 2 ఉస్మానియా జనరల్ హాస్పిటల్ నూతన భవన సముదాయ నిర్మాణం దసరా పర్వదినాన ప్రారంభమైంది. మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ (ఎం ఈ ఐ ఎల్) ప్రాజెక్టుల విభాగం అధ్యక్షులు కె.గోవర్ధన్ రెడ్డి గురువారం శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి నిర్మాణ పనులను ప్రారంభించారు. హైదరాబాద్‌లోని గోషామహల్ పోలీస్ స్టేడియంలో ఉస్మానియా ఆసుపత్రి నూతన భవనాలను నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ భవనాల నిర్మాణానికి ఈ ఏడాది జనవరిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంఖుస్థాపన చేసిన సంగతి తెలిసిందే. దసరా నాడు ప్రారంభమైన పనులు ఇక శరవేగంగా జరగనున్నాయి. ఉస్మానియా ఆసుపత్రి నూతన భవనాల నిర్మాణం రెండున్నర ఏళ్లలో పూర్తి కానున్నాయి. నూతన భవనాల సముదాయాన్ని 26 ఎకరాల విస్తీర్ణంలో 32 లక్షల చదరపు అడుగుల నిర్మాణ విస్తీర్ణంతో అభివృద్ధి చేయనున్నారు. ఇందులో రెండు వేల పడకలు ఏర్పాటు చేస్తారు. ఈ ఆసుపత్రిలో హాస్పిటల్ బ్లాక్ ఒక్కటే 22.96 లక్షల చదరపు అడుగులు విస్తీర్ణంలో నిర్మిస్తారు. అకడమిక్ బ్లాక్, పురుష, మహిళా వసతి గృహ బ్లాకులు, ధర్మశాల, మార్చురీ, యుటిలిటీ బిల్డింగ్, సెక్యూరిటీ బిల్డింగ్ మిగిలిన తొమ్మిది లక్షల నాలుగు వేల చదరపు అడుగుల్లో నిర్మిస్తారు. రెండు స్థాయిల బేస్‌మెంట్ పార్కింగ్‌ను 1,500 కార్ల పార్కింగ్‌కు అనువుగా నిర్మించనున్నారు. ఆసుపత్రి సముదాయంలో 29 ప్రధాన, 12 చిన్న ఆపరేషన్ థియేటర్లు, హెలిప్యాడ్, రోబోటిక్ సర్జరీ థియేటర్లు, ట్రాన్స్‌ప్లాంట్ యూనిట్లు, సీవేజ్ ట్రీట్మెంట్, బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ ప్లాంట్లు నిర్మిస్తారు. అలాగే నర్సింగ్, డెంటల్, ఫిజియోథెరపీ కాలేజీలు వేర్వేరుగా నిర్మించనున్నారు. రూఫ్‌టాప్ టెర్రస్ గార్డెన్లు, క్రాస్ వెంటిలేషన్ టెక్నాలజీలతో నిర్మించే ఆసుపత్రి నూతన భవనాలు నిరంతరాయంగా సహజమైన గాలిని అందించి రోగులకు సౌకర్యవంతమైన వాతావరణాన్ని అందించనున్నాయి. భవన నిర్మాణ పనులకు పూజ చేసిన అనంతరం ఎంఈఐఎల్ ప్రాజెక్టుల విభాగం అధ్యక్షులు కె.గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ నిర్ణయించిన గడువులోనే పనులు పూర్తిచేస్తామన్నారు. నూతన ఆసుపత్రి భవనాల్లో సౌకర్యాలు ప్రైవేట్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులకు దీటుగా ఉంటాయన్నారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, ఆధునిక వసతులతో ఈ భవనాలను నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు.

మంగళగిరి, కృష్ణ కెనాల్ స్టేషన్ల మధ్య

ఆరు లైన్ల రోడ్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి రైల్వే మంత్రిత్వ శాఖ ఆమోదం

నిర్మాణానికి అంచనా వ్యయం రూ. 112 కోట్లు

విశాలాంధ్ర - హైదరాబాద్ : మంగళగిరి - కృష్ణ కెనాల్ స్టేషన్ల మధ్య ఈ13 ఎక్స్‌టెన్షన్ రోడ్డు వద్ద రూ. 112 కోట్ల అంచనా వ్యయంతో 6 లేన్ల రోడ్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణ ప్రతిపాదనను రైల్వే మంత్రిత్వ శాఖ శుక్రవారం ఆమోదించింది. ప్రతిపాదిత ఆర్.ఓ.బి అమరావతి రాజధాని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని జాతీయ రహదారి-16 (నేషనల్ హైవే-16) మధ్య అనుసంధాన రహదారిపై ఉంది. ఈ రోడ్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం జోన్ ద్వారా 100 శాతం రైల్వే వ్యయంతో అమలు యబడుతుంది. ఈ13 స్థానం కీలకమైన ప్రదేశంలో ఉండి ఎన్.ఎచ్-16 ను అమరావతి రాజధానితో కలుపుతుంది మధ్యలో ఒక వైపు రైల్వే ట్రాక్ ఉంది.

ఈ రైల్వే ట్రాక్ చెన్నై - హౌరాను విజయవాడ మీదుగా కలిపే ముఖ్యమైన రద్దీ రైల్వే లైన్. ప్రారంభంలో, దీనిని నాలుగు లైన్ల రోడ్ ఓవర్ బ్రిడ్జి కోసం ప్రణాళిక చేశారు. కానీ స్థానం భవిష్యత్తు ట్రాఫిక్ ప్రాముఖ్యతను పరిగణనలోకి తీసుకుని, 6లైన్ల రోడ్ ఓవర్ బ్రిడ్జిని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించగా రైల్వే మంత్రిత్వ శాఖ ఈ ప్రతిపాదనకు అంగీకరించింది. టెండరింగ్ ప్రక్రియకు మారే ముందు డిజైన్ల ఆమోదం, సాధారణ డ్రాయింగ్‌లు వంటి ప్రాథమిక పనులు త్వరలో పూర్తవుతాయి. ప్రతిపాదిత రోడ్డు ఓవర్ బ్రిడ్జి ఆంధ్రప్రదేశ్ రాజధాని నగర ప్రాంతం వైపు వెళ్లే రోడ్డు ట్రాఫిక్ సజావుగా సాగడానికి ఎంతో సహాయపడుతుంది. ఇది రోడ్డు రైలు వినియోగదారుల భద్రతను నిర్ధారిస్తూ నిలుపుదలను నివారించి రవాణాను సజావుగా సులభతరం చేస్తుంది.

పాలాస్తీనాకు మద్దతుగా రాష్ట్రవ్యాప్త నిరసనలు విజయవంతం

విశాలాంధ్ర - హైదరాబాద్ : నేడు ప్రపంచ కార్మిక సంఘాల సమాఖ్య 80వ వార్షికోత్సవం సందర్భంగా అక్టోబర్ 3 నుండి 5 వరకు జరుగుతున్న సభ ఇచ్చిన పిలుపును ప్రపంచ వ్యాపితంగా నిరసన కార్యక్రమాలు చేయాలన్న పిలుపులో భాగంగా, హైదరాబాదులోని నారాయణగూడ ఫ్లైఓవర్ కింద కేంద్ర కార్మిక సంఘాలు ఏఐటీయుసి, సిఐటియు, ఎఐయుటీయుసి సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం జరిగింది ఈ కార్యక్రమానికి ఏఐటీయుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్ హాజరై మాట్లాడుతూ మోడీ భారతదేశంలో కార్మిక వ్యతిరేక విధానాలను ఏ విధంగా అవలంబిస్తున్నాడో, పాలస్తీనా పై అమెరికా అండదండలతో ఇజ్రాయిల్ దేశం దురాగతాలు, రోజురోజుకు పెరుగుతూ కార్మిక వర్గాన్ని, ప్రజలను, బానిసలుగా మార్చుతూ అనేక వేధింపులకు, ఇబ్బందులకు గురిచేయడాన్ని ఆయన ఖండిరచారు. పాలస్తీనాలోని గాజానగరాన్ని స్వాధీనం చేసుకుని పౌరుల ప్రాథమిక హక్కులను కాలరాస్తూ, ప్రజలను కట్టు బానిసలుగా మారుస్తున్న సందర్భం మరి దారుణంగా ఉన్నదని ఆయన వాపోయారు. అమెరికా, ఇజ్రాయిల్ సేనలు ఇప్పటికే రెండు లక్షల 65 వేల మందిని క్రూరంగా హింసించి చంపేశారు అదేవిధంగా 1,50,000 మందిని ఇజ్రాయిల్, అమెరికా ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడుతున్న ప్రజాస్వామ్యవాదులను 1,50,000 మందిని కాళ్లు చేతులు విరగొట్టి క్షతగాత్రులు చేసి, ఏ పని చేయకుండా చేసినటువంటి ఇజ్రాయిల్, అమెరికా సైన్యాల విధానాన్ని కార్మిక సంఘాలు తీవ్రంగా వ్యతిరేకించాయి, పెట్టుబడుదారి విధానం రోజురోజుకు బలహీన పడుతున్నప్పుడు పాలకులు ప్రజలను పక్కదారి పట్టించేందుకు ప్రజలలో గందరగోళాన్ని లేపేందుకు, యుద్ధాలను ప్రేరేపించి ప్రజలలో అభద్రతా భావాన్ని పెంచి వారికున్న కనీస హక్కుల్ని కాలరాయటాన్ని కూడా ఆయన తీవ్రంగా ఖండిరచారు. సిఐటియు రాష్ట్ర కార్యదర్శి పాలడుగు భాస్కర్ మాట్లాడుతు పాలస్తీన విషయంలో ప్రపంచ కార్మిక సంఘాల సమైక్య డబ్ల్యూఎఫ్‌టియుకి సంఘీభావం తెలుపుతూ ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రజాస్వామ్యవాదులు కార్మిక సంఘాలు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేసి అమెరికా, ఇజ్రాయిల్ దేశాల ప్రభుత్వాలకు బుద్ధి చెప్పాలని ఆయన కోరారు. ఇజ్రాయిల్ గాజా నగరాన్ని, పాలస్తీనా భూభాగాన్ని హస్తగతం చేసుకొని, ఆక్రమించుకొని ఖనిజసంపదను దోచుకునేందుకు అమెరికా అధ్యక్షుడు రోనాల్డ్ ట్రంప్ సహకారంతో పాలస్తీన ప్రజలపై, భూభాగంపై దోపిడి చేసేందుకు, పాలస్తీనా దేశాన్ని నామరూపాలు లేకుండా చేస్తామని అమెరికా హెచ్చరిక చేయడం, 20 సూత్రాల పథకాన్ని ప్రవేశపెట్టి పాలస్తిన ప్రజానీకాన్ని భయ భ్రాంతులకు గురి చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండిరచారు. పాలస్తీన రాజ్యా ప్రాంతాన్ని ఆక్రమించు కొని యుద్ధం చేయడానికి అవసరమైన ఆహార పదార్థాలను, ఆయుధాలను చేరవేసేందుకు ఇజ్రాయిల్ పోర్టులో ఎగుమతి చేయకుండా పాలస్తీనాను ఆక్రమించుకోకుండా వేలమంది ఇజ్రాయిల్ దేశ పౌరులు ఇజ్రాయిల్‌కు వ్యతిరేకంగా నిలబడటం డబ్ల్యూఎఫ్‌టియు చేసిన కృషి వల్ల గాజా పాలస్తీనులపై దాడులు ఆగాయని ఆయన అన్నారు. ప్రపంచ కార్మిక సంఘాల సమైక్య గాజా నగరాన్ని దురాక్రమనకు వ్యతిరేకంగా ఇజ్రాయిల్ సేనలకు వ్యతిరేకంగా డాకు వర్కర్స్, ఇటలీ, గ్రీస్, ఫ్రాన్స్ ఇతర ప్రధాన పోర్టులలో పనిచేస్తున్న కార్మిక సంఘాల ఫెడరేషన్లు ఐక్యంగా మిలిటరీ ఆయుధాలు, సామాగ్రిని తరలించేందుకు నిరాకరించడం ప్రపంచ కార్మిక లోకానికి ఒక గొప్ప సంకేతం అని ఆయన మెచ్చుకున్నారు. ఎఐయుటీయుసి నాయకులు మాట్లాడుతు ఇది డబ్ల్యూఎఫ్‌టియు 134 దేశాలలో చేస్తున్న సేవలకు గుర్తింపునిస్తుంది అని భరత్ తెలిపారు. ఆ విధంగా పాలస్తీన ప్రజలకు అండగా నిలబడుతుంది భారతదేశ కార్మిక వర్గం ఇజ్రాయిల్ పాలస్తీనా ఆక్రమిత భూభాగం నుండి ఖనిజం సంపద దోపిడిని ఖండిస్తూ ఇజ్రాయిల్ మిలిటరీ చర్యలను ఉపసంహరించుకోవాలని, ఉగ్రవాద చర్యలను అమెరికా, ఇజ్రాయిల్ సైనిక చర్యలను నిలిపివేసి బెస్ట్ బ్యాంకు నుంచి సైనిక బలగాలను వెంటనే విడనాడాలని డిమాండ్ చేశారు. అక్టోబర్ మూడున తెలంగాణ రాష్ట్రం లోని అన్ని జిల్లా మండల కేంద్రాలలో రాష్ట్ర రాజధాని హైదరాబాదులో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేసి సామ్రాజ్యవాదాన్ని అంతం చేయాలని ఆయన పిలుపుని చ్చారు. ఎఐటియుసి సీనియర్ నాయకులు వి.ఎస్.బోస్, ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు యం.డి.యూసుఫ్, ఎఐటియుసి రాష్ట్ర ఉపప్రధాన కార్యదర్శి ఎం.నర్సింహ్మా, ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శులు బి.వెంకటేశం, ఎన్.కరుణకుమారి, ఎఐటియుసి నాయకులు ఉమర్ ఖాన్, లతీఫ్, ఇంద్రసేనా, ఎస్.రాజమౌళి, సిఐటియు నాయకులు జె.వెంకటేష్, ఈశ్వరరావు, ఎం.ఎస్.రెడ్డి, పాలడుగు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు ఘన స్వాగతం

విశాలాంధ్ర - హైదరాబాద్ : కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హైదరాబాద్ పర్యటనలో భాగంగా బేగంపేట విమానాశ్రయంలో పుష్పగుచ్ఛాలు అందజేసి మర్యాదపూర్వకంగా స్వాగతం పలికిన రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్, లక్ష్మణ్, రాజ్యసభ సభ్యులు అనిల్‌కుమార్ యాదవ్, బిజెపి అధ్యక్షులు రామ్ చంద్రరావు, శాసనసభ్యులు గణేష్, మేయర్ గద్వాల విజయలక్ష్మి, సిపి సజ్జనార్, జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి, డిసిపి రష్మిక పరిమల్, డిఫెన్స్ ఉన్నత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ వచ్చేంత వరకు పోరాడతాం

విశాలాంధ్ర - హైదరాబాద్ : స్థానిక సంస్థలలో 42 శాతం రాజకీయ రిజర్వేషన్ వచ్చేంత వరకు అలాగే చట్టసభల్లో 50శాతం రిజర్వేషన్ వచ్చే వరకు పోరాటం కొనసాగుతుందని బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన హైదరాబాదులోని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర కార్యాలయం నుంచి విడుదల చేసిన పత్రికా ప్రకటనలో కామారెడ్డి బీసీ డిక్లరేషన్ లో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ పార్టీ స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పించి బిల్లును ఆమోదించి రాష్ట్రపతికి గవర్నర్ కి పంపితే ఆరు మాసాలు దాటినప్పటికీ ఆ బిల్లుపై ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కాలయాపన చేస్తుందని అందుకు కారణం 42శాతం రిజర్వేషన్ బీసీలకు ఇస్తే ఆ క్రెడిట్ మొత్తం కాంగ్రెస్ పార్టీకి దక్కుతుందనే భయంతో బిజెపి వెనకడుగు వేస్తోందని షెడ్యూల్ 9 లో బీసీ బిల్లు ను చేర్చకుండా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అడ్డుపడుతుందనే విషయాన్ని బీసీలందరూ గ్రహించారని తగు సమయంలో తగు మూల్యం చెల్లించుకునేందుకు బిజెపి పార్టీ సిద్ధంగా ఉండాలని ఆయన అన్నారు. జనాభా దామాషాలో ఏ కులం జనాభా ఎంత ఉంటే ఆ కులానికి అంతే పద్దతుల్లో విద్యా ఉద్యోగ ఉపాధి రాజకీయ రంగాల్లో రిజర్వేషన్ కల్పిస్తే వచ్చే నష్టం ఏమిటో బిజెపి నేతలు సమాధానం చెప్పాలని, రాజకీయ రిజర్వేషన్ అనేది మా హక్కు అని ఎవరు అడ్డుకున్నా బీసీ రాజకీయ రిజర్వేషన్ సాధించి తీరుతామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. అక్టోబర్ 8 హైకోర్టు తీర్పు తర్వాత బీసీ సంఘాలను సమీకరించి భవిష్యత్తు కార్యక్రమాలపై చర్చించి తగు కార్యాచరణ రూపొందిస్తామని ఆయన తెలిపారు.

కిషోర్ రెడ్డికి సాధు యాదవ్ శుభాకాంక్షలు

విశాలాంధ్ర- దుండిగల్: చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తు దసరా పండుగను జరుపుకుంటామని కాంగ్రెస్ సీనియర్ నాయకులు బొంగునూరి కిషోర్ రెడ్డి పేర్కొన్నారు. విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు సాధు యాదవ్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు బొంగునూరి కిషోర్ రెడ్డిని వారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కిషోర్ రెడ్డి మాట్లాడుతూ చెడుపై మంచి సాధించిన విజయానికి సంకేతంగా జరుపుకునే విజయ దశమి వేడుకను ఇంటిల్లిపాది ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని, దసరా పండుగ అందరి జీవితాల్లో విజయాలు సమకూర్చాలని, చేపట్టిన ప్రతీ కార్యం సఫలీకృతం కావాలని ఆకాంక్షించారు. దుర్గామాత కరుణాకటాక్షాలతో ప్రజలంతా సుభిక్షంగా, సుఖ సంతోషాలతో జీవనాలు వెళ్లదీయాలని కోరారు.

అత్యుత్తమ ఆదాయాన్ని నమోదు చేసిన దక్షిణ మధ్య రైల్వే

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి ఆరు నెలల్లో రూ.10143 కోట్ల

విశాలాంధ్ర - హైదరాబాద్ : దక్షిణ మధ్య రైల్వే 2025 ఏప్రిల్ నుండి సెప్టెంబర్ మధ్య కాలంలో అత్యుత్తమంగా రూ.10143 కోట్ల స్థూల ఆదాయాన్ని, సరుకు రవాణా రంగంలో 71.14 మిలియన్ టన్నులను, సరుకు రవాణాలో రూ.6635 కోట్ల ఆదాయాన్ని, ప్రయాణీకుల విభాగం నుండి రూ.2991 కోట్ల ఆదాయాన్ని నమోదు చేసింది. దక్షిణ మధ్య రైల్వే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి ఆరు నెలల్లో సరుకు రవాణా, ప్రయాణీకుల విభాగాలలో అత్యుత్తమ పని తీరును కనబరిచింది. జోన్ 2025 ఏప్రిల్ నుండి సెప్టెంబర్ వరకు రూ.10143 కోట్ల స్థూల ఆదాయాన్ని నమోదు చేసింది. ఇది 2024-25లో నమోదైన మునుపటి అత్యుత్తమ ఆదాయమైన రూ. 9966 కోట్ల కంటే 1.7శాతం ఎక్కువ. ఈ కాలంలో రూ.2991 కోట్ల ప్రయాణీకుల ఆదాయం, రూ.6635 కోట్ల సరుకు రవాణా ఆదాయం దీనికి దోహదపడింది. అదే విధంగా జోన్ మునుపెన్నడూ లేని విధంగా సరుకు రవాణాలో 71.14 మిలియన్ టన్నుల సరకు లోడింగ్‌ను సాధించింది. ఇది 2024-25లో లోడ్ చేయబడిన 67 మిలియన్ టన్నుల మునుపటి ఉత్తమ సరుకు రవాణా లోడింగ్ కంటే 6 శాతం ఎక్కువ. దక్షిణ మధ్య రైల్వే సిబ్బంది అసాధారణ సమిష్టి కృషి, అన్ని విభాగాల మధ్య సమర్థవంతమైన సమన్వయం ఫలితంగా రికార్డు స్థాయి పని తీరును సాధించగలిగింది. జోన్లోని ప్రస్తుత సరుకు రవాణా వ్యవస్థను బలోపేతం చేస్తూనే, సరుకు రవాణా విభాగంలో నూతన పంథాలను ప్రవేశపెడుతున్నారు. ఈ దిశలో నిరంతర ప్రయత్నం ఫలితంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి 6 నెలల్లో జోన్ 71.14 మిలియన్ టన్నుల సరుకు రవాణా వస్తువులను రవాణా చేయడం ద్వారా అత్యుత్తమ సరుకు రవాణాను నమోదు చేసింది. ఇదే కాలంలో గత సంవత్సరంలోని సరుకు రవాణా కంటే ఇది 4.13 మిలియన్ టన్నులు ఎక్కువ (67 మిలియన్ టన్నులు). ఇనుప ఖనిజం, ఉక్కు కర్మాగారాలకు ముడి పదార్థాలు, సిమెంట్ మొదలైన వస్తువుల లోడింగ్ పెరగడం వల్ల సరుకు రవాణాలో మెరుగుదల ప్రధానంగా ఉంది. అదే సమయంలో, వీలైనంతవరకు అవసరమైన చోట ప్రత్యేక రైళ్లను ప్రవేశపెట్టడానికి, నడపడానికి జోన్ ప్రయాణీకుల రవాణా ధోరణులను నిరంతరం పర్యవేక్షిస్తోంది.

వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లతో పాటు ప్రవేశపెట్టిన రైళ్లు మంచి ఆదరణతో నడుస్తున్నాయి. అదనంగా, డిమాండ్, సాధ్యాసాధ్యాలు ఉన్న చోట జోన్ అదనపు కోచ్ లతో రైళ్లను నడుపుతోంది, ప్రత్యేక రైళ్ల నిర్వహణకు అదనంగా దీని వలన వెయిట్‌లిస్ట్ లోనున్న ప్రయాణీకులకు ఉపయోగపడుతోంది. ప్రయాణీకుల ఆదాయం పరంగా, ఈ కాలంలో జోన్ రూ. 2991 కోట్ల ఆదాయాన్ని సాధించింది. ఇది గత సంవత్సరం గడించిన రూ. 2909 కోట్ల కంటే 2.8 శాతం అధికం. దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఈ అద్భుతమైన ఆదాయాలను సాధించినందుకు సంతృప్తి వ్యక్తం చేస్తూ దక్షిణ మధ్య రైల్వే బృందాన్ని అభినందించారు. ఆర్థిక సంవత్సరం చివరి నాటికి ఉత్తమ పని తీరును సాధించడానికి అన్నిడివిజన్లు, ప్రధాన కార్యాలయాల సిబ్బంది, అధికారులు ఇదే స్ఫూర్తితో ఒకే వేగాన్ని కొనసాగించాలని ఆయన సూచించారు.

ఉచిత అంబులెన్స్ సేవలను ప్రారంభించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర - షాద్ నగర్, రూరల్: ప్రమాదంలో ఉన్న వారికి వెంటనే వైద్య సాయం అందే విధంగా ఉచిత అంబులెన్స్ సేవలను శంషాబాద్ లిమ్స్ ఆసుపత్రి యాజమాన్యం ఉచితంగా ఏర్పాటు చేసినట్లు రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో విజయదశమి సందర్భంగా 4 అంబులెన్స్‌లను ఎమ్మెల్యే శంకర్ ప్రారంభించారు. లిమ్స్ ఆసుపత్రి నిర్వాహకుడు రామరాజు ఈ అంబులెన్స్ లకు దాతగా ఉన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ షాద్‌నగర్ నియోజకవర్గంలో ఏ మారుమూలన ప్రజలకు ఏ ఆరోగ్య కష్టం వచ్చినా వెంటనే అంబులెన్స్ వెళ్లి వారికి సేవలు అందించేలా వీటిని మంజూరు చేయడం జరిగిందన్నారు. ఇప్పటికే షాద్‌నగర్ ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రి అత్యాధునిక వసతులతో సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకుంటుందని, త్వరలో దీనిని అందుబాటులోకి తెస్తామని వెల్లడించారు. ఉమ్మడి మండలాలైన కొందుర్గు, జిల్లేడు చౌదరిగుడా, కొత్తూరు, నందిగామలకు కలిపి రెండు అంబులెన్సులు, ఫరూక్ నగర్, కేశంపేట మండలాలకు మరో రెండు అంబులెన్సులు అందుబాటులో ఉంటాయని వివరించారు. రూపాయి ఖర్చు లేకుండా పేదలను ఈ అంబులెన్స్ ద్వారా ఎక్కడికైనా సరే వైద్య సేవలను నిమిత్తం తీసుకువెళ్లడం జరుగుతుందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. నిర్వాహకుడు రామరాజు మాట్లాడుతూ వైద్య సేవలను మరింత విస్తృతం చేయాలన్న ఎమ్మెల్యే ఆలోచనలకు ఆకర్షితుడినై తన వంతు సహకారాన్ని అందించానని వెల్లడించారు. ముఖ్యంగా ప్రమాద సమయంలో బాధితులకు ప్రాణ రక్షణగా నిలిచేందుకు గోల్డెన్ అవర్స్ ఉంటాయని అలాంటి విలువైన సమయాన్ని వృథా చేయకుండా అంబులెన్స ద్వారా సరైన వైద్య చికిత్స అందే విధంగా ఈ అంబులెన్స్‌లో ఉపయోగపడతాయని అన్నారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలకు మొదటి నుండి తాను సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యేగా కాకముందు కూడా ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న సమయంలో కూడా ఎంతో మంది నిరుపేదలకు తమ లిమ్స్ ఆసుపత్రి ద్వారా వైద్య సేవలు అందించడం జరిగిందని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ బాబర్ అలీ ఖాన్, చేన్నయ్య, విశ్వం, బస్వం, చెంది తిరుపతి రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, ఇబ్రహీం, ఖదీర్, సూర్య ప్రకాష్, ముబారక్ అలీ ఖాన్, రవితేజ, జగదీష్, పెంటయ్య, అశోక్, రవికుమార్ ముదిరాజ్, రాజేందర్ రెడ్డి, మసూద్ ఖాన్, షఫీద్దీన్, జంగారి రవి, మాధువలు యాదవ్, బాల గంగాధర్ తిలిక్, గంగమోని సత్తయ్య, దిలీప్, అర్జున్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి ఆసుపత్రిలో స్పెషల్ క్యాంపైన్ 5.0 పారిశుద్ధ్య కార్యక్రమం

విశాలాంధ్ర - కొత్తగూడెం : కేంద్ర ప్రభుత్వ, మినిస్ట్రీ ఆఫ్ కోల్ ఆదేశాల మేరకు కొత్తగూడెం సింగరేణి మెయిన్ ఆసుపత్రిలో స్పెషల్ క్యాంపెయిన్ 5.0 ద్వారా పారిశుద్ధ్య కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమం సంస్థ ఛైర్మెన్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరామ్ సూచనల మేరకు గాంధీ జయంతి అక్టోబర్ 2 నుండి ఈ నెల 31 వరకు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా నోడల్ ఆఫీసర్, జీఎం ఎం.శ్రీహరి మాట్లాడుతూ సింగరేణి వ్యాప్తంగా ఈ స్పెషల్ క్యాంపెయిన్ నెలరోజుల పాటు జరుపుకుంటున్నామన్నారు. కార్యక్రమ ముఖ్య ఉద్దేశం సింగరేణి వివిధ యూనిట్లలో పరిశుభ్రత, స్థల సృష్టి, సుందరీకరణ, ఇ-వ్యర్థాల తొలగించాలన్నారు. ప్రతి ఉద్యోగి తన పనిస్థలాన్ని పరిసరాలను పరిశుభ్రంగా, ఆకర్షణీయంగా మార్చడానికి బాధ్యత వహించాలన్నారు. తద్వారా సింగరేణి సంస్థ ఇతర పబ్లిక్ సెక్టార్ యూనిట్లకు ఆదర్శంగా నిలవాలని కోరారు. ఎసిఎంఓ ఎం.ఉష మాట్లాడుతూ ఆసుపత్రిలో ఈ కార్యక్రమ నిర్వహణ ద్వారా పరిశుభ్రత, సుందరీకరణ వల్ల రోగులకు మెరుగైన ఆరోగ్య వాతావరణం లభిస్తుందన్నారు.

ఈ కార్యక్రమంలో జీఎం శ్రీహరి, ఎం. ఉషతో పాటు గుర్తింపు సంఘం ఏఐటియుసి బ్రాంచ్ సెక్రటరీ ఎస్వి రమణమూర్తి, ప్రాతినిధ్య సంఘం ఐఎన్ టి యు సి వైస్ ప్రెసిడెంట్ పితాంబరరావు, ఆసుపత్రి వైద్యులు, పారామెడికల్ సిబ్బంది, ఇతర ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఈటెల రాజేందర్ నవరాత్రి పూజలు

విశాలాంధ్ర - కాప్రా : దసరా నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్ హైదరాబాద్, నాచారంలోని రహేజా విస్టాస్‌ను సందర్శించారు. దేవీ నవరాత్రుల సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమాలలో పాల్గొన్న ఆయనను రహేజా విస్టాస్ నివాసితులు ఘనంగా స్వాగతించారు. ఈ కార్యక్రమానికి చెన్నా రావు, బీజేపీ కార్యకర్తలు, శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

ప్రతి ఒక్కరికీ దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈటెల రాజేందర్. భవిష్యత్తులో కూడా ప్రజల మధ్య ఉండాలని ఆకాంక్షించారు. ఈ పర్యటనను విజయవంతం చేసిన శంకరమంచి మనోజ్, రహేజా విస్టాస్ నివాసితులకు, ప్రజలకు కార్యకర్తలకు ఈటెల రాజేందర్ కార్యాలయం తరపున కృతజ్ఞతలు తెలియజేశారు.

ఫలక్ నుమా ఆర్వోబీని ప్రారంభించిన మంత్రి పొన్నం

విశాలాంధ్ర - హైదరాబాద్ : జీహెచ్ఎంసీ నిధులు రూ 52.03 కోట్ల వ్యయంతో నిర్మించిన సికింద్రాబాద్ - ఫలక్‌నుమా బ్రాడ్‌గేజ్ లైన్‌లోని ఫలక్‌నుమా వద్ద ఆర్ఓబీకి సమాంతర ఆర్ఓబీని శుక్రవారం హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మితో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, హైదరాబాద్ పార్లమెంట్ సభ్యులు అసుదుద్దీన్ ఒవైసీ , ఎమ్మెల్సీలు మీర్జా రియాజ్ ఉల్ హసన్ ఎఫెండీ, మీర్జా రహమత్ బేగ్, ఎమ్మెల్యేలు మహమ్మద్ ముబీన్, మీర్ జుల్ఫికర్ అలీ, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, చార్మినార్ జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, కార్పొరేటర్‌లు తదితరులు పాల్గొన్నారు. ఆర్వోబీ ప్రారంభంతో ఫలక్ నుమాలో తీరనున్న ట్రాఫిక్ కష్టాలు పాతబస్తీ ఫలక్ నామాలో నేటి నుంచి ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు తీరనున్నాయి. సికింద్రాబాద్ నుంచి ఫలక్ నామా బ్రాడ్ గేజ్ లైన్ వద్ద ఉన్న ఆర్వోబీకి సమాంతరంగా జీహెచ్ఎంసీ ఆర్వోబీ నీ నిర్మించింది. రూ.52. కోట్లతో 4 వరుసల్లో ఆర్వోబీని జీహెచ్ఎంసీ నిర్మించింది. పాత ఆర్వోబీని పునరుద్ధరించడంతో పాటు దానికి సమాతరంగా మరో ఆర్వోబీని నిర్మించడంతో బార్కస్ జంక్షన్ నుంచి ఫలక్ నామా బస్ డిపో, రైల్వే స్టేషన్, చార్మినార్ వైపు వెళ్లే వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తొలగనున్నాయి. సమయం ఆదాతో పాటు గంటల తరబడి నిలిచిపోయే ట్రాఫిక్ నుంచి ఊరట లభించనుంది. ఫలక్‌నుమా ఆర్ఓబీనీ ప్రారంభించి అందుబాటులోకి తీసుకురావడం పట్ల స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అణ్వస్త్రాలు మానవాళికి ప్రమాదకరం

విశాలాంధ్ర - బషీర్ బాగ్: ప్రపంచంలో "అణ్వస్త్రాలు - అత్యంత దుష్టం" అని, అణు యుద్ధం మానవాళికి తిరుగులేని విపత్తుని ఇంటర్నేషనల్ ఫిజీషియన్స్ ఫర్ ది ప్రివెన్షన్ ఆఫ్ న్యూక్లియర్ వార్ 24వ ప్రపంచ కాంగ్రెస్ ప్రారంభ సభలో వక్తలు హెచ్చరించారు. ఐపిపిఎన్‌డబ్ల్యూ 24వ ప్రపంచ మహాసభ జపాన్ దేశంలోని, నాగసాకి పట్టణంలో శుక్రవారం ఘనంగా ప్రారంభమైయ్యాయి. భారత్‌తో పాటు 82 దేశాల నుండి వైద్యులు ప్రతినిధులుగా పాల్గొనగా, ఐక్యరాజ్యసమితి అణు నిరాయుధీకరణ వ్యవహారాల కార్యాలయం అండర్ సెక్రటరీ జనరల్ ఇజుమి నాకమిట్సు వీడియో సందేశం ద్వారా కీలక ప్రసంగం చేస్తూ వైద్యుల పాత్ర కేవలం ఆసుపత్రుల వరకు పరిమితం కాకుండా, ప్రజారోగ్య పరిరక్షణలోనూ కీలకంగా వ్యవహరించాలన్నారు. హిరోషిమా - నాగసాకిలో 80 ఏళ్ల క్రితం జరిగిన బాంబుదాడుల గాయాలు ఇంకా మానలేదని, ప్రస్తుతం ప్రపంచంలో ఉన్న సుమారు 1,200 అణు ఆయుధాలు మానవజాతికి ఎంతటి ముప్పో ఆయన స్పష్టం చేశారు. "ఇకపై హిరోషిమా లేదు, ఇకపై నాగసాకి లేదు" అనే శాంతి సంకల్పాన్ని తరతరాలకు వారసత్వంగా అందించాలని పిలుపునిచ్చారు. భారత ప్రతినిధిగా పాల్గొన్న ఇండియన్ డాక్టర్స్ ఫర్ పీస్ అండ్ డెవలప్మెంట్ (ఐడిపిడి) జాతీయ నాయకులూ, అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ దిడ్డి సుధాకర్ మాట్లాడుతూ అణ్వస్త్రాలు వివిధ దేశాల్లో శక్తి ప్రతీకలుగా కొనసాగడం మానవాళికి ప్రమాదకరం అని తెలిపారు. వివిధ దేశాలలో యురేనియం గనుల విస్తరణతో పాటు, ఉన్న ప్రదేశాలను శుభ్రపరచకపోవడం వల్ల సమాజం తీవ్ర ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటోందని వివరించారు. పాలస్తీనాలోని గాజా పిల్లలు, జపాన్‌లోని హిరోషిమా నాగసాకి పిల్లలు ఒకే విధమైన మానసిక గాయాలు, బాధలు పంచుకుంటున్నారని పేర్కొన్నారు. మానవజాతి భవిష్యత్తు కోసం, అణు నిరాయుధీకరణ ఉద్యమాలను ప్రపంచ వ్యాప్తంగా పటిష్టంగా నిర్మించాలని డాక్టర్ దిడ్డి సుధాకర్ పిలుపునిచ్చారు. ఈ మహాసభలో ఐపిపిఎన్‌డబ్ల్యూ సహాధ్యక్షుడు డా. కార్లోస్ ఉమానా, ప్రఖ్యాత శాస్త్రవేత్త డా. టాట్సుజిరో సుజుకి, ఐకాన్ కార్యనిర్వాహక అధికారి మెలిస్సా పార్క్ తదితరులు ప్రసంగించారు. భారత్ 10 రాష్ట్రాల నుండి డా. అరుణ్ మిత్ర నేతృత్వంలో సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు పశ్య పద్మ, డాక్టర్ కూనంనేని రజిని, డా. సమతా, డా. మాధవి, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహాసభ వేదికపై శాంతిదూత, జాతిపిత మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

కోనేరు హంపీకి 'ధైర్య' పురస్కారం అందజేత

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : కోనేరు హంపికి వెంకయ్య నాయుడు చేతులు మీదుగా "ధైర్య" పురస్కారం అన్నమాచార్య భావనా వాహిని అన్నమయ్యపురంలో డా.శోభారాజు ఆధ్వర్యంలో జరుగుతున్న "నాద బ్రహ్మోత్సవ్- 2025" కార్యక్రమంలో అందజేశారు. ఇందులో భాగంగా శోభారాజుచే శిక్షణ పొందిన అన్నమాచార్య భావనా వాహిని సంస్థ విద్యార్థులు "అర్జున్, కృతిక, హరిని, అభినవ్, అభిరామ్, అక్షయ్, మానస పటేల్, తన్వి, హితస్వి, మోక్ష, కర్ణిక, సువర్ణ, పద్మశ్రీ, జనని భవిష్య, చైత్ర, రన్విత, ఆశ్రిత, అక్షయ, దుర్గాభవాని, వాసంతి, జానకి, డా. శశికళ, మారుతి విజయలక్ష్మి, పార్వతి, బి.వి.శర్మ, ఆహన" సంయుక్తంగా "మాతృదేవోభవ, అంబికే జగదంబికే, చిత్తము కొలది, కొండలలో నెలకొన్న కోనేటి రాయుటివాడు, నానాటి బతుకు నాటకం" అనే సుప్రసిద్ధ అన్నమయ్య సంకీర్తనలను శ్రీ స్వరసిద్ధి వేంకటేశ్వరస్వామి వారికి సభక్తి పూర్వకంగా సమర్పించారు. కాగా, యుక్తా రెడ్డి "హిమగిరి తనయే హేమలతే" అనే సంకీర్తనకు నృత్య కైంకర్యం చేశారు. కాగా ఈ కార్యక్రమానికి భారత్ మాజీ ఉపరాష్ట్రపతి, మంత్రి ఎం.వెంకయ్య నాయుడు, రిటైర్డ్ ఐపీఎస్ జె.డి.లక్ష్మినారాయణ ముఖ్య అతిథులుగా విచ్చేసి ప్రఖ్యాత చెస్ (చదరంగం) గ్రాండ్మాస్టర్, అర్జున పద్మశ్రీ పురస్కార గ్రహీత కోనేరు హంపికి "ధైర్య" అనే పురస్కారాన్ని బహూకరించారు. వెంకయ్య నాయుడు మాట్లాడుతూ, చిత్తశుద్ధి, శ్రీవారి కృప వలనే ఇంత చక్కని నాద బ్రహ్మోత్సవం జయప్రదమైనదని, ఇష్టమైన పనిని కష్టపడైనా చేస్తే నష్టపడేది లేదని చెప్పారు. నేచర్, కల్చర్, టుగెదర్ మేక్ అవర్ ఫ్యూచర్ అని చెప్పి ప్రకృతి భగవంతుని కానుక కావున పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని, సాంప్రదాయ వస్త్రధారణ, పిల్లలు పేర్లు, సినిమాలు మనలో స్ఫూర్తినింపేలా ఉండాలని తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలియ చెప్పారు. అన్నమయ్య కీర్తనలు కోసం శోభారాజు కృషి స్వామి వారి కృప ఆమె అకుంఠిత దీక్ష అని కొనియాడారు. అన్నమయ్య కీర్తనలను స్కూల్ సిలబస్ లోను, మా తెలుగు తల్లి లోను జోడించవలసిన అవసరం ఉందని దీనిపై ప్రభుత్వం వారికి తన విజ్ఞప్తి తెలియజేస్తామని చెప్పారు. అన్నమయ్య పాటల వలన సానుకూల నిర్మాణాత్మక భావం, ఆత్మ విశ్వాసం, ధైర్యం నింపుతాయని, "ఎండ కానీ, నీడ గానీ, ఏమైనా గానీ, కొండలరాయుడే మా కులదైవమూ" అనే సంకీర్తన ద్వారా వ్యక్తపరిచారు. మానవుల ప్రతీ సమస్యకు అన్నమయ్య పాటలో పరిష్కారం తప్పకుండా దొరుకుతుందని, పాపాల్ని ఖండించాలంటే కావలసినది ఖడ్గమే కదా, అటువంటి శ్రీవారి నందకమనే ఖడ్గమైన అన్నమయ్య పాటల ద్వారా భావ కాలుష్యాన్ని ఖండించవచ్చని తెలిపారు. జే.డి.లక్ష్మినారాయణ మాట్లాడుతూ, ఒకే లక్ష్యం సాధించడానికి ప్రణాళిక ఎంత అవసరమో ఆచరణ కూడా అంతే ముఖ్యమని, అన్నమయ్య పాటలు జన బాహుళ్యానికి చేరేందుకు శోభారాజు కృషి అభినందనీయం, అన్నమాచార్య భావనా వాహిని ద్వారా వారు చిన్నారులు నుండి భావి భారత పౌరులు వరకు మంచి విషయాలు నేర్పిస్తూ భక్తి సంగీతం ద్వారా భావ కాలుష్య నివారణ (ట్యూనింగ్ సోసైటీ టు హార్మోనీ) సమాజంలో ఐక్యత చాలా ముఖ్యమని తెలియచేశారు. పిల్లలను ఉద్దేశించి తల్లి తండ్రులు మన వలన గర్వపడాలి, సంతకం ఒక ఆటోగ్రాఫ్ కావాలని, చదువుకునే పాఠశాలలోనే ముఖ్య అతిథిగా అయ్యేలా ఎదగాలని దిశా నిర్దేశం చేశారు.

ఓపెన్ జిమ్ ప్రారంభించిన కార్పొరేటర్

విశాలాంధ్ర - మల్కాజిగిరి : ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలోని ఎస్ఎండిసి కాలనీ నుండి జడ్‌టిసి వెళ్ళే ప్రధాన రహదారి ప్రక్కన ఫుట్ పాత్‌పై ఓపెన్ జిమ్‌ను కార్పొరేటర్ వై.ప్రేమ్ కుమార్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం వేళల్లో వాకింగ్ చేసే వారికి వ్యాయమం చేసుకునేందుకు అనువుగా ఓపన్ జిం ఎంతగానో దోహద పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటేష్ యాదవ్, శ్రీనివాస్, ఉమేష్ సింగ్, సత్యమూర్తి, బాబు, సత్యనారాయణ, వివిధ కాలనీ అసోసియేషన్ సభ్యులు కృష్ణ, శ్రీ మాన్ నారాయణ, పెంటయ్య, శివ రాజ్, సిక్కా ప్రభాకర్ గౌడ్, హరీష్, నర్సింగరావు, బాబురావు, శ్రీనివాస్, శంకర్‌రావు, నహీం ఖాన్, మాజిద్, కిషోర్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

గాంధీ ఆశయాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకం

విశాలాంధ్ర - మొయినాబాద్: మహాత్మా గాంధీ చూపిన అహింసా, శాంతి మార్గం ద్వారానే సమాజంలో ఉన్న సమస్యలు, విభేదాలు, వత్తిడులను అధిగమించొచ్చని దామరగిద్ద మాజీ సర్పంచులు మలిపెద్ది వెంకటేశం గుప్తా, మధు సూధన్ గుప్తాలు అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని దామరగిద్ద వార్డులో గాంధీ విగ్రహానికి స్థానిక నాయకులలు, ప్రజలతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం తీసుకువచ్చిన మహాత్మా గాంధీ కేవలం స్వాతంత్ర్య సమరయోధుడు మాత్రమే కాక, అహింసా సిద్ధాంత పితామహుడని, ఆయన ఆశయాలు ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకమని అన్నారు. ప్రజల్లో శాంతి, సౌభ్రాతృత్వం నెలకొల్పడంలో ఆయన చూపిన మార్గం ఎంతో ప్రాధాన్యత కలిగి ఉన్నాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా గాంధీ జయంతి వేడుకలు

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : తెలంగాణ రాష్ట్రం లోక్ జనశక్తి పార్టీ రామ్ విలాస్ లేబర్ సెల్ జనశక్తి మజ్దూర్ సభ ఆధ్వర్యంలో బిహెచ్‌ఇఎల్‌లో గాంధీ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు సురేందర్ గాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గాంధీ సేవలను కొనియాడారు. నాడు మహాత్మా గాంధీజీ హైంసావాదంతో స్వాతంత్రాన్ని మనకు సంపాదించి పెట్టారని కొనియాడారు. కాగా నేడు దేశంలో అహింస పెరిగిపోయి ఎన్నో మారణ హెూమాలు జరుగుతుండడం బాధాకరమని సురేందర్ విచారం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కొడాలి సురేష్ మోహన్ ఎలేందర్ తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డిలో యువకుల మధ్య వాగ్వివాదం

కత్తిపోట్ల కలకలం.. ఐదుగురికి గాయాలు..

విశాలాంధ్ర - హైదరాబాద్ : కామారెడ్డి జిల్లా కేంద్రంలో గురువారం యువకులు పరస్పర దాడులతో వీరంగం సృష్టించారు. ఒక్కరి పై ఒక్కరు కత్తులతో దాడులు చేసుకోవడంతో భయానక వాతావరణం నెలకొంది. గురువారం ఒకరిపై ఒక్కరు అర్ధరాత్రి కత్తిపోట్ల కలకలం రేపాయి. స్థానికంగా ఏర్పాటు చేసిన శాస్త్రి దుర్గామాత దాండియా వద్ద రెండు గ్రూపుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఈ నేపథ్యంలో మద్యం మత్తులో ఉన్న యువకులు ఒకరిపై ఒకరు పరస్పరం కత్తులతో దాడి చేసుకున్నారు. ఈ దాడిలో ఐదుగురు యువకులకు చేతులు, పొట్ట, వీపు భాగలలో గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు పోలీసులకు సమచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని రెండు గ్రూపులను చెదరగొట్టారు. అనంతరం గాయపడిన యువకులను చికిత్స నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాయపడ్డ వారిని రాహుల్, మణిరాజు, మణికంఠ, కిరణ్, బాలాజీలుగా గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. దీంతో స్థానికులు.. భయాందోళనకు గురయ్యారు.

ఇండియన్ ఆయిల్ డైరెక్టర్‌గా సౌమిత్ర పీ శ్రీవాస్తవ బాధ్యతల స్వీకరణ

విశాలాంధ్ర - జూబ్లీహిల్స్ : ఇండియన్ ఆయిల్‌లో డైరెక్టర్ (మార్కెటింగ్)గా సౌమిత్ర పీ శ్రీవాస్తవ బాధ్యతలు స్వీకరించారు. ఇండియన్ ఆయిల్లో మూడు దశాబ్దాలకు పైగా అనుభవం ఉంది. ఐఐటీ రూర్కీ నుంచి సివిల్ ఇంజినీరింగ్ పట్టభద్రులు. ముంబైలోని ఎస్‌పీ జైన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్, రీసెర్చ్ నుంచి ఎగ్జిక్యూటివ్ ఎంబీఏ పట్టా పొందారు. ఎల్‌పీజీ వ్యాపార విభాగంలో నాలుగేళ్లు పని చేసిన తర్వాత సేల్స్ విభాగంలో పలు కీలక పదవులు నిర్వహించారు. ఈ సమయంలో వ్యాపార విస్తరణలో కీలకంగా మారారు. ఎగ్జిక్యూటివ్‌గా దిగువ స్థాయి ఆపరేషన్స్, మార్కెటింగ్, స్ట్రాటజీ రంగాలలో విస్తృత అనుభవం కలిగి ఉన్నారు. వ్యాపార వృద్ధి, లాభదాయకత, వినియోగదారుల సంతృప్తి వంటి అంశాలలో మంచి రికార్డు ఆయన సొంతం. ఆయన నాయకత్వంలో నాన్-ఫ్యూయల్ కన్వీనియన్స్ స్టోర్స్, ధ్రువ రిటైల్ ట్రాన్స్‌ఫార్మేషన్ ప్రాజెక్ట్ వంటి ప్రధాన ప్రాజెక్టులు విజయవంతంగా అమలయ్యాయి. పలు సాంకేతికత, డిజిటలైజేషన్ ప్రాజెక్టులను కూడా ముందుకు నడిపారు. వరిటైల్ ట్రాన్స్‌ఫార్మేషన్ గ్రూప్ హెడ్‌గా, ఉత్తర, తూర్పు భారతానికి రిటైల్ బిజినెస్ హెడ్‌గా పని చేశారు. న్యూ ఢిల్లీ, ముంబైలోని డివిజనల్ కార్యాలయాలు నడిపిన అనుభవం ఉంది. పశ్చిమ ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్ ప్రాంతాల్లో సేల్స్ విభాగాన్ని నడిపిన విస్తృత ఆపరేషనల్ నైపుణ్యం ఆయన సొంతం. మహారాష్ట్ర, గోవా రాష్ట్రాల హెడ్ ఆఫ్ స్టేట్‌గా పని చేసిన సమయంలో ప్రధాన ఉత్పత్తులు, వ్యాపారాలను విజయవంతంగా నిర్వహించారు.

35 స్థానాల్లో పోటీ చేస్తాం

పెద్ద పార్టీలు సర్దుబాటు చేసుకోవాలి

బీహార్ ఎన్నికలపై సీపీఐ, సీపీఎం

పట్నా: బీహార్ అసెంబ్లీ ఎన్నికల కోసం మహాకూటమి సన్నద్ధమవుతోంది. కూటమి భాగస్వాములతో సీట్ల సర్దుబాటుపై చర్చలు మొదలుపెట్టింది. ఇదే క్రమంలో తమకు 35 స్థానాలు కావాలని సీపీఐ, సీపీఎం శుక్రవారం డిమాండ్ చేశాయి. జాప్యం చేయకుండా సీట్లు ఖరారు చేయాలని కోరాయి. మహా కూటమి తరపున సీఎం అభ్యర్థిగా ఆర్‌జేడీ నాయకుడు తేజస్వీ యాదవ్‌ను ప్రకటించాలన్నాయి. సీపీఐ 24 స్థానాలు, సీపీఎం 11 స్థానాల్లో పోటీ చేయాలని కోరుకుంటున్నట్లు తెలిపాయి. పెద్ద పార్టీలు సర్దుబాటు చేసుకోవాలని, తమకు అనుకూలంగా ఉన్న ఎక్కువ స్థానాల్లో పోటీకి అవకాశం ఇవ్వాలని కోరాయి. పట్నాలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీపీఐ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శులు రాం నరేశ్ పాండే, లల్లన్ చౌదరి మాట్లాడుతూ ఎన్నికల సంఘం విడుదల చేసిన తుది ఓటర్ల జాబితాలో పేర్ల తొలగింపును ధ్రువీకరించేందుకు తమ కేడర్‌ను చైతన్యపరిచేలా అన్ని జిల్లాల్లో సంయుక్త సమావేశాలను సీపీఐ, సీపీఎం నిర్వహిస్తాయన్నారు. సీట్ల సర్దుబాటుపై చర్చలను మరింత ఆలశ్యం చేస్తే కూటమికి, రాష్ట్రానికి ప్రమాదకరంగా పరిణమిస్తుందని హెచ్చరించారు. 'క్షేత్రస్థాయిలో నమ్మకమైన కేడర్, బలమైన సంస్థాగత సామర్థ్యం, సైద్ధాంతికంగా కార్యకర్తలపై పట్టున్న పార్టీలు మావి. ఎన్డీయేను గద్దెదించేందుకు ఐదేళ్లుగా క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నాం. మేము ఎక్కువ స్థానాల్లో పోటీ చేస్తే మహాకూటమికి ప్రయోజనం కలుగుతుంది' అని చౌదరి అన్నారు. 2020 అసెంబ్లీ ఎన్నికల్లో రెండు పార్టీలు మంచి ప్రదర్శన ఇచ్చినట్లు తెలిపారు. ఆరు స్థానాల్లో పోటీ చేసిన సీపీఐ రెండు చోట్ల గెలిచిందని, సీపీఎం నాలుగు స్థానాలలో పోటీ చేయగా రెండింటిని కైవశం చేసుకుందని అన్నారు. చాలా తక్కువ ఓట్లతోనే తమ అభ్యర్థులు ఓడిపోయారని గుర్తుచేశారు. పేదలు, అణగారిన వర్గాల ఆర్థిక తోడ్పాటుపై ఆధారపడే పార్టీలు కాబట్టి ప్రజల్లోకి వెళ్లేందుకు, మద్దతు కూడగట్టుకునేందుకు తమకు సముచిత సమయం అవసరమన్నారు. సీట్లను ఖరారు చేసేందుకుగాను సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించాలని ఇప్పటికే సూచించినట్లు పాండే, చౌదరి చెప్పారు. 243 మంది సభ్యులు ఉన్న బీహార్ అసెంబ్లీకి జరగాల్సిన ఎన్నికల కోసం షెడ్యూల్‌ను కొద్ది వారాల్లో ప్రకటిస్తారన్నది తెలిసిందే.

మోదీ వివరించాలి

స్వాతంత్ర్య పోరులో ఆర్ఎస్ఎస్ పాత్రపై డి.రాజా సవాల్

న్యూదిల్లీ: స్వాతంత్ర్య సమరంలో ఆర్ఎస్ఎస్ పాత్ర ఏమిటో ప్రధాని మోదీ వివరించాలని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా సవాల్ విసిరారు. భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ)తో పాటే 1925లో ఆర్ఎస్ఎస్ ఏర్పడినప్పటికీ స్వాతంత్ర్య సమరంలో దానికి పాత్ర లేదన్నారు. స్వాతంత్ర్య పోరులో సీపీఐ ముందుండి పోరాడిందని, ఎన్నో త్యాగాలు చేసిందని, వలసవాద పాలన అంతానికి, సంపూర్ణ స్వాతంత్ర్యాన్ని ముందుగా పిలుపు నిచ్చిందని రాజా గుర్తుచేశారు. ఆర్ఎస్ఎస్ ఎక్కడ ఉంది? సామాజిక, సాంస్కృతిక చరిత్రలో ఆర్ఎస్ఎస్ ఏం పాత్ర పోషించింది? మోదీ చెప్పగలరా? అని వరుస ప్రశ్నలు సంధించారు. ఆర్ఎస్ఎస్ విభజన-మతతత్వవాదని దుయ్యబట్టారు. ప్రజలను విభజించడం, దేశ సమగ్రత, ఐక్యతను బెదిరించడమే దానికి తెలుసని రాజా వ్యాఖ్యానించారు. సంకుచిత ఆలోచలతో తిరుగమన విధానాలతో విభజన బుద్ధితో ప్రజలను విడదీసే తత్వంతో దేశ ఐక్యతకు విఘాతం కలిగించే మనస్తత్వంతో ఉండే ఆర్ఎస్ఎస్... స్వాతంత్ర్య సమరంలో పోషించిన పాత్ర ఏమిటో ప్రజలకు మోదీ వివరించాలని సవాల్ విసిరారు. దేశ నిర్మాణంలో ఆర్ఎస్ఎస్ గణనీయమైన తోడ్పాటు అందించిందని ప్రధాని మోదీ, ఆర్ఎస్ఎస్ సర్‌సంఘ్‌చాలక్ మోహన్ భగవత్ చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో డి.రాజా పై విధంగా స్పందించారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

చంద్రబాబుకు రామకృష్ణ లేఖ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: విద్యుత్ ఉద్యోగుల, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం తగిన చర్యలు చేపట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం చంద్రబాబుకు శుక్రవారం ఆయన లేఖ రాశారు. రాష్ట్రంలో అత్యంత కీలకమైనది విద్యుత్ రంగమని, విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు కొంతకాలంగా తమ సమస్యల పరిష్కారం కోసం ఆందోళన చేస్తున్నారని రామకృష్ణ తెలిపారు. రెగ్యులర్ ఉద్యోగుల ప్రధాన సమస్యలతో పాటు కాంట్రాక్ట్ కార్మికులను సంస్థలో విలీనం చేసి... ఉద్యోగ భద్రత కల్పించాలనే డిమాండ్లపై అనేకసార్లు చర్చలు జరిపినప్పటికీ... ఆయా సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదన్నారు. విద్యుత్ సంస్థలలోని కాంటాక్ట్ కార్మికులను క్రమబద్ధీకరిస్తామని ఎన్నికలకు ముందు హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఈనెల 15వ తేదీ నుంచి సమ్మెకు వెళ్లాలనే నిర్ణయంతో ఇప్పటికే విద్యుత్ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ(జేఏసీ) నోటీసు ఇచ్చిందని తెలిపారు. రాష్ట్రంలో పెట్టుబడులు రావాలన్నా... నూతన పరిశ్రమలు నెలకొల్పాలన్నా... పారిశ్రామికవేత్తలను ఆకర్షించాలన్నా నాణ్యమైన విద్యుత్, నిరంతరాయంగా విద్యుత్ ఉత్పత్తి పంపిణీ అవసరమని రామకృష్ణ తెలిపారు. ఇలాంటి కీలక విద్యుత్ రంగంలోని ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు సమ్మెలోకి వెళితే రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి, పంపిణీకి అంతరాయం ఏర్పడే ప్రమాదముందన్నారు. దీని ప్రభావం రైతులపై తీవ్రంగా పడుతుందని, సాగునీరు, తాగునీరు, పరిశ్రమలకు విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు తలెత్తడంతోపాటు సాధారణ ప్రజల జీవనం అస్తవ్యస్తమవుతుందని పేర్కొన్నారు. ఇప్పటికే ఉద్యోగ సంఘాల (జేఏసీ) తమ సమస్యలపై యాజమాన్యంతో అనేకసార్లు చర్చలు, సంప్రదింపులు జరిపినప్పటికీ ఫలితం శూన్యమన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి విద్యుత్ ఉద్యోగుల, కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించి... సమ్మెను నివారించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని రామకృష్ణ డిమాండ్ చేశారు.

అక్కరకు రాని ఎంఎస్‌పీ ఎందుకు?

త్వరలో ఏఐకేఎస్ దేశవ్యాప్త ప్రచారోద్యమం

రైతుల దోషి మోదీ: రావుల వెంకయ్య, క్షీరసాగర్

న్యూదిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ భారతీయ రైతులకు నమ్మకద్రోహం చేశారని, అక్కరకు రాని ఎంఎస్‌పీ ప్రకటించడం ఎందుకని అఖిలభారత కిసాన్ సభ (ఏఐకేఎస్) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజన్ క్షీరసాగర్, రావుల వెంకయ్య ప్రశ్నించారు. మోదీ ప్రభుత్వ రైతు వ్యతిరేక కార్పొరేట్ అనుకూల విధానాలపై ఏఐకేఎస్ అధ్వర్యంలో దేశవ్యాప్త ప్రచారోద్యమం చేపట్టబోతున్నట్లు ఒక ప్రకటన చేశారు. ప్రధానమైన ఆరు రబీ పంటలకు అరకొర కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) ప్రకటించడం ద్వారా రైతుల గాయాలపై మోదీ ప్రభుత్వం కారం చల్లుతోందని విమర్శించారు. వ్యవసాయ రంగంపై ప్రభుత్వ ఆర్థిక పోరునకు ఈ చర్య అద్దం పట్టిందని దుయ్యబట్టారు. సీ2+50 శాతం ఫార్ములా ఆధారిత చట్టబద్ధమైన ఎంఎస్‌పీ కల్పిస్తామన్న హామీ ఏమైందని నిలదీశారు. ప్రకృతి విపత్తులతో సర్వం కోల్పోయి సహాయం కోసం వేచివున్న రైతులకు మొండి చేయి చూపుతూ... సాగు ఖర్చుకూ సరిపోని ఎంఎస్‌పీని ప్రకటించి... కష్టాల్లో ఉన్న వ్యవసాయ రంగాన్ని మరింతగా ఇబ్బంది పెట్టేలా మోదీ ప్రభుత్వ వైఖరి ఉందని వ్యాఖ్యానించారు. అమెరికాతో ద్వైపాక్షిక వాణిజ్య చర్చలు, నేరుగా నగదు బదిలీలకు ఒత్తిడి పెంచుతూ ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) నిర్వీర్యానికి ప్రయత్నిస్తోందని క్షీరసాగర్, రావుల వెంకయ్య విమర్శించారు. వ్యవసాయ రంగ మౌలిక వసతులను కార్పొరేట్లకు దారాదత్తం చేసే ప్రయత్నాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. బ్రిటన్, యూరప్, ఆస్ట్రేలియాతో హడావిడిగా స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాలు (ఎఫ్‌టీఏలు) చేసుకుంటూ... దేశ ప్రయోజనాలను పణంగా పెడ్తేస్తూ... కార్పొరేట్ అనుకూల, రైతుల వ్యతిరేక అజెండాతో మోదీ ప్రభుత్వం ముందుకు వెళుతోందని రావుల వెంకయ్య, క్షీరసాగర్ దుయ్యబట్టారు. రైతులు, భారతదేశ ప్రయోజనాల విషయంలో రాజీ పడే ప్రతి విధానాన్ని ఏఐకేఎస్ అడ్డుకుంటుందని తేల్చిచెప్పారు. ఎంఎస్‌పీకి చట్టబద్ధత, రైతులకు పూర్తి రుణ మాఫీని డిమాండ్ చేశారు. తమ పోరాటాన్ని ఉధృతం చేస్తామని రావుల వెంకయ్య, క్షీరసాగర్ హెచ్చరించారు. మోదీ ప్రభుత్వ వినాశకార విధానాలను తిప్పికొట్టేందుకు సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) భాగస్వాములతో పాటు భావసారూప్యగల సంఘాలు కలిసి రావాలన్నారు. రైతు వ్యతిరేక విధానాలపై దేశవ్యాప్త ప్రచారోద్యమాన్ని ఏఐకేఎస్ చేపట్టబోతోందని ప్రకటించారు. రైతుల హక్కులు, దేశ సార్వభౌమత్వం పరిరక్షణ కోసం ఐక్య పోరాటానికి సిద్ధం కావాలని రైతులు, కార్మికులకు రాజన్ క్షీరసాగర్, రావుల వెంకయ్య పిలుపునిచ్చారు.

సీఆర్ ఫౌండేషన్ సేవలు నిరుపమానం: నారాయణ

వృద్ధులకు జ్ఞాపికలు

విశాలాంధ్ర-శేరిలింగంపల్లి: సీఆర్ ఫౌండేషన్ సేవలు నిరుపమానమని ఫౌండేషన్ గౌరవాధ్యక్షుడు డాక్టర్ కె. నారాయణ అన్నారు. చంద్ర రాజేశ్వర రావు ఆకాంక్షలకు అనుగుణంగా 1999, అక్టోబరు రెండోతేదీ గాంధీ జయంతి రోజున రాజకీయాలకు అతీతంగా వృద్ధాశ్రమం ప్రారంభించి 26 సంవత్సరాలు అయిందని గుర్తు చేశారు. హైదరాబాద్ కొండాపూర్‌లోని సీఆర్ ఫౌండేషన్‌లో జాతిపిత గాంధీ 156వ జయంతిని పురస్కరించుకుని ఆయనకు పలువురు ఘనంగా నివాళులర్పించారు. గాంధీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ అహింసను ప్రోత్సహించిన మహాత్మా గాంధీని హత్య చేసిన గాడ్సేను కొన్ని జాతీయ పార్టీలు పొగడటాన్ని ఖండించారు. వృద్ధాశ్రమ సేవలను చూసి గుంటూరు వాస్తవ్యులు చేబ్రోలు నాగేశ్వరరావు ... తమ విలువైన నాలుగు ఎకరాల భూమిని ఫౌండేషన్‌కు విరాళంగా ఇచ్చారని తెలిపారు. ఆ స్థలంలో వృద్ధాశ్రమాన్ని నిర్మించాలన్న ఆయన కోరికకు త్వరలో కార్యరూపం దాలుస్తామని పేర్కొన్నారు. అనంతరం ఆశ్రమంలో 90 ఏళ్లు దాటిన వృద్ధులకు ఫౌండేషన్ తరపున డాక్టర్ నారాయణ... స్వాతంత్ర్య సమరయోధుడు ఎదమ రామిరెడ్డి, సీనియర్ పాత్రికేయులు ఏబీకే ప్రసాద్, కంచిబోట్ల సుబ్బలక్ష్మి, బి. వేణుగోపాల్, సుమిత్ర చౌదరి, జయ ప్రధాంబ, మువ్వ గురవయ్య, వైదేవి, ,పి. సంపూర్ణమ్మ, డాక్టర్ పి. సరస్వతి, పర్వతనేని లీలా కుమారికి జ్ఞాపికలు అందజేశారు. అనారోగ్యానికి గురై కోలుకుంటున్న సీపీఐ నేతలు ఐదుకల్లు అరుణకుమారి, ఐ.ఎస్.రాజును పరామర్శించారు. ఫౌండేషన్ ట్రెజరర్, వృద్ధాశ్రమ డైరెక్టర్ వి. చెన్నకేశవరావు అధ్యక్షతన జరిగిన సభలో ఫౌండేషన్ కార్యదర్శి, శాసన మండలి మాజీ సభ్యుడు పీజే చంద్రశేఖర రావు, నీలం రాజశేఖర రెడ్డి, రీసెర్చ్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ టి. సురేష్, వృద్ధాశ్రమ కమిటీ సభ్యులు తమ్మారెడ్డి తానియా, డాక్టర్ ఎం. గోపీచంద్, ఎన్.రాజేంద్ర రావు, విశ్రాంత సైంటిస్ట్ మల్లంపాటి వెంకటేశ్వర రావు, హోం మేనేజర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంపై భారీ దాడి

అదే భారత్‌కు అతిపెద్ద ముప్పు

కొలంబియాలో రాహుల్

న్యూదిల్లీ: ప్రజాస్వామ్యంపై భారీ దాడి భారత్‌కు అతిపెద్ద ముప్పు అని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ అన్నారు. 'భిన్న మతాలు, సంప్రదాయాలు, బహుళ భాషలు ఉన్న భారత్‌లో ప్రజాస్వామ్యంపై పెద్ద ఎత్తున దాడి జరుగుతుండటమే దేశానికి అతిపెద్ద ముప్పుగా మారింది. ప్రజల సంభాషణ, సంప్రదాయాలు, మతాలు, ఆలోచనలకు స్వేచ్ఛ కల్పించేదే ప్రజాస్వామ్య వ్యవస్థ' అని వక్కాణించారు. 'భారత్-చైనా రాజకీయ వ్యవస్థల మధ్య పోలిక సరికాదు. దాదాపు 16, 17 వేర్వేరు భాషలు, భిన్నమతాలు ఉన్నాయి. ఈ విభిన్న సంప్రదాయాలు వృద్ధికి అనుమతించడం, భావవ్యక్తీకరణకు స్వేచ్ఛ ఇవ్వడం భారత్ వంటి దేశానికి చాలా ముఖ్యం. చైనా చేసేలా మనం చేయలేం. ఆ దేశానిది నిరంకుశత్వం... మన విధానం అది కాదు' అని కొలంబియాలోని ఈఐఏ విశ్వవిద్యాలయంలో విద్యార్థులతో సంభాషణ సందర్భంగా రాహుల్ అన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చర్యల కారణంగా ఆ దేశంలో చాలా మంది ఉద్యోగాలు కోల్పోయారని గుర్తుచేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఉత్పత్తిని ఎలా నిర్వహించవచ్చో చైనా ప్రపంచానికి ప్రదర్శించింది కానీ, భారతదేశ ప్రజాస్వామ్యంలో అది సాధ్యమా అన్నది ప్రశ్నార్థకమన్నారు.

జీఎస్‌టీ, నోట్ల రద్దు చిన్న వ్యాపారాలు కుదేలు

జీఎస్‌టీ, నోట్ల రద్దు సహా కేంద్ర ప్రభుత్వ ఆర్థిక విధానాలు చిన్న, మధ్యతరహా వ్యాపారాలను దెబ్బతీశాయని, మన ఆర్థిక వ్యవస్థలోని ప్రధాన భాగాన్ని గుత్తాధిపత్యాలు నియంత్రించడానికి అనుమతించాయని తెలిపారు. చిన్న వ్యాపారాలకు మద్దతు ఇవ్వడం వ్యవస్థాపకతకు ముందుకు వెళ్లే మార్గమని నమ్ముతున్నామన్నారు. దేశంలో కేంద్రీకృత స్థాయిలో అవినీతి జరుగుతోందని, ప్రధానమంత్రికి సన్నిహితులైన ముగ్గురు, నలుగురు వ్యాపారాలు మొత్తం ఆర్థిక వ్యవస్థను స్వాధీనం చేసుకుంటున్నారని రాహుల్ వ్యాఖ్యానించారు.

ఆర్ఎస్ఎస్-బీజేపీ భావజాలంలో పిరికితనం

ఆర్ఎస్ఎస్-బీజేపీ భావజాలంలో పిరికితనం ఉందని రాహుల్ విమర్శించారు. 'చైనా మనకంటే చాలా శక్తివంతమైనది. నేను వారితో ఎలా పోరాడగలను?' అని విదేశాంగ మంత్రి చేసిన ప్రకటన వారిలోని పిరికితనానికి నిదర్శనం. సావర్కర్ తన పుస్తకంలో, తాను, తన కొద్దిమంది స్నేహితులు ఒకసారి ఒక ముస్లిం వ్యక్తిని కొట్టారని, ఆ రోజు వారు చాలా సంతోషంగా ఉన్నారని రాశారు. ఐదుగురు కలిసి ఒకరిని కొడితే, అది వారిలో ఒకరిని సంతోషపెడితే, అది పిరికితనం' అని రాహుల్ అన్నారు. ఇదిలావుంటే, కొలంబియాలో సాధారణ బైకర్‌గా కనిపించిన కాంగ్రెస్ నాయకుడు... భారతీయ ద్విచక్ర వాహన దిగ్గజాలు బజాజ్, హీరో, టీవీఎస్‌లను ప్రశంసించారు. 'కొలంబియాలో బజాజ్, హీరో, టీవీఎస్ బాగా రాణించడం చూసి గర్వపడుతున్నా. భారతీయ కంపెనీలు ఆశ్రిత పక్షపాతంతో కాదు... ఆవిష్కరణతో గెలవగలవని చూపిస్తుంది. చాలా బాగుంది' అని ఆయన 'ఎక్స్'లో పేర్కొన్నారు.

బీజేపీ ఎదురుదాడి

రాహుల్ భారత రాజ్యంతో పోరాడాలనుకుంటున్నారని బీజేపీ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా విమర్శించారు. విదేశాలలో ఇటువంటి ప్రకటనలతో ఆయన 'మరోసారి రాహుల్ గాంధీలాగా ప్రవర్తిస్తున్నారు' అని దుయ్యబట్టారు. ప్రచార నాయకుడు విదేశాలకు వెళ్లి భారత ప్రజాస్వామ్యంపై దాడి చేస్తాడు!' అని 'ఎక్స్'లో పేర్కొన్నారు. కేంద్ర మంత్రి రవిశంకర్ ప్రసాద్ స్పందిస్తూ విజయదశమి సందర్భంగా భారతీయులను పలకరించడానికి బదులుగా, దేశానికి వ్యతిరేకంగా మాట్లాడటాన్నే రాహుల్ ఎంచుకున్నారని ఆరోపించారు. 'ప్రధాని మోదీపై నిరంతరం తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు. సిగ్గు లేకుండా మాట్లాడుతున్నారు. భారతదేశంలో వాక్ స్వాతంత్ర్యం లేదని విదేశాలలో చెబుతున్నారు. రాహుల్ చెప్పేవన్నీ నిరాధారమైనవి. ఆయన విదేశాలలో ఉన్నప్పుడు భారతదేశంలో ప్రజాస్వామ్యం లేదని అంటున్నారు. విదేశాలలో ఉంటూ భారతదేశాన్ని అవమానిస్తున్నారు' అని మండిపడ్డారు.రాహుల్ తన నాలుగు రోజుల దక్షిణ అమెరికా పర్యటనకు ఈ సమయాన్ని ఎంచుకోవడాన్ని కూడా బీజేపీ ప్రశ్నించింది.

ఆర్‌జేడీ గూటికి జేడీయూ ఎమ్మెల్యే సంజీవ్

పట్నా: జేడీ(యూ) సిట్టింగ్ ఎమ్మెల్యే సంజీవ్ కుమార్ శుక్రవారం రాష్ట్రీయ జనతా దళ్ (ఆర్‌జేడీ) గూటికి చేరారు. మాజీ సీఎం, ఆర్‌జేడీ నాయకుడు తేజస్వీ ప్రసాద్ యాదవ్ తదితర ప్రధాన నేతల సమక్షంలో సంజీవ్ కుమార్ ఆ పార్టీ కండువా కప్పుకున్నారు. అగ్రవర్ణ భూమిహార్ వర్గానికి చెందిన కీలక నేతగా ఖగరియా జిల్లాలో సంజీవ్ కుమార్‌కు పట్టున్నది. సంజీవ్ కుమార్ రాకతో ఖగరియా జిల్లాలో ఆర్‌జేడీ బలం పెరుగుతుందని తేజస్వీ యాదవ్ అన్నారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికలు నవంబరులో జరగనున్నాయి. సిట్టింగ్ ఎమ్మెల్యే రాజీనామాతో అధికార ఎన్డీయే ఆ స్థానాన్ని భర్తీ చేసేందుకు అభ్యర్థులను వెతుక్కునే పనిలో నిమగ్నమైంది. ఎన్నికలు వచ్చినప్పుడు నాయకులు టికెట్ల కోసం పార్టీ ఫిరాయించడం మామూలే అని ఓ జేడీ(యూ) నేత అన్నారు.

అందుకే ఐటీ చట్టం మార్పు : పొన్నవోలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్న సామాజిక మాధ్యమ కార్యకర్తల గొంతు నొక్కడమే ధ్యేయంగా ఐటీ చట్టాన్ని సవరించేందుకు కూటమి ప్రభుత్వం మంత్రుల కమిటీ ఏర్పాటు చేసినప్పటికీ వారి ప్రతిపాదనలు న్యాయస్థానాల్లో నిలబడబోవని మాజీ అదనపు అడ్వకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్ రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర పరిధిలోని ఐటీ చట్టానికి మార్పులు చేసే అధికారం రాష్ట్రాలకు ఉండబోవని తెలిసీ మంత్రులతో కమిటీ ఏర్పాటు చేయడం అవివేకమైన చర్యగా పొన్నవోలు అభిప్రాయపడ్డారు. ప్రశ్నించే గొంతులను నొక్కాలని చూస్తున్న ప్రభుత్వ చర్యలు ఎప్పటికీ నెరవేరవని గట్టిగా బదులిచ్చారు. రాష్ట్రంలో అసత్య సమాచారానికి చంద్రబాబే బ్రాండ్ అంబాసిడరు అని, టీడీపీ అధ్వర్యంలో అవాస్తవ వార్తల కర్మాగారం నడుపుతున్నారని ధ్వజమెత్తారు. ఎన్నికలకు ముందు వైసీపీ ప్రభుత్వంపై చంద్రబాబు, పవన్ కల్యాణ్, నారా లోకేశ్, నాటి బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి విషప్రచారం చేశారని, ఒకవేళ కేసులు పెట్టాల్సి వస్తే ముందుగా వారిమీదనే పెట్టాలని డిమాండ్ చేశారు. సామాజిక మాధ్యమ కార్యకర్తల మీద అక్రమంగా సెక్షన్-111 ప్రయోగించి వారి జీవితాలను కూటమి ప్రభుత్వం నాశనం చేయాలని చూసిందని, జగన్ ఆదేశాలతో న్యాయస్థానాల్లో పోరాడుతున్నామని అన్నారు. వైసీపీ లీగల్ సెల్ కృషి ఫలించి సామాజిక మాధ్యమ కేసుల్లో 111 సెక్షన్ విధించడంపై అనేక సార్లు పోలీసులకు కోర్టులు మొట్టికాయలు వేసిన విషయాన్ని పొన్నవోలు సుధాకర్ రెడ్డి గుర్తు చేశారు.

అమరావతిలో పెట్టుబడులకు మలేసియా ఆసక్తి

విశాలాంధ్ర - సచివాలయం: అమరావతిలో రాబోయే ఐదేళ్లలో రూ.ఆరు వేల నుంచి రూ.10 వేల కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు మలేసియా కంపెనీలు ఆసక్తి కనబరిచాయి. మలేసియా ప్రతినిధుల బృందంతో కలిసి మంత్రి నారాయణ అమరావతి నిర్మాణ పనులను శుక్రవారం పరిశీలించారు. అనంతరం సచివాలయంలో వారితో భేటీ అయ్యారు. అమరావతి అభివృద్ధికి భారత్‌తో కలిసి పనిచేస్తామని మలేసియా మంత్రి పప్పారాయుడు తెలిపారు. మలేసియాలో తెలుగు మూలాలు ఉన్న పారిశ్రామిక వేత్తలకు చెందిన వివిధ కంపెనీల ప్రతినిధులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తమ ప్రాజెక్టుల గురించి మంత్రి నారాయణకు వివరించారు. విద్య, పర్యాటకం, ఆతిథ్యం, వాణిజ్యం, రియల్ ఎస్టేట్ (టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్, అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన), తెలుగు సంస్కృతి, సంప్రదాయాలకు చెందిన వివిధ ప్రాజెక్ట్‌ల్లో పెట్టుబడులకు ఆసక్తి కనబరిచారు. వైద్య విశ్వవిద్యాలయం ఏర్పాటుకు మలేసియాలోని సైబర్ జయ వర్సిటీ, ఫైవ్‌స్టార్ హోటళ్ల ఏర్పాటుకు బెర్జయ గ్రూప్ ముందుకొచ్చింది.

టాప్ 5 రాజధానుల్లో అమరావతి: మంత్రి నారాయణ

అమరావతిలో అభివృద్ధి పనులను మంత్రి నారాయణ మలేసియా ప్రతినిధులకు వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో అమరావతి నిర్మాణం చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే రూ.51 వేల కోట్ల విలువైన పనులు ప్రారంభమయ్యాయని, నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేస్తామన్నారు. 360 కి.మీ మేర ట్రంక్ రోడ్లు ,1500 కి.మీ. లే అవుట్ రోడ్లు రెండేళ్లలోగా, అధికారులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులకు చెందిన 4000 ఇళ్లను వచ్చే మార్చిలోగా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. సచివాలయం టవర్లు, అసెంబ్లీ, హైకోర్టు భవనాలను రెండున్నరేళ్లలో పూర్తి చేస్తామన్నారు. ప్రపంచంలో మొదటి ఐదు రాజధానుల్లో ఒకటిగా అమరావతి నిలుస్తుందన్నారు. మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్, సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబు, అదనపు కమిషనర్ భార్గవ తేజ పాల్గొన్నారు.

అరకు కాఫీకి ఛేంజ్ మేకర్ అవార్డుకు సీఎం అభినందనలు

విశాలాంధ్ర- సచివాలయం: అరకు కాఫీతో జాతీయ స్థాయిలో బిజినెస్ లైన్ ఛేంజ్ మేకర్ అవార్డు దక్కించుకున్న గిరిజన సహకార సంస్థను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అభినందించారు. శనివారం సీఎం చంద్రబాబును మంత్రి సంధ్యారాణి, ఎండీ కల్పన కుమారి సచివాలయంలో కలిశారు. జీఐ ట్యాగ్ పొందిన తర్వాత అరకు కాఫీ అంతర్జాతీయ స్థాయిలో ప్రముఖ బ్రాండ్‌గా మారిందని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. ఏజెన్సీ ప్రాంతంలో సేంద్రీయ విధానంలో సాగు అవుతున్న అరకు కాఫీ స్వచ్ఛత, సువాసనలతో పాటు ప్రత్యేక రుచిని కలిగి ఉందన్నారు. ఈ విశిష్టత కారణంగా అరకకు మంచి బ్రాండ్ అనే పేరు వచ్చిందని సీఎం చెప్పారు. కాఫీ సాగు ద్వారా అరకులోని గిరిజనుల జీవన శైలిలో మార్పు వచ్చిందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ఇటీవల జీసీసీ-టాటా కన్స్యూమర్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ మధ్య కుదిరిన అవగాహన ఒప్పందంతో దేశంలో తొలిసారిగా ఆర్గానిక్ సాల్యూబుల్ కాఫీ ఉత్పత్తి కానుందని మంత్రి సంధ్యారాణి వివరించారు. నర్సీపట్నం సమీపంలోని మాకవరపాలెం గ్రామంలో ఆధునిక సాంకేతికతతో కూడిన ఇంటిగ్రేటెడ్ కాఫీ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుతో విలువ ఆధారిత ఉత్పత్తిగా బీన్ టు కప్ మోడల్ అభివృద్ధి కానుందని, తద్వారా అరకు కాఫీకి మరింత మార్కెట్ వస్తుందని మంత్రి వివరించారు. అరకు వ్యాలీకి కాఫీకి ఫైనాన్షియల్ ట్రాన్స ఫర్మేషన్ విభాగంలో అవార్డు దక్కడంపై గిరిజన శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, జీసీసీ ఎండీ కల్పన కుమారిని ముఖ్యమంత్రి ప్రశంసించారు. బిజినెస్ లైన్ నుంచి స్వీకరించిన అవార్డును, ప్రశంసా పత్రాన్ని సీఎం పరిశీలించారు.

విదేశీ పెట్టుబడులకు గమ్యస్థానంగా ఏపీ

ఫ్రాన్స్ పెట్టుబడిదారులతో మంత్రి గొట్టిపాటి

విశాలాంధ్ర-సచివాలయం: విదేశీ పెట్టుబడులకు ఆంధ్ర ప్రదేశ్ గమ్యస్థానంగా నిలుస్తుందని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ స్పష్టం చేశారు. నవంబరు 14, 15 తేదీల్లో విశాఖపట్నం వేదికగా రాష్ట్ర ప్రభుత్వం, సీఐఐ సంయుక్తంగా నిర్వహిస్తున్న అంతర్జాతీయ సదస్సులో ఫ్రాన్స్ పారిశ్రామికవేత్తలు పాల్గొనాలని మంత్రి గొట్టిపాటి కోరారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం తరపున ఫ్రాన్స్ పెట్టుబడిదారులను అధికారికంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ప్యారిస్‌లో ఇండో-ఫ్రెంచ్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ సహకారంతో నిర్వహించిన రోడ్ షో లో మంత్రి గొట్టిపాటి పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న విస్తృత అవకాశాలను మంత్రి గొట్టిపాటి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పెట్టుబడిదారులకు వివరించారు. వ్యవసాయం, ఫుడ్ ప్రాసెసింగ్, ఎలక్ట్రానిక్స్, గ్రీన్ ఎనర్జీ, ఫార్మాస్యూటికల్స్, ఆటోమొబైల్, సైన్స్ అండ్ టెక్నాలజీ రంగాల్లో ఉన్న అవకాశాలను వివరించారు. దీంతోపాటు రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఏపీ ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ-2024 అమలు తీరును ఫ్రాన్స్ పెట్టుబడిదారులకు తెలియజెప్పారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాలు, పారిశ్రామిక వేత్తలకు అనుకూలంగా ఉండే వివిధ ప్రభుత్వ పాలసీలతో పాటు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను పెట్టుబడిదారులు అందిపుచ్చుకోవాలని మంత్రి కోరారు. పెట్టుబడి ప్రోత్సాహకాలు, రోడ్డు అనుసంధానతో పాటు అందుబాటులో ఉన్న వివిధ రకాల సదుపాయాలను ఫ్రాన్స్ పారిశ్రామిక వేత్తలకు మంత్రి గొట్టిపాటి వివరించారు. అనంతరం ఫ్రాన్స్‌లో పునరుత్పాదక విద్యుత్ రంగం సంస్థల్లో ఒకటైన ఈడీఎఫ్ సంస్థ ప్రతినిధులతో మంత్రి సమావేశమయ్యారు. ఆంధ్ర ప్రదేశ్‌లో పునరుత్పాదక విద్యుత్ రంగంలో ఉన్న పెట్టుబడి అవకాశాలను వారికి వివరించారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలంటూ ఫ్రాన్స్ పారిశ్రామిక వేత్తలను మంత్రి గొట్టిపాటి ఆహ్వానించారు. ఈ రోడ్ షో లో ఏపీ ఎకనమిక్ డెవలప్‌మెంట్ బోర్డు సీఈఓ సీఎం సాయికాంత్ వర్మ, సీసీఐఎఫ్ఐ ప్రెసిడెంట్ కౌమార్ ఆనంద, భారత రాయబార కార్యాలయం కౌన్సెలర్ షాలియా షా, ఇతర అధికారులు, వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.